
రాజశేఖర చరిత్రము
రూ॥ 180/-
పేజీలు: 190
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★



మీడియాపై భౌతిక దాడులు పత్రికా స్వేచ్ఛకు భంగం

భారతీయ నర్సును ఉరిశిక్ష నుంచి కాపాడేందుకు సాధ్యమైనంత చేస్తున్నాం

నేడు శుక్లా బృందం భూమికి రాక

లోపలి పేజీల్లో



సంపుటి 08, సంచిక: 225 | మంగళవారం | 15-07-2025 | మహబూబ్‌నగర్ | Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00


## కృష్ణా, గోదావరి నదీ జలాల వివాదం

# చర్చిద్దాం రండి

- తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రులకు కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ పిలుపు

**ఈనెల 16న ఢిల్లీలో కేంద్రమంత్రి సిఆర్ పాటిల్ ఆధ్వర్యంలో సమావేశం**


ఫైల్ ఫొటో

ప్రజాపక్షం/హైదరాబాద్

ఉభయ తెలుగు రాష్ట్రాల మధ్య కృష్ణా, గోదావరి నదీ జలాలకు సంబంధించి నెల కొన్న వివాదాల నేపథ్యంలో కేంద్ర జల శక్తి శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ నెల 16 వతేదీన ఢిల్లీలో జలశక్తి శాఖ మంత్రి సిఆర్.పాటిల్ నేతృత్వంలో నిర్వహించ నున్న సమావేశానికి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రులను ఆహ్వానిస్తూ సోమ వారం సర్కులర్‌ను జారీ చేసింది. కృష్ణా , గోదావరి నదీ జలాలను ఆంధ్రప్రదేశ్ నిబంధనలకు విరుద్ధంగా వినియోగిస్తున్నదని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఎంపిలు, ఎంఎల్‌సిలు, ఎంఎల్‌లు, వివిధ కార్పొరేషన్ చైర్మన్లకు రెండు దఫాలుగా పవర్ ఫాయింట్ ప్రజంటేషన్ ద్వారా సమగ్రంగా వివరించింది. ప్రధానంగా బెసిన్ కాని బెసిన్‌కు పోలవరం ద్వారా బనకచర్లకు నీటి తరలింపునకు సంబంధించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నీటి పారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలు, కేంద్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేయడంతో పాటు రాష్ట్రంలోని అన్ని పార్టీలను ఏకం చేసేందుకు సమావేశాలను నిర్వహించారు. ఈ నేపథ్యంలోనే కేంద్ర పర్యావరణ శాఖ బనకచర్ల ప్రాజెక్టుకు అనుమతులు ఇవ్వలేమంటూ ఈ ప్రతిపాదనలను వెనక్కి పంపింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం కృష్ణా , గోదావరి తరువాయి 2లో

## న్యాయమైన వాటా సాధించడమే లక్ష్యం

- కేంద్ర ప్రభుత్వంపై వత్తిడి పెంచాలి
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయం
- తెలంగాణ ప్రాంతంలో ఉన్న ప్రాజెక్టులకు వెంటనే క్లియరెన్స్ ఇవ్వాలని కేంద్ర సర్కార్‌ను కోరనున్న రాష్ట్ర ప్రభుత్వం
- సిఎం సూచన మేరకు కేంద్ర జలవనరుల శాఖకు మంత్రి ఉత్తమ్ లేఖ

ప్రజాపక్షం/హైదరాబాద్



కృష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణకు న్యాయపరంగా రావాల్సిన నీటి వాటాల సాధ నకు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నిర్ణయించారు. కృష్ణాపై తెలంగాణలో ఉన్న ప్రాజెక్టులకు వెంటనే క్లియరెన్స్ ఇవ్వాలని, నీటి కేటాయింపులతో పాటు ప్రాజెక్టుల నిర్మాణానికి ఆర్థిక సాయం అందించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరనున్నారు. కృష్ణాతో పాటు గోదావరి జలాల విషయంలో తెలంగాణ ప్రయోజనాలను పరిరక్షించుకోవ టంతో పాటు, ఇంతకాలం జరిగిన అన్యాయానికి శాశ్వతమైన పరిష్కారాలను సాధించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సూచ నల మేరకు నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కేంద్ర జల వనరుల శాఖ మంత్రి సిఆర్ పాటిల్ కు సోమవారం లేఖ రాశారు.అదేవిధంగా ఈనెల 16న ఢిల్లీలో కేంద్ర జల శక్తి మంత్రితో సమావేశమై తెలంగాణ నీటి తరువాయి 2లో



# రేషన్ కార్డు.. పేదవాడి ఆత్మగౌరవం

## గుర్తింపు, ఆకలి తీర్చే ఆయుధం

- బిఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో రేషన్ కార్డులు, సన్నబియ్యం ఇవ్వాలనే ఆలోచనే రాలే
- గత పాలకులు ఊళ్లల్లో బెల్టు షాపులు తెరిస్తే...మేము రేషన్ దుకాణాలు తెరుస్తున్నాం
- పదేళ్ళ పాలనలో తుంగతుర్తికి గోదావరి నీళ్లు ఎందుకు తేలేదు?
- ప్రజాపభుత్వంలో దేవాదుల ద్వారా సాగునీరు అందిస్తాం
- 'నూతన రేషన్‌కార్డుల పంపిణీ'లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**తుంగతుర్తికి దేవాదుల నీరు**

'తమకు అవకాశం ఇస్తే మూడు రోజుల్లో తుంగతుర్తికి గోదావరి జలాలు తెస్తామని చెబుతున్న బిఆర్‌ఎస్ నేతలు పదేళ్ళు అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు ఇవ్వలేదు. పదేళ్ళ బిఆర్‌ఎస్ పాలనలో దేవాదుల ప్రాజెక్టు పనులను పూర్తి చేసి తుంగతుర్తి నియోజకవర్గానికి గోదావరి జలాలను ఎందుకు ఇవ్వలేదు. మా ప్రభుత్వం దేవాదుల ప్రాజెక్టును పూర్తి చేసి గోదావరి జలాలు తీసుకవచ్చి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తుంది.'
– ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ప్రజాపక్షం/సూర్యాపేట ప్రతినిధి

రేషన్ కార్డు పేదవాడి ఆత్మ గౌరవం... గుర్తింపు... ఆకలి తీర్చే ఆయుధమని తెలంగాణ రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. తుంగతుర్తి నియో జకవర్గంలోని తిరుమలగిరి మున్సిపల్ కేంద్రంలో సోమవారం నూతన రేషన్ కార్డుల పంపిణీ సంద ర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో ఆయన ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. బిఆర్‌ఎస్ నేతలు పదేళ్ళ పాలనలో పేదలకు రేషన్ కార్డులు, సన్నబియ్యం ఇవ్వాలనే ఆలోచన ఎన్నడు రాలేద న్నారు. ఊర్లలో వారు బెల్టు షాపులను తెరిస్తే మా ప్రజా ప్రభుత్వం రేషన్ దుకాణాలు తెరిచి నూత నంగా 5.61లక్షల కార్డులు ఇచ్చి 3.10 కోట్ల మందికి సన్నబియ్యం ఇస్తుంటే దుకాణాల వద్ద లబ్ధిదారులు బారులు తీరుతున్నారని అన్నారు. ఆ నాడు వ్యవసాయం దండగ అని వారు అంటే తాము అధికారంలో వచ్చిన తరువాత పండుగలా చేసి చూపించామన్నారు. దేశం తలెత్తుకునేలా వరి ధాన్యం ఉత్పత్తి తరువాయి 2లో

## రాష్ట్రపతి వద్ద ఉన్న బిల్లుకు, ఆర్డినెన్స్‌కు

# సంబంధం లేదు

- బిసి రిజర్వేషన్ బిల్లుపై బిజెపి నేతలు న్యాయపరమైన చిక్కులు తెచ్చే యత్నం
- శాసనసభ సమావేశాలు జరగనప్పుడు ఆర్డినెన్స్ తెచ్చే హక్కు ప్రభుత్వాలకు ఉంది
- మంత్రి పొన్నం ప్రభాకర్

ప్రజాపక్షం/హైదరాబాద్



శాసనసభ సమావేశాలు జరగనప్పుడు ప్రజా ఆర్డినెన్స్ తెచ్చే హక్కు రాష్ట్ర ప్రభుత్వాలకు ఉంటుందని రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. బిసి బిల్లు రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉండగా రాష్ట్ర ప్రభుత్వం ఆర్డి నెన్స్ ఎలా తెస్తుందని బిజెపి ఇబిసి నేషనల్ చైర్మన్ లక్ష్మణ్ ఆరోపణలపై గాంధీభవన్‌లో సోమవారం మంత్రి పొన్నం ప్రభాకర్ విలేకరుల సమావేశంలో స్పందించారు. రాష్ట్ర పతి వద్ద ఉన్న బిల్లుకు, ఆర్డినెన్స్‌కు సంబంధం లేదని మంత్రి స్పష్టం చేశారు. బిసి లకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయడానికి న్యాయపరమైన చిక్కులు లేకుండా చేస్తున్నామని తెలిపారు. బిజెపి, బిఆర్‌ఎస్‌లు ఢిల్లీలో దోస్తీ తరువాయి 2లో

# కృష్ణా జలాలను వినియోగించుకుందాం



- పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేస్తాం :డిసిఎం భట్టి విక్రమార్క
- సాగర్ ఎడమ కాలువ రెండవ జోన్‌కు నీటిని విడుదల చేసిన మంత్రులు భట్టి, పొంగులేటి

ప్రజాపక్షం/ ఖమ్మం

కృష్ణా జలాలను ఒడిసిపట్టి సక్రమంగా విని యోగించుకోవాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్ర మార్క తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కృష్ణా జలాలను పూర్తి స్థాయిలో వినియోగిం చుకునే లక్ష్యంతో కృష్ణా నదిపై పెండింగ్ ప్రా జెక్టులను సత్వరం పూర్తి చేసేందుకు కార్యాచ రణ రూపొందించినట్లు ఆయన తెలిపారు. సో మవారం పాలేరు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి సాగర్ ఎడమ కాలువ రెండవ జోన్‌కు రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తో కలిసి సాగు నీటిని విడుదల చేశారు. ఈ సంద ర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ సాగు నీటితోనే వ్యవసాయ తరువాయి 2లో



## అసమానతలు లేని సమాజ నిర్మాణమే

# కమ్యూనిస్టు లక్ష్యం

- పేదల పక్షాన పోరాడేది ఎర్రజెండానే
- ప్రశ్నించినందుకే మావోయిస్టులను చంపుతారా?
- జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాసభల్లో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని



ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి

దేశంలో పెట్టుబడిదారులు కార్మికుల శ్రమను దోపిడి చేస్తున్నా రని, అసమానతలు లేని సమాజం నిర్మించడమే కమ్యూనిస్టు లక్ష్యమని, కమ్యూనిజానికి అంతం లేదని, మానవ సమాజం ఉన్నంతవరకు కమ్యూనిజం ఉంటుందని సిపిఐ రాష్ట్ర కార్య దర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. సోమవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా అంబే ద్కర్ సెంటర్‌లో జరిగిన భారీ బహిరంగ సభకు సిపిఐ జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ అధ్యక్షత వహించగా సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కల్లపల్లి శ్రీనివాసరావు తో కలిసి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అంతకుముందు జిల్లా కేంద్రంలోని సందర్భంగా కేటీకే ఫైవ్ ఇంక్లైన్ ఆర్చి నుండి జయ శంకర్ విగ్రహం మీదుగా అంబేద్కర్ సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. బహిరంగ సభలో సాంబశివరావు మాట్లా డుతూ, ఈ ప్రపంచంలో అత్యంత పెద్ద పార్టీ కమ్యూనిస్టు పార్టీ అని ప్రపంచంలో ఏ దేశంలోనైనా కమ్యూనిస్టులు ఉంటారని, ఇతర బూర్జువా పార్టీలు వారి ప్రాంతాలకు పరిమిత మైతారని అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ 100 సంవత్సరాలుగా పూర్తి చేసుకుందని, నాడు నేడు ఎప్పటికీ పేదల పక్షాన నిలబడేది ఎర్ర జెండా పార్టీ అని ఆయన కొనియాడారు. ఆకలి కోసం దొంగత నాలు చేసే వాడు దొంగ కాదని చట్టపరిధిలో రూ.వేల కోట్లు కొల్లగొట్టే వారు నిజమైన దొంగలు ఇతర పార్టీలో ఉన్నారని అన్నారు. రాష్ట్రంలో పనిచేస్తున్న ఆశ అంగన్వాడి ప్రైవేట్ కార్మి కులకు సమాన పనికి సమాన వేతనం అందించాలన్నారు. దోపి డిని ప్రశ్నించేవాడు కమ్యూనిస్టులైన తరువాయి 12లో



# ఆగస్టులో అసెంబ్లీ సమావేశాలు

## అసెంబ్లీ ప్రాంగణంలో శాసనమండలి పునర్నిర్మాణం

- ఆగస్టు 15లోపు పనులు పూర్తి చేయాలి
- శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఆదేశం
- అగాఖాన్ సంస్థ ప్రతినిధులతో కలిసి పనుల పరిశీలన


ప్రజాపక్షం/హైదరాబాద్

శాసనసభ ప్రాంగణంలో శాసనమండలి పునర్నిర్మాణ పను లను ఆగస్టు 15వ తేదీలోపు పూర్తి చేయాలని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి తరువాయి 12లో

## పౌరులు వాక్ స్వాతంత్ర్యం, భావ ప్రకటన స్వేచ్ఛ

# విలువ తెలుసుకోవాలి

- స్వీయ నియంత్రణ పాటించాలి
- సుప్రీంకోర్టు సూచన



**న్యూఢిల్లీ :** సోషల్ మీడియాలో అభ్యంతరకరమైన పోస్టులను నియంత్రించడానికి మార్గదర్శకాలను పరిశీలిస్తున్న నేపథ్యంలో పౌరులు వాక్ స్వాతంత్ర్యం, భావ ప్రకటనా స్వేచ్ఛ విలువను తెలుసుకోవాలని, స్వీయ నియంత్రణను పాటించాలని సుప్రీం కోర్టు సూచించింది. వజాహత్‌ఖాన్ అనే ఒకే వ్యక్తి పశ్చిమబెంగాల్ సహా అనేక రాష్ట్రాలలో ఎఫ్ఐఆర్ నమోదైన కేసులో పిటిషన్ విచారణను సోమవారం న్యాయమూర్తులు జస్టిస్ బివి.నాగరత్న, జస్టిస్ కెవి.విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం చేపట్టిన సందర్భంగా ఈ సూచనలు చేసింది.జూన్ 23న సుప్రీం కోర్టు అతనికి జులై 14వరకూ బలవంతపు చర్యల నుండి మధ్యంతర రక్షణ కల్పించింది.అయితే వజాహత్ ఖాన్ మరో సోషల్ మీడియా ప్రభావశీలి షర్మిష్ఠ పనోలీ ఒక వీడియోలో మతపరమైన వ్యాఖ్యలు చేశాడని ఆరోపిస్తూ ఒక ఫిర్యాదు దాఖలు చేశారు. అదేతరహా పోస్టులకు అభ్యంతరకరమైన వ్యా ఖ్యలు చేయకూడదని అతని న్యాయవాది కోర్టులో చెప్పారు. 'పౌరులు ప్రాథ మిక హక్కు అయిన వాక్ స్వాతంత్ర్యం, భావ ప్రకటనా స్వేచ్ఛ విలువను తె లుసుకోవాలి. ఉల్లంఘనల విషయంలో రాష్ట్రం జోక్యం చేసుకోవచ్చు. ఎవ్వ రూ రాష్ట్రం జోక్యం చేసుకోవాలని కోరుకోరు' తరువాయి 12లో

# మహిళా డాక్టర్ ఆత్మహత్య

- దంపతుల మధ్య రీల్స్ చిచ్చు
- భర్త తనను నిర్లక్ష్యం చేస్తున్నాడని మనస్తాపంతో బలవన్మరణం
- హనుమకొండ జిల్లాలో విషాద ఘటన



ప్రజాపక్షం/హనుమకొండ

ఇద్దరు యువ డాక్టర్ దంపతుల మధ్య సోషల్ మీడియాలో రీల్స్ చేసే అమ్మాయి ప్రవేశించడంతో తనను నిర్లక్ష్యం చేస్తున్నాడని దంపతులలో మహిళా డాక్టర్ ఆత్మహత్యకు పాల్పడింది. హనుమకొండ జిల్లా హసన్ పర్తిలో సోమవారం ఈ విషాద ఘటన చోటు చేసుకున్నది. వివరాల్లోకి వెళితే నగరంలోని వేర్వేరు ప్రైవేటు ఆసుపత్రులలో యువ దంపతులైన వైద్యులు డాక్టర్ సృజన్, డాక్టర్ ప్రత్యూష పనిచేస్తున్నారు.వారికి ఇద్దరు పాపలు కూడా జన్మించారు. ఈ క్రమంలో ఇటీవల బుట్టబొమ్మ అనే ఐడితో ఇన్‌స్టాగ్రామ్ రీల్స్ చేసే అమ్మాయి డాక్టర్ సృజన్ పనిచేస్తున్న మెడికవర్ హాస్పిటల్ ప్రమోషన్ కోసం రాగా ఆ అమ్మాయితో డాక్టర్ ప్రేమాయణం మొదలు పెట్టాడు. డాక్టర్ సృజన్ వ్యవహార శైలి గురించిన సమాచారం తరువాయి 12లో

# వివాదాలు.. ఘర్షణలు వద్దు

- తొమ్మిదినెలల ద్వైపాక్షిక సంబంధాల్లో మంచి ప్రగతి
- కీలక ఖనిజాల ఎగుమతుల్లో నిర్బంధాలు తొలగించాలి
- చైనా పర్యటనలో వాంగ్‌యీతో కేంద్ర విదేశాంగ మంత్రి జైశంకర్



**బీజింగ్ :** వాణిజ్యంలో పరిమితులతో కూడిన ని ర్బంధ చర్యలను తొలగించాల్సిన అవసరం ఉంద ని చైనా పర్యటనలో ఉన్న విదేశాంగమంత్రి డా. జైశంకర్ అన్నారు. చైనా విదేశాంగమంత్రి వాంగ్ యీతో సోమవారం నాడు చర్చలు ప్రారంభిస్తూ, పైవిధంగా పేర్కొన్నారు. గడచిన తొమ్మిది నెల లుగా భారత్–చైనా మధ్య ద్వైపాక్షిక సంబంధాల సాధారణీకరణలో మంచి ప్రగతి సాధించిన తర్వాత ఇక వాస్తవాధీన రేఖ వెంబడి ఉన్న ఇతర సమస్యలను పరిష్కరించే మా ర్గాలపై దృష్టి సారిం చాల్సిన అవసరం ఉందని చైనా మంత్రి వాంగ్ యీకి జైశంకర్ తన తొలిపలుకుల్లో చెప్పారు. రెండు దేశాలమధ్యా విభేదాలు వివాదాలుగా మారకూడదని, వ్యాపార వాణిజ్యాలలో పోటీ అనేది పంఘర్షణగా మారకూడదని స్పష్టం చేశారు. ఇరుగు పొరుగు సంబంధాలలో అభివృద్ధి కేంద్రంగా సానుకూల మార్గంలో ప్రయాణిద్దా మని చెప్పారు. అదేవిధంగా కీలకమైన ఖనిజ వన రుల ఎగుమతులను చైనా ఆపేయడాన్ని కూ డా స్పష్టంగా తెలిసేవిధంగా జైశంకర్ ప్రధానంగా ప్రస్తావించారు. ఈ విషయంలో నిర్బంధాలు, పరి మితులను అమలుచేసే తరువాయి 12లో

## కొత్త చీఫ్ జస్టిస్

# ఎ.కె. సింగ్

రాష్ట్రపతి ఆమోదముద్ర

ప్రజాపక్షం/హైదరాబాద్



తెలంగాణ హైకోర్టు నూతన ప్రధాన న్యాయ మూర్తిగా జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్ (ఎకె సింగ్) నియామ కానికి రాష్ట్రపతి ఆమోదముద్ర వేశారు. ఈ మేరకు కేంద్ర న్యాయ శాఖ గెజిట్‌ను సోమ వారం పబ్లిష్ చేసింది. సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బిఆర్ గవాయ్ నేతృత్వంలోని కొలీజియం జస్టిస్ ఎకె సింగ్‌ను తెలంగాణ హైకోర్టు సిజెగా బదిలీ చేయాలన్న సిఫార్సులను కేంద్రం సమ్మతించి తరువాయి 2లో



# ప్రపంచం
WORLD NEWS

## ఇండోనేసియాలో భూకంపం

**జకర్తా :** ఇండోనేసియాలో సోమవారంనాడు ఉదయం 11.20 గంటలకు తీవ్ర భూకంపం సంభవించింది. పెద్దసంఖ్యలో ఎవరూ గాయపడినట్లు నివేదికలు అందలేదు. ఐతే దీనివల్ల సముద్రంలో సునామీ ప్రమాదం ఏమీ లేదని భూభౌతిక శాస్త్రవేత్తలు చెప్పారు. ఇండోనేసియా తూర్పు మలుకు రాష్ట్రంలోని తయలిక్కు పశ్చిమంగా 177 కి.మీ దూరంలో 80 కి.మీ లోతున భూకంపం సంభవించిన కేంద్రాన్ని గుర్తించినట్లు అమెరికా జియలాజికల్ సర్వే, పసిఫిక్ సునామీ వార్నింగ్ కేంద్రాలు తెలియజేశాయి. ఈస్టర్న్ ఇండోనేసియాలోని తనింబార్ ఐలాండ్స్‌లో ఈ భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేలుపై 6.9 భూకంప తీవ్రత నమోదైంది. నిజానికి ఇది చాలా తీవ్రమైన భూకంపం. ఇంకా భూమి లోతుల్లో 110 లేదా 200 కి.మీ లోతున కూడా భూకంపాలు సంభవిస్తూ ఉంటాయి. కానీ తక్కువ ఎత్తులో సంభవించే షా లో ప్రకంపనలు అత్యంత ప్రమాదకరమైనవనీ, ఈ ప్రకంపనలు భూమి ఉపరితలపైకి విపరీతమైన శక్తిని విడుదల చేస్తాయని, ఈ శక్తి ప్రభావం వల్ల ఇళ్ళు, బలమైన నిర్మాణాలు ధ్వంసమయ్యే అవకాశాలు ఉన్నాయని శాస్త్రవేత్తలు చెప్పారు. ఈ దేశం 120కి పైగా క్రియాశీల వాల్కనో లావాదేవీల కార్యకలాపాలకు నిలయంగా ఉంది.

## దక్షిణ సిరియా ఘర్షణల్లో 30 మంది మృతి

**డమాస్కస్:** దక్షిణ సిరియాలో రెండు తెగల మధ్య జరిగిన ఘర్షణలో 30 మంది మరణించారు. సువైదా రాష్ట్రంలో సున్నీ బెడౌయిన్ గిరిజన తెగ యోధులకు, డ్రూజ్ మిలిషియాకు మధ్య ఘర్షణ చెలరేగిందని సిరియా దేశీయాంగమంత్రి తెలియజేశారు. డ్రూజ్ వ్యాపారిని డమాస్కస్ సమీపంలో రహదారిపై కిడ్నాప్ చేసిన రెండు రోజుల తర్వాత ఈ ఘర్షణ చెలరేగింది. పరిస్థితిని చక్కదిద్దేందుకు, శాంతిని కాపాడేందుకు సైన్యాలను ఆ ప్రాంతానికి తరలించినట్లు హోంమంత్రి చెప్పారు. గతేడాది డిసెంబరులో ఇస్లామిస్ట్ తిరుగుబాటుదారులు సిరియాలో అల్ బషీర్ ప్రభుత్వాన్ని కూలదోసిన తర్వాత జరిగిన మొట్టమొదటి అతిపెద్ద అంతర్గత సంఘర్షణ ఇదే. దీనిని అత్యంత ప్రమాదకరమైన పరిణామంగా హోం మంత్రిత్వశాఖ పేర్కొంది. ముస్లింమతంలోని షియా వర్గంలో పురాతన మూలాలు గల విభిన్న సంస్కృతులు, సంప్రదాయాలను పాటించే అనేక తెగలు సిరియాలో ఉన్నాయి. ఈ ఏడాది మే నెలలో కూడా డమాస్కస్ సమీపంలో డ్రూజ్ మైనారిటీ మతస్థులకు, ఇస్లామిస్ట్ తెగల గ్రూపులకు, భద్రతా బలగాలకుమధ్య తీవ్ర హింసాత్మక ఘర్షణ చెలరేగింది. డ్రూజ్ తెగల ప్రజలను కాపాడేందుకు తాము దాడులు చేశామని ఇజ్రాయెల్ కూడా ప్రకటించింది.

# పగలు తియ్యని మాటలు రాత్రిళ్ళు బాంబు దాడులు





### పుతిన్‌పై ట్రంప్ విమర్శలు
### ఉక్రేన్‌కు అత్యాధునిక ఆయుధాలు పంపుతాం


**వాషింగ్టన్ :** రష్యా అధ్యక్షుడు పుతిన్ పగటిపూట తియ్య తియ్యని మాటలు మాట్లాడతారని, రాత్రిపూట మాత్రం ఉక్రేన్‌పై బాంబుదాడులతో, క్షిపణి దాడులతో విరుచుకుపడుతూ ఉంటారని ట్రంప్ తాజాగా తీవ్ర విమర్శలు చేశారు. ట్రంప్ క్రమంగా ఉక్రేన్‌కు మద్దతు ఇచ్చే ప్రకటనలు చేస్తున్నారు. రష్యాకు వ్యతిరేకంగా భారీ సుంకాలను ట్రంప్ విధిస్తారన్న వార్తలు వచ్చాయి. దాదాపు 500 శాతం మేరకు సుంకాలు వేస్తారన్న వార్తల్లో నిజానిజాలు తేలాలంటే ట్రంప్ నుండి మరో ప్రకటన రావాల్సి ఉంది. నాటో సెక్రటరీ జనరల్ మార్క్ రట్టేతో సమావేశం తర్వాత ఉక్రేన్‌పై ఆయన ఒక ప్రధాన ప్రకటన చేస్తారన్నది ఇప్పుడు చర్చనీయాంశం.

ఉక్రేన్–రష్యా మధ్య యుద్ధాన్ని ఆపేందుకు మొన్న మొన్నటివరకూ జరిగిన ప్రయత్నాల గురించి ట్రంప్ పూర్తిగా మాట్లాడటం మానేశారు. ఉక్రేన్‌కు పేట్రియాటిక్ గగనతల రక్షణ వ్యవస్థలను సరఫరా చేస్తామని ప్రకటించినప్పటి నుండీ ట్రంప్ వైఖరిలో పూర్తిగా మార్పు వచ్చింది. ఉక్రేన్‌కు అత్యాధునిక ఆయుధాలు పంపుతామని ట్రంప్ చెప్పారు. ఈ ఆయుధాలను ఊరికే పంపడంలేదని, తాము వ్యాపారం చేస్తున్నామని, ఈ ఆయుధాలు పంపినందుకు యూరోపియన్ యూనియన్ నూటికి నూరుశాతం డబ్బులు చెల్లిస్తుందనీ చెప్పారు.పుతిన్‌పై ట్రంప్ విమర్శలకు ముందుగా ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్స్కీ ఒక ప్రకటన చేస్తూ, అమెరికా దౌత్యవేత్త కైత్ కెల్లాంగ్‌తో కీవ్‌లో జరిపిన చర్చలు ఎంతో ఫలవంతమయ్యాయని పేర్కొన్నారు. ఉక్రేన్‌కు అత్యాధునిక ఆయుధాలు సరఫరా చేస్తారన్న అమెరికా ప్రకటనకు లాంఛనంగా హర్షం ప్రకటించారు. ఉక్రేన్‌కు అమెరికా అన్ని రకాల ఆయుధాల సరఫరాలను పెంటగాన్ నిలిపివేసిందని ఈనెల రెండో తేదీన న్యూయార్క్ టైమ్స్ పత్రిక ప్రకటించింది. కానీ ఆ మరునాడే ఆయుధ సరఫరా కొనసాగిస్తామని ట్రంప్ ప్రకటించారు.

ఇటీవల నెలరోజులుగా ఉక్రేన్‌పై రష్యా చాలా ఉద్ధృతస్థాయిలో వందలాది డ్రోన్లు, క్షిపణి దాడులు చేస్తున్నది. కాల్పుల విరమణ చర్చలను పుతిన్ తిరస్కరించారు. ఒక వైపు ఉక్రేన్‌కు ఆయుధాలు సరఫరా చేస్తూ,శాంతి ప్రయత్నాలు చేయడాన్ని పుతిన్ మొదటినుండీ తప్పుపడుతున్నారు. రెండు దేశాలమధ్యా యుద్ధం చెలరేగడానికిగల మూల కారణాలను పరిష్కరించడానికి వీలుగా చర్చలు జరగాలనీ, అప్పుడే జెలెన్స్కీతో ముఖాముఖీ చర్చలకు సుముఖంగా ఉంటానని ప్రకటించారు. కానీ ఇప్పుడు పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. జెలెన్స్కీని ట్రంప్ తప్పుపట్టడం మానేశారు. మరిన్ని ఆయుధాలిస్తామని ప్రకటించారు. పేట్రియాట్ గగనతల రక్షణవ్యవస్థల సరఫరా ద్వారా ఉక్రేన్ అత్యధిక రక్షణకు అండగా ఉంటామని ట్రంప్ ప్రకటించినప్పటినుండీ పుతిన్–ట్రంప్ మధ్య టెలిఫోన్ సంభాషణల ప్రస్తావన ఆగిపోయింది.

**ఉక్రేన్ కిరాయి సైనికులను బంధించిన రష్యా స్పాట్స్ దళాలు**

ఉక్రేన్–రష్యా మధ్య 97 చోట్ల భీకర పోరు జరిగిందని సోమవారంనాడు వార్తలు వెలువడ్డాయి. ఈ విషయాన్ని ఉక్రేన్ కూడా ధృవీకరించింది. ఉక్రేన్‌కు పేట్రియాట్ వ్యవస్థను సరఫరా చేస్తామని ట్రంప్ ప్రకటన వచ్చిన తర్వాత రెండు పేట్రియాట్ రక్షణ వ్యవస్థలను ధ్వంసం చేసినట్లు రష్యారక్షణ వర్గాల నుండి ఒక ప్రకటన వెలువడింది. దొనెట్స్క్‌లో రెండు ప్రాంతాలను రష్యా స్వాధీనం చేసుకుంది. ఒక రాడార్ స్టేషన్‌ను కూడా రష్యా దళాలు ధ్వంసం చేశాయి. ముందురోజు ఆదివారం ఉదయం నికోలాయెస్క ప్రాంతాన్ని రష్యా దళాలు విముక్తి చేశాయి. కాగా దొనెట్స్క్ రిపబ్లిక్ ప్రాంతంలోని కర్లా మార్క్స్ సెటిల్‌మెంట్ స్వాధీనంకోసం జరుగుతున్న పోరాటంలో విదేశీ కిరాయి సైనికులను బంధించినట్లు రష్యా స్పాట్స్ బెటాలియన్ గ్రూపు ప్రకటించింది. కాన్స్టాంటనోవ్కా, వెలికాయా నోవోస్యోల్కా ప్రాంతాలలో ముందుకు వెళుతున్న రష్యా దళాలు క్రాస్నోర్మీస్క్ నగర సమీపానికి చేరుకున్నాయని రష్యా సైనిక వర్గాలు తెలిపాయి.



## ఇమ్రాన్‌ఖాన్ విడుదల కోసం దేశవ్యాప్త ఉద్యమానికి పిటిఐ ప్రణాళిక

**ఇస్లామాబాద్ :** పాకిస్తాన్ మాజీ ప్రధానమంత్రి ఇమ్రాన్‌ఖాన్ జైలుకు వెళ్ళి వచ్చే ఆగస్టు ఐదో తేదీ నాటికి రెండు సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా ఆయనను విడుదల చేసేందుకు పిటిఐ పార్టీ దేశవ్యాప్తంగా ఒక ఉద్యమం చేపట్టేందుకు ప్రణాళిక చేస్తున్నది. కానీ ప్రయత్నాలు మొగ్గలోనే తుంచేసేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నాలు ప్రారంభించింది. గత ఏడాది పిటిఐ పార్టీ అనేక ఉద్యమాలు చేసింది. కానీ ప్రభుత్వం ఈ ఉద్యమాలు తీవ్రంగా అణచివేసింది.ఖైబర్‌పఖ్తున్‌ఖ్వా రాష్ట్ర ముఖ్యమంత్రి అలీ అమీన్ గండాపూర్, ఇతర నాయకులు లాహోర్ వెళ్ళి పిటిఐ పార్టీతో చర్చలు జరపాలని ప్రభుత్వ వ్యవస్థలను కోరారు. గండాపూర్ పాకిస్తానీయులతో మాట్లాడుతూ, వ్యవస్థాగతంగా పిటిఐ పార్టీ తన తప్పులు సరిదిద్దుకుని ముందుకు వెళ్ళేందుకు సిద్ధంగా ఉందనీ, అదేసమయంలో ప్రభుత్వం కూడా సహకరించాలని కోరారు. తన భార్యకూడా జైలులో ఉన్నప్పటికీ ఇమ్రాన్‌ఖాన్ దేశ ప్రయోజనాలు ఆశించి ప్రభుత్వంతో చర్చలకు సుముఖత వ్యక్తం చేశారన్నారు. 190 మిలియన్ డాలర్ల అవినీతి కేసులో అడియాలా జైలులో ఇమ్రాన్‌ఖాన్ శిక్ష అనుభవిస్తున్నారు. 2023 మే నెలలో జరిగిన అల్లర్లకు సంబంధించిన కేసులు కూడా ఇంకా విచారణ లేకుండా ఆయనపై పెండింగ్‌లో ఉన్నాయి. ఇదిలా ఉండగా ప్రధానమంత్రి సలహాదారు రాణా సనావుల్లా సోమవారం ఒక ప్రకటన చేస్తూ దేశాన్ని బలహీనపరచి అస్థిరత్వానికి గురిచేసేందుకే పిటిఐ పార్టీ నిరసన ప్రదర్శనకు ప్రయత్నాలు చేస్తోందని విమర్శించారు.

## దక్షిణాఫ్రికా పోలీసు మంత్రిపై వేటు



**ప్రిటోరియా:** వ్యవస్థీకృత నేరముఠాలతో సంబంధాలున్నాయన్న ఆరోపణలు రావడంతో దక్షిణాఫ్రికా పోలీసు మంత్రి సెంజో మచునుపై దేశాధ్యక్షుడు రామఫోసా తక్షణ క్రమశిక్షణా చర్యలు తీసుకున్నారు. సంబంధిత మంత్రి మచునుపై సస్పెన్షన్ వేటు వేశారు. న్యాయవిభాగంలో పనిచేస్తున్న ప్రొఫెసర్ కచాలియాను తాత్కాలిక పోలీసు మంత్రిగా నియమించారు. ఈ ఘటనపై ప్రభుత్వం దర్యాప్తు చేస్తుందని ప్రత్యక్ష ప్రసార కార్యక్రమం ద్వారా ప్రజలకు రామఫోసా వివరణ ఇచ్చారు. రాజకీయ హత్యలు చట్టాన్ని అమలు చేసే వ్యవస్థలో జరిగే అవినీతి కేసులో జరుగుతున్న దర్యాప్తులలో ఆయన జోక్యం మీద కూడా దర్యాప్తు జరుగుతుందని చెప్పారు. అదేసమయంలో, తాను ఎలాంటి నేరం చేయలేదనీ, నేరం రుజువు చేసుకునేందుకు తాను సిద్ధంగా ఉన్నాననీ సెంజో మచును వివరణ ఇచ్చారు. తనపై వచ్చిన నేరారోపణలను ఖండించారు.

## బంగ్లాదేశ్ స్క్రాప్ వ్యాపారి హత్యపై నిజనిర్ధారణ కమిటీ

**ఢాకా:** బంగ్లాదేశ్ ఓల్డ్ ఢాకాలోని మింట్‌ఫోర్డ్‌లో ఈనెల తొమ్మిదోతేదీన అత్యంత్య క్రూరంగా హిందూ మైనారిటీ వర్గానికి చెందిన సోహాంగ్‌ను పట్టపగలే హత్యచేసిన ఘటనపై బిఎన్‌పి పార్టీ ఒక నిజనిర్ధారణ కమిటీని ఏర్పాటు చేసింది. దేశంలో ఈ ఏడాది డిసెంబరులో సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పార్టీని లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న రాజకీయకుట్రగా ఈ హత్యను బిఎన్‌పి పరిగణిస్తున్నది. ఈ హత్య ఘటనపై వాస్తవాలు వెలికితీసేందుకు ఒక నిజనిర్ధారణ కమిటీ ఏర్పాటు చేసినట్టు బిఎన్‌పి ప్రధాన కార్యదర్శి మీర్జా ఫక్రుల్ అలంఘీర్ సోమవారంనాడు ప్రకటించారు. దేశంలో ఆరోగ్యకరమైన రాజకీయ వాతావరణాన్ని చెడగొట్టి ఫాసిస్టుశక్తులు తలెత్తేందుకు, దేవ్యాప్తంగా అశాంతి సృష్టికి ఒక అనుకూల వాతావరణాన్ని ఏర్పాటు చేసేందుకు ఒక వర్గం ఇలాంటి ప్రయత్నాలు చేస్తోందన్నారు. సోహాంగ్ హత్యకేసులో ప్రత్యక్షంగా పాల్గొన్న నిందితులను ఇంకా పోలీసులు గుర్తుపట్టాల్సి ఉందన్నారు. ఈనెల తొమ్మిదో తేదీన హిందూ మైనారిటీకి చెందిన స్క్రాప్ వ్యాపారి లాల్‌చంద్ అలియాస్ సోహాంగ్ (39)ను పదిమంది వ్యక్తులు పట్టపగలే అతడి దుకాణం నుండి బయటకు ఈడ్చుకువచ్చి బలమైన రాళ్ళతో కొట్టి చంపారు. అతడు చనిపోయాడని నిర్ధారించుకున్న తర్వాత అతడి శరీరంపైన ఎక్కి నృత్యాలు చేశారు. దీనికి సంబంధించి న వీడియోలు సోషల్ మీడియాలో విస్తారంగా అందుబాటులోకి వచ్చాయి. వ్యాపారాన్ని చేసుకోవాలంటే రెండు లక్షల



బంగ్లాదేశ్ టాకాలను చెల్లించాలని మహ్మదుల్ హసన్ మొహిన్ అనే వ్యక్తి పట్టుపట్టాడని, ఆ సొమ్ము ఇవ్వనందుకే అతడు ఇదంతా చేశాడని హతుడి భార్య చెబుతున్నది. అతడితోసహా ఇప్పటివరకూ పోలీసులు మరో నలుగురిని అరెస్టు చేశారు. రాజకీయాలకు, నేరస్తులకు మధ్య సంబంధాలను ఈ ఘటన తెలియజేస్తోందని ఆమె అన్నారు. బిఎన్‌పి తాత్కాలిక అధ్యక్షుడు తారిక్ రహ్మాన్‌ను లక్ష్యంగా చేసుకునే ఇ దంతా చేస్తున్నారని మీర్జా ఫక్రుల్ అలంఘీర్ అన్నారు.

## నైజీరియా మాజీ అధ్యక్షుడు బుహారీ మృతి

**అబుజా:** నైజీరియా మాజీ అధ్యక్షుడు ముహమ్మదూ బుహారీ మరణించారు. ఆయన వయసు 82 సంవత్సరాలు. మొదట దేశాన్ని సైన్యాధికారిగా కుట్రచేసి అధికారం చేసుకుని బలమైన నాయకుడుగా ఎదిగారు బుహారీ. తర్వాత ఆయన ప్రజాస్వామ్యపంథాలో నడిచి ప్రజానాయకుడుగా మారారు. 2015 నుండి 2023 వరకూ రెండు సార్లు దేశనాయకుడుగా ప్రజలతో ఎన్నికై పరిపాలన చేశారు. బుహారీ అధికారంలో ఉండగా ఆయన సహాయకుడుగా పనిచేసిన గర్బా శేహు సోషల్ మీడియా వేదికగా ఒక ప్రకటన చేస్తూ లండన్‌లోని ఒక క్లినిక్‌లో ఆయన మరణించారని పేర్కొన్నారు. నైజీరియా ప్రస్తుత దేశాధ్యక్షుడు బోలా టినుబు వెంటనే స్పందించి బుహారీ సతీమణితో మాట్లాడారు. లండన్ వెళ్ళి బుహారీ మృతదేహాన్ని నైజీరియాకు తీసుకురావాలని దేశ ఉపాధ్యక్షుడు కాషిం శెట్టిమాకు ఆదేశించారు.

## వినియోగించుకుందాం

(మొదటి పేజీ తరువాయి)

రంగం అభివృద్ధి చెందుతుందని ఆయన తెలిపారు. రైతులు సాగునీటిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. నాగార్జున సాగర్ ఎడమ కాలువ పరిధిలోని రైతుల సాగునీటి అవసరాలను దృష్టిలో పెట్టుకుని నీటిని విడుదల చేస్తున్నామన్నారు. గతేడాది సెప్టెంబర్ మాసంలో వచ్చిన భారీ వరదల కారణంగా పాలేరు ప్రాజెక్టు దిగువన సాగర్ కాలువ కొట్టుకుపోయింది. అప్పట్లో తాత్కాలిక మరమ్మతులు చేసి సాగునీటిని అందించిన ఆ తర్వాత ఇప్పుడు శాశ్వత మరమ్మతులు చేసి దాదాపు 14.20 లక్షల రూపాయలతో అండర్ టన్నెల్ సహా కాలువ నిర్మాణాన్ని పూర్తి చేసినట్లు భట్టి విక్రమార్క తెలిపారు. కృష్ణా పరివాహక ప్రాంతంలోని కల్వకుర్తి, నెట్టెంపాడు, బీమా, కోయల్ సాగర్, పాలమూరు, రంగారెడ్డి, ఎస్ఎల్‌బిసి వంటి ప్రాజెక్టులను పూర్తి చేయడంతో పాటు నారాయణపేట, కోడంగల్ ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టామన్నారు. రైతులకు సాగునీటిని అందించడంతో పాటు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పెట్టుబడి సాయాన్ని కూడా అందిస్తుందని ఆయన తెలిపారు. రైతులకు ఆర్థిక చేయూతనివ్వడంతో పాటు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. మన రాష్ట్రం అన్నపూర్ణగా, విత్తన భాండాగారంగా మారిందని భట్టి విక్రమార్క తెలిపారు. ఈ సందర్భంగా రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ సాగర్ ఎడమ కాలువ పరిధి రెండవ జోన్‌లోని రెండున్నర లక్షల ఎకరాలకు నాగార్జున సాగర్ నీటిని విడుదల చేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం 400 క్యూసెక్కుల నీటిని విడుదల చేశామని క్రమ పద్ధతిలో పెంచుతూ ఐదారు రోజుల్లో పూర్తి స్థాయిలో నీటిని కాలువకు విడుదల చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేకపోయినా రైతులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకునేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఆ క్రమంలోనే తొమ్మిది వేల కోట్ల రూపాయల రైతు భరోసా ఖాతాల్లో జమ చేయడం జరిగిందన్నారు. సన్న వడ్లకు కూడా బోనస్ ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, ఇరిగేషన్ ఎస్ఈ ఎం. వెంకటేశ్వర్లు, పాలేరు నియోజక వర్గ ప్రత్యేకాధికారి రమేష్ పాల్గొన్నారు.

## కొత్త చీఫ్ జస్టిస్ ఎ.కె.సింగ్

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రపతికి పంపింది. సోమవారం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆమోదముద్ర వేశారు. త్రిపుర హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా ఎకె సింగ్ చేస్తున్నారు. 1965, జూలై 7న ఆయన జన్మించారు. 1990లో పాట్నా హైకోర్టులో లాయర్‌గా ప్రాక్టీస్ మొదలుపెట్టారు. 2001లో జార్ఖండ్ హైకోర్టుకు ప్రాక్టీస్ మార్చారు. 2012లో జార్ఖండ్ హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2022, డిసెంబర్ నుంచి 2023, ఫిబ్రవరి వరకు జార్ఖండ్ హైకోర్టు యాక్టింగ్ చీఫ్ జస్టిస్‌గా చేశారు. 2023, ఏప్రిల్ 17న పదోన్నతి లభించడంతో త్రిపుర హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా బదిలీ అయ్యారు. తెలంగాణ హైకోర్టు చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే బాంబే హైకోర్టుకు బదిలీ అయిన ఈ ఏడాది జనవరి 21వ తేదీ నుంచి యాక్టింగ్ చీఫ్ జస్టిస్‌గా చేస్తున్న సుజోయ్ పాల్ కోల్‌కతా హైకోర్టుకు బదిలీ అయ్యారు. రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తడకమళ్ల వినోద్ కుమార్‌ను మద్రాస్ హైకోర్టుకు బదిలీ అయ్యారు. మరోవైపు ఎపికి చెందిన జస్టిస్ భట్టు దేవానంద్ ప్రస్తుతం మద్రాస్ హైకోర్టు నుంచి తిరిగి ఎపి హైకోర్టుకు బదిలీ అయ్యారు. ఇదిలా ఉండగా, తెలంగాణ క్యాడర్‌కు చెందిన జార్ఖండ్ హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా చేస్తున్న ఎం.ఎస్. రామచందర్‌రావు త్రిపుర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బదిలీ అయ్యారు. మద్రాస్, రాజస్థాన్ హైకోర్టు చీఫ్ జస్టిస్‌లు కూడా బదిలీ అయ్యారు. తెలంగాణ నుంచి బదిలీపై వెళ్లిన న్యాయమూర్తులు (కర్నాటక నుంచి జస్టిస్ సి. సుమలత, జస్టిస్ కన్నెగంటి లలిత, పట్నా హైకోర్టు నుంచి జస్టిస్ అన్నిరెడ్డి అభిషేక్‌రెడ్డి) తిరిగి తెలంగాణకు బదిలీ చేయాలన్న సిఫార్సులకు ఆమోదం లభించాల్సివుంది. ఇదిలా ఉండగా, తెలంగాణ హైకోర్టులో అడ్వొకేట్స్ కోటా నుంచి నలుగురిని న్యాయమూర్తులుగా నియమించాలన్న కొలీజియం సిఫార్సులు కూడా కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. న్యాయవాదులు గౌస్ మీరా మొహియుద్దీన్, సుద్దాల చలపతిరావు, వాకిటి రామకృష్ణారెడ్డి, గాడి ప్రవీణ్‌కుమార్ నియామకాల అంశం పెండింగ్‌లో ఉంది.

## పేదవాడి ఆత్మగౌరవం

(మొదటి పేజీ తరువాయి)

చేసి తెలంగాణ రాష్ట్రాన్ని నెంబర్ 1గా నిలిపామన్నారు. అప్పుల ఊబిలో కూరుకుపోయిన రైతులను ఆదుకునేందుకు తమ ఆరు నెలల పాలనలో రూ.21వేల కోట్లతో రుణమాఫీ చేసి రైతులను రుణవిముక్తులను చేసిన ఘనత తమ ప్రభుత్వానిదే అన్నారు. 9రోజుల్లోనే రూ.9వేల కోట్లు రైతు భరోసాను రైతుల ఖాతాలో జమ చేశామని చెప్పారు. రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసి బోనస్ క్వింటాకు రూ.500 ఇచ్చామన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును కట్టింది వాళ్ళ హయాంలోనే.. కూలింది కూడా వారి హయాంలోనే అని చెప్పారు. తమకు అవకాశం ఇస్తే మూడు రోజుల్లో తుంగతుర్తికి గోదావరి జలాలు తేస్తామని చెబుతున్న బిఆర్ఎస్ నేతలు పదేళ్ళు అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు ఇవ్వలేదని నిలదీశారు. పదేళ్ళ బిఆర్ఎస్ పాలనలో దేవాదుల ప్రాజెక్టు పనులను పూర్తి చేసి తుంగతుర్తి నియోజకవర్గానికి గోదావరి జలాలను ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. తమ ప్రభుత్వం దేవాదుల ప్రాజెక్టును పూర్తి చేసి గోదావరి జలాలు తీసుకవచ్చి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. ధర్మారెడ్డి, పిల్లాయిపల్లి, బూనాదిగానీ కాల్వలను కూడా పూర్తి చేస్తామని చెప్పారు. మహిళ సాధికారతలో భాగంగా మహిళ సంఘాల్లోని ప్రతి ఆడబిడ్డకు రెండు చీరలు ఇవ్వబోతున్నామని వారికి బ్యాంకుల ద్వారా రూ. 21వేల కోట్లను జీరో వడ్డీతో ఇస్తున్నామని చెప్పారు. జిల్లా కేంద్రాల్లో స్వయం సహాయక మహిళ సంఘాల ద్వారా పెట్రోల్ బంకులు నడిపించి రిలయన్స్ అంబానీలతో పోటీపడేలా, అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు, హాస్టల్‌లలో కూరగాయలు, వంట సరకులు అందించే పనులను, విద్యార్థులకు దుస్తుల కుట్టే పనిని కూడా వారికే అప్పగించామన్నారు. రెండున్నర సంవత్సరాలు పూర్తి అయ్యే లోపు లక్ష మంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని ప్రకటించారు. ఎస్సీ వర్గీకరణను దేశంలోనే అమలు చేసిన మొదటి రాష్ట్రం తెలంగాణ అని గుర్తు చేశారు. వందేళ్ళ తరువాత జన గణనలలో కుల గణన చేసి దేశానికే ఆదర్శంగా నిలిచామన్నారు. త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42శాతం రిజర్వేషన్ అమలు చేస్తామని స్పష్టం చేశారు.

**80శాతం జనాభాకు సన్నబియ్యం పంపిణీ : ఉత్తమ్ రెడ్డి**

తెలంగాణ రాష్ట్రంలోని 80 శాతం జనాభాకు రేషన్ దుకాణాల ద్వారా ప్రజా ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీ చేసి కడుపు నిండ అన్నం పెడుతుందని రాష్ట్ర పౌర సరఫరాల, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ రెడ్డి అన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లానో ప్రతిష్టాత్మకమైన సన్నబియ్యం పంపిణీ, నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం ప్రారంభించడం సంతోషకమన్నారు. గత పదేళ్ళలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వని వారు కూడా తమ ప్రభుత్వంపై విమర్శలు చేయడం హాస్యస్పదంగా ఉందన్నారు. దేవాదుల ప్యాకేజీ 6పనులు ఆగిపోవడంతో తుంగతుర్తి, పాలకుర్తి, స్టేషన్ ఘన్‌పూర్, వర్ధనపేట నియోజకవర్గాలకు సాగునీరు అందించేందుకు రూ. 200 కోట్లు మంజూరు చేయాలని సిఎం రేవంత్ రెడ్డిని కోరారు.నీటిపారుదల విషయంలో తుంగతుర్తి నియోజకవర్గం అన్ని రకాలుగా అభివృద్ధి చేసేందుకు కట్టుపడి ఉన్నామన్నారు.

**బిక్కేరు వాగు బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు**

తుంగతుర్తి ప్రాంతాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని, బిక్కేరు వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి ప్రభుత్వం ఇప్పటికే నిధులు మంజూరు చేసిందని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినీఫోటోగ్రాఫి శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి చెప్పారు. అడ్డగూడూరు, బొల్లొనిగూడెం రహదారి మంజూరు కూడా చేశామని తెలిపారు. రూ. 12వేల కోట్లతో హ్యామ్ రోడ్లు, రూ. 17వేల కోట్లతో పంచాయతీరాజ్ రహదారులను మండల కేంద్రానికి అనుసందానం చేస్తూ నిర్మించనున్నామన్నారు. వీరికి ముందు శాసన మండలి సభ్యులు మహేష్ కుమార్ గౌడ్, భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమీషనర్ చౌహాన్, తుంగతుర్తి శాసన సభ్యులు మందుల సామేల్ సభను ఉద్దేశించి మాట్లాడారు. అనంతరం 11 మంది లబ్దిదారులకు నూతన రేషన్ కార్డులను సిఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా అందించారు. అలాగే రూ. 49కోట్ల 50 లక్షల బ్యాంక్ లింకేజీ రుణాలను మహిళలకు అందజేశారు. దీనికి ముందు తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ రూ. 117.00లక్షలతో 10లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో నిర్మిస్తున్న గోడంకు, నాగారం మండల కేంద్రంలో రూ. 11.25కోట్లతో నిర్మిస్తున్న తహసీల్దార్, మండల పరిషత్, పోలీస్ స్టేషన్ భవనాల నిర్మాణాలకు, అడ్డగూడూరు మండల కేంద్రంలో రూ. 11.25కోట్లతో నిర్మిస్తున్నతహసీల్దార్, మండల పరిషత్, పోలీస్ స్టేషన్ భవన నిర్మాణాలకు, రూ. 5.30కోట్లు విద్యాశాఖ నిధులతో నిర్మిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనానికి సిఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపనలు చేశారు. రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ రావు, డిప్యూటి స్పీకర్ రామచంద్రు నాయక్, మహబూబాద్ పార్లమెంట్ సభ్యులు బలరాం నాయక్, ప్రభుత్వ విప్, ఆలేరు శాసన సభ్యులు బీర్ల ఐలయ్య, నకిరేకల్, భువనగిరి, పాలకుర్తి, దేవరకొండ, మిర్యాలగూడ, నాగార్జునసాగర్, మహబూబాద్, శాసనసభ్యులు వేముల వీరేశం, కుంభం అనిల్ కుమార్ రెడ్డి, యశశ్వినిరెడ్డి, బాలు నాయక్,బత్తులలక్ష్మారెడ్డి,జయవీర్‌రెడ్డి, డాక్టర్ మూరళి నాయక్, ఎమ్మెల్సీలు అద్దంకి దయాకర్, శంకర్ నాయక్, తెలంగాణ టూరిజం కార్పొరేషన్ ఛైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, రైతు కమిషన్ సభ్యులు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు చెవిటి వెంకన్న యాదవ్,ఎఐసిసిసభ్యులురాంరెడ్డి సర్వోత్తంరెడ్డిఉన్నారు.

## సాధించడమే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

వాటాల సాధనతో పాటు, నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టుల అనుమతులు, నీటి కేటాయింపులు, కొత్త ప్రాజెక్టులకు పట్టుబట్టాలని నిర్ణయించారు.

**లేఖలోని ప్రధానాంశాలు :**

తెలంగాణకు సంబంధించిన పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులు, నీటి కేటాయింపులు, అనుమతులు, కృష్ణా, గోదావరి నదీ బేసిన్‌లలో సమస్యలపై కేంద్రం వెంటనే చొరవ చూపాలని లేఖ ద్వారా ఉత్తమ్ కుమార్ రెడ్డి కోరారు. పాలమూరు రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్, డిండి లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలకు ఇప్పటికి క్లియరెన్స్ ఇవ్వాలని, గోదావరి వాటర్ డిస్ప్యూట్స్ ట్రిబ్యునల్ (జిడబ్ల్యూడిటి) అవార్డు ప్రకారం 45 టిఎంసిల కృష్ణా నీటిని నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ పైన వాడుకునే వీలుందని, ఆ నీటినే పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు కేటాయించిందని లేఖలో పేర్కొన్నారు. పాలమూరు, డిండి ప్రాజెక్టుల డీపీఆర్లను కేంద్ర జల సంఘం ఆమోదించాలని ఆ తర్వాత పర్యావరణ శాఖ, సిసికు ఇసి జారీ చేయమని సిఫార్సు చేయాలని కోరారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పడకముందే 2007లోనే డిండి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ ఆమోదం పొందిందని, దీనిని జాతీయ ప్రాజెక్టుగా పరిగణించాలనిప్రధానమంత్రి కార్యాలయం 2010 డిసెంబర్ 10న ప్రతిపాదించిందన్నారు. 2021 సెప్టెంబర్ 21న కేంద్ర జలసంఘానికి సమ్మక్క సాగర్ ప్రాజెక్ట్ (తుపాకుల గూడెంబ్యారేజ్) డిపిఆర్ సమర్పించినట్లు లేఖలో పేర్కొన్నారు.

**కృష్ణా బేసిన్‌లో ఎపి జలదోపిడి :**

కృష్ణా బేసిన్‌లో శ్రీశైలం నుంచి ఇతర బేసిన్లకు ఎపి అక్రమంగా నీటిని మళ్లిస్తోందని, 880 అడుగుల వరకు వద్ద 1.5 లక్షల క్యూసెక్స్‌లు, 841 అడుగుల నుంచి రోజుకు 8 టీఎంసీల నీటిని మళ్లించేలా ఎపి కాల్వల నిర్మాణాలు చేపట్టిందని లేఖల పేర్కొన్నారు. 797 అడుగుల వద్ద రోజుకు 3 టీఎంసీలు తీసుకెళ్లే రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ తో పాటు ముచ్చుమర్రి, మలయాల, గురు రాఘవేంద్ర ప్రాజెక్టులు నిర్మించిందని, తద్వారా కృష్ణా నది నుంచి వరద నీటిని బేసిన్ వెలుపలప్రాంతాలకుమళ్లిస్తోందనిలేఖలో పొందుపర్చారు. 2014లో తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావానికి ముందే కృష్ణా నదిపై ఉమ్మడి రాష్ట్రంలో 287.06 టిఎంసిల సామర్థ్యంతో వివిధ ప్రాజెక్టులు నిర్మాణంలో ఉన్నాయని, 1979లో ఎస్ఎల్‌బిసి, 1984లో మొదలైన కల్వకుర్తి, 1997లో నెట్టెంపాడు,2013లో పాలమూరు రంగారెడ్డి, 2007 లో డిండి, 2005లో కొల్లాపూర్, 2014లో నారాయణపేట కొడంగల్ ప్రాజెక్టులు ప్రారంభమయ్యాయని, కెడబ్ల్యాడిటిఐ అవార్డు ప్రకారం చేపట్టిన ప్రాజెక్టులకు కేంద్ర జల సంఘం అనుమతులు ఇవ్వాలని కోరారు.నిబంధనలకు విరుద్ధంగా ఇతర బేసిన్లకు నీటిని మళ్లించడాన్ని ఎఆర్ఎంబి అడ్డుకోవాలన్నారు.

**బి.ఆర్.అంబేద్కర్ ప్రాణహిత – చేవెళ్ల సుజల స్రవంతి ప్రాజెక్ట్‌కు 30 టిఎంసిలు నీటిని కేటాయించాలి :**

గోదావరి నది జలాలకు సంబంధించి 2007 లో కేంద్ర ప్రభుత్వం ఎఐబిపి సాయంతో తెలంగాణకు జీవనాడిగా డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ప్రాణహిత చేవెళ్ల సుజల స్రవంతి ప్రాజెక్ట్ చేపట్టిందని, ఆదిలాబాద్‌లో తుమ్మిడిహట్టి నుంచి 160 టిఎంసిల నీటిని 7 ఉమ్మడి జిల్లాలలో 16.40 లక్షల ఎకరాల ఆయకట్టుతో పాటు తాగునీటిని అందించేందుకు ప్రతిపాదించిందన్నారు. ఈ ప్రాజెక్టుకు 2010లోనే కేంద్ర జలసంఘం అనుమతించిందని, 2016లో తెలంగాణ, మహారాష్ట్ర మధ్య ఒప్పందం కుదిరిందని తెలిపారు.. ఇప్పుడున్న 20 టిఎంసిల కేటాయింపులను 80 టిఎంసిలకు పెంచాలని కోరారు. గోదావరి నదీ జలాల్లో తెలంగాణకు ఉన్న 968 టిఎంసిల వాటాలో నుంచి 80 టిఎంసిలు ఈ ప్రాజెక్టుకు సర్దుబాటు చేయాలన్నారు.. ఈ ప్రాజెక్టును వేగంగా పూర్తి చేయడానికి కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని,ప్రాజెక్టునిర్మాణానికిఎఐబిపికిందఆర్థిక సాయం అందించాలనిలేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు. జాతీయ నదుల అనుసంధాన ప్రణాళికలో భాగంగా ఇచ్చంపల్లి కావేరి లింక్ కెనాల్ ప్రతిపాదనలున్నాయని, ఇచ్చంపల్లి నుంచి కావేరికి 148 టిఎంసిల నీటి బదిలీలో 50 శాతం తెలంగాణకు ఇవ్వాలని నేషనల్ వాటర్ డెవలప్‌మెంట్ అథారిటీ 2024 మార్చిలో లేఖ రాసిందని తెలిపారు. గోదావరి బేసిన్ నుండి ఇతర బేసిన్‌లకు నీటిని బదిలీ చేసే విషయంపై చర్చలు జరగాల్సినఅవసరముందని లేఖలో మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు.

## చర్చిద్దాం రండి

(మొదటి పేజీ తరువాయి)

నదీజల్లాలో రాష్ట్రానికి న్యాయపరంగా రావాల్సిన ప్రతి చుక్క నీటిని కూడా వదులుకోబోమని, ఇందుకు కేంద్రంలోని అన్ని సంబంధిత సంస్థలతో సంప్రదింపుల ద్వారా సాధించుకోవాలని నిర్ణయించింది .ఇది సాధ్యం కాకపోతే రాజకీయంగా అది కూడా సాధ్యం కాని పక్షంలో న్యాయస్థానాలను ఆశ్రయించడం ద్వారా నీటి హక్కలను పొందాలనే కృత నిశ్చయంతో ప్రభుత్వం ఉన్నట్లు సిఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికే స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో కేంద్ర జల శక్తి శాఖ ఈనెల 16న ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో సమావేశం నిర్వహించనున్నట్లు ప్రకటించడంతో తెలంగాణ ప్రభుత్వం అప్రమత్తమైంది. ఇందులో భాగంగానే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలతో సోమవారం నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి కృష్ణా, గోదావరి నదీ జలాల్లో తెలంగాణకు ముందు నుంచి జరుగుతున్న అన్యాయాలను ఎత్తి చూపుతూ కేంద్ర జల శాఖ మంత్రి సి.ఆర్.పాటిల్‌కు లేఖ రాశారు. ఈ లేఖలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మొదలు, తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం తర్వాత కూడా గడిచిన పదేళ్లుగా రాష్ట్రానికి జరిగిన అన్యాయాలను వివరించారు. తద్వారా కృష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణకు దక్కాల్సిన ప్రతి నీటి బొట్టును సద్వినియోగం చేసుకోవడం, న్యాయపరంగా రావాల్సిన నీటి వాటాల సాధన కోసం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని నిర్ణయించారు. అయితే ఈ సమావేశానికి రావడానికి ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులకు వీలు కలుగుతుందో లేదో తెలియజేయాలని కేంద్రం లేఖలో పేర్కొంది. దీంతో ముఖ్యమంత్రి ఈ సమావేశానికి హాజరు అవుతారా లేదా అనేది మంగళవారం నాటికి స్పష్టత రానుంది.

## సంబంధం లేదు

(మొదటి పేజీ తరువాయి)

గల్లిలో కుస్తీ మాదిరిగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. బిసి రిజర్వేషన్ల బిల్లు విషయంలో బిజెపి నేతలు న్యాయపరమైన చిక్కులు తెచ్చే ప్రయత్నం చేస్తుందని అన్నారు. కచ్చితంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని, స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసి నేతలు పెరుగుతారని తెలిపారు. ''బిజెపిలో బిసి నేతలకు ప్రాధాన్యత ఇవ్వాలి కాబట్టి లక్ష్మణ్‌కు పదవులు వస్తున్నాయి. బిసిలకు అన్యాయం చేయడానికి జాతీయ అధ్యక్ష పదవి ఇస్తామంటే లక్ష్మణ్ వెళ్లొద్దు'' అని అన్నారు. ఇక్కడ బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు అయితే అన్ని రాష్ట్రాల్లో అమలవుతాయన్నారు. తెలంగాణ కుల గణన విప్లవాత్మక నిర్ణయమని బిజెపిలోని స్వయం సేవక్ సంఘ్ విశ్వహిందూ పరిషత్ వాళ్లు కూడా కాంగ్రెస్ పార్టీ చేస్తున్న దానిని స్వాగతిస్తున్నారని తెలిపారు. బిజెపి నేతలు బండి సంజయ్, ఈటల రాజేందర్, ధర్మపురి అరవింద్, ఆర్.కృష్ణయ్య, లక్ష్మణ్ బిసి బిడ్డలని, బిసిలకు అన్యాయం చేయకుండా చూడాలని మంత్రి కోరారు. తెలంగాణలో 42 శాతం రిజర్వేషన్లు అమలు కావడానికి ప్రధానమంత్రిని కలవడానికి సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో 42 శాతం రిజర్వేషన్ల కోసం ఎవరు అడ్డం పడవద్దని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఒక వేళ బలహీన వర్గాలకు ఎవరు అన్యాయం చేసినా చూస్తూ ఊరుకోమన్నారు. **మహిళల పట్ల కాంగ్రెస్‌కు గౌరవం ఉంది..** మహిళల పట్ల కాంగ్రెస్ పార్టీకి అపారమైన గౌరవం ఉందని, మహిళల పట్ల ఎంఎల్‌సి మల్లన్న అలా మాట్లాడడం సరైంది కాదని,కాంగ్రెస్ పార్టీ, ప్రజాస్వామ్యవాదులు ఆయన వ్యాఖలను ఖండిస్తున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## నేటి నుంచి బెంగుళూరులో ఎఐసిసి బిసి సలహా మండలి సమావేశాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఎఐసిసి) వెనుకబడిన తరగతుల (బిసి) సలహా మండలి సమావేశాలు ఈ నెల 15వ తేదీ నుంచి రెండు రోజుల పాటు బెంగుళూరులో జరగనున్నాయి. ఈ సమావేశాలకు తెలంగాణ రాష్ట్రం నుంచి ఏడుగురు కాంగ్రెస్ నేతలకు ఆహ్వానం అందింది. టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్ కుమార్ గౌడ్ నేతృత్వంలో ఏడుగురు ప్రతినిధి బృందం సమావేశాలకు హాజరుకానుంది. మహేష్‌కుమార్ గౌడ్‌తో పాటు మంత్రి పొన్నం ప్రభాకర్, సీనియర్ నాయకులు వి.హనుమంతరావు, ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరుకానున్న మంత్రులు కొండా సురేఖ, వాకిటి శ్రీహరి, ఎంపి ఎం.అనిల్‌యాదవ్, మాజీ ఎంపి మధుయాష్కీ గౌడ్ పాల్గొననున్నారు. తెలంగాణలో అమలు చేసిన బిసి కుల గణన, స్థానిక ఎన్నికలలో సంస్థలలో 42 శాతం బిసి రిజర్వేషన్ల తదితర అంశాలపై చర్చించనున్నట్లు టిపిసిసి ఒక ప్రకటనలో తెలిపింది.

## గ్రామీణ స్థాయి నుండి విద్యా వ్యవస్థ బలోపేతం

### నియోజకవర్గానికి ఒక ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్
### రాష్ట్ర ఐటి పరిశ్రమ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు



**ప్రజాపక్షం/మహాదేవపూర్:** గ్రామీణ స్థాయి నుండి విద్యా వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని, ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దాలనే లక్ష్యంతో నియోజకవర్గానికి ఒక ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల కాంప్లెక్స్ నిర్మించటానికి ప్రభుత్వం పని చేస్తుందని రాష్ట్ర ఐటి పరిశ్రమల శాఖమంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలల ఆవరణలో స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ సౌజన్యంతో విద్యార్థులకు షూస్ పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మొదటగా అటవీ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ట్రేడ్ కార్పోరేషన్ చైర్మన్ ఐత ప్రకాష్ రెడ్డితో కలిసి మొక్కలు నాటారు. అనంతరం 650 మంది విద్యార్థులకు పాఠశాల, స్పోర్ట్స్ షూస్ పంపిణీ చేసారు. అనంతరం ఖేల్ ఇండియా కార్యక్రమంలో భాగంగా ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేసారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ ప్రభుత్వం విద్యా వ్యవస్థను మెరుగు పరిచేందుకు పెద్ద ఎత్తున కృషి చేస్తుందని అన్నారు. స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యాశాఖకు ప్రాతినిధ్యం వహిస్తూ గ్రామీణ స్థాయి నుండి పాఠశాలలను బలోపేతం చేసేందుకు 'అమ్మ ఆదర్శ పాఠశాల' కార్యక్రమం ద్వారా మౌళిక సదుపాయాలు కల్పించారని, ప్రతీ నియోజకవర్గానికి మోడల్ ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల కాంప్లెక్స్‌లను నిర్మిస్తున్నామని టీచర్ల కొరత లేకుండా నోటిఫికేషన్ వేసి టీచర్ పోస్టులను భర్తీ చేసామని అన్నారు. విద్యార్థులకు ఉచితంగా యూని ఫాం, పుస్తకాలు అందిస్తూ నూతన డైట్ మెనూను తీసుకు వచ్చి నాణ్యమైన ఆహారం అందిస్తున్నామని అన్నారు. ఇప్పటికే నియోజకవర్గంలోని పాఠశాలలకు డ్యూయల్ డెస్కులను పంపిణీ చేసామని అన్నారు. చరిత్ర కలిగిన మహాదేవపూర్ పాఠశాలకు పైలెట్ ప్రాజెక్టుగా తీసుకుని సిఎస్ఆర్ నిధులు సుమారు 15 కోట్ల అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని అన్నారు. త్వరలోనే శంకుస్థాపన చేస్తామని అన్నారు. మహాదేవపూర్ పాఠశాలల ఉపాధ్యాయులు ఉత్తమ ప్రతిభ కనబరుస్తూ విద్యార్థులను స్వంత పిల్లలుగా భావించి మెరుగైన విద్యనందిస్తున్నారని అభినందించారు.

ఇప్పటికే ప్రయివేటు పాఠశాలల నుండి సుమారు 245 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరడం గొప్ప విషయమని హర్షం వ్యక్తం చేసారు. విద్యార్థులు ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని గమనించి రాబోవు రోజుల్లో ప్రభుత్వానికి, గ్రామానికి, తల్లిదండ్రులకు మంచిపేరు తేవాలని అన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ విద్యార్థులు చాల చురుకుగా విద్యనభ్యసిస్తున్నారని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులకు మెరుగైన విద్యనందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని, విద్యార్థుల సౌకర్యార్థం అమ్మ ఆదర్శ పాఠశాల ద్వారా మౌళిక సదుపాయాలు కల్పించామని అన్నారు. అంతే కాకుండా బాలికల కోసం మొట్టమొదటిసారి పాఠశాలలో నాప్కిన్ వెండింగ్ మిషన్‌ను ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు. విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకుని గొప్ప స్థాయికి ఎదగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, అదనపు కలెక్టర్ విజయ లక్ష్మి, జిల్లా విద్యాశాఖాధికారి రాజేందర్, గివ్ ఫౌండేషన్ ప్రతినిధులు అరుణ్, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీమద్ మహాభాగవతం సినీ ప్రాజెక్టు ప్రారంభం

### రామోజీ ఫిల్మ్ సిటీలో చిత్రీకరణ ప్రారంభించిన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి



**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి:** 40 సంవత్సరాల క్రితం దూరదర్శన్ లో రామాయణ వస్తుందంటే రోడ్లన్నీ నిర్మానుష్యంగా ఉండేవని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు.

సోమవారం రామోజీ ఫిల్మ్ సిటీలో "శ్రీమద్ మహాభాగవతం పార్ట్–1" చిత్రీకరణ ప్రారంభోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శాసనమండలి చైర్మన్ గుత్త సుఖేందర్ రెడ్డి, శాసన సభ అధ్యక్షులు గడ్డం ప్రసాద్ కుమార్, రాష్ట్ర రోడ్డు రవాణా, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సుప్రీంకోర్టు న్యాయమూర్తి చలమేశ్వర్, ముఖ్యమంత్రి సలహాదారు నరేందర్ రెడ్డి లతో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాగర్ పిక్చర్స్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ రూపొందిస్తున్న షార్ట్ ఫిలింను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శ్రీమద్ మహాభాగవతం పార్ట్1(మొదటి భాగం) రామోజీ ఫిల్మ్ సిటీలో మీటింగ్ జరగడం గర్వంగా ఉందన్నారు. రామోజీ ఫిలిం సిటీ తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాదులో ఉండటం అంటే నేను గర్వపడుతున్నానని చెప్పారు. రామాయణం, భాగవతం, మహాభారతం మన జీవితంలో, సంస్కృతి సంప్రదాయాల్లో భాగమన్నారు. నేడు తరం మారుతున్న సందర్భంగా ఇలాంటి గొప్ప దృశ్య కావ్యాన్ని తీసి తిరిగి ప్రజలలో ఒక గొప్ప ప్రేరణ కలిగించిన సుధాకర్ కుటుంబం గూర్చి మనందరికి ఒక భావన కల్పించాలనేది, సినిమా తీయాలనే ఒక గొప్ప ఆలోచన వచ్చిన ప్రొడ్యూసర్‌ని సిఎం రేవంత్ రెడ్డి అభినందించారు. 40 సంవత్సరాల క్రితం రోడ్లు నిర్మానుష్యంగా ఉన్నాయంటే ఒకటి టివిలో రామాయణం వస్తుందని, మరొకటి కర్ఫ్యూ జరుగుతున్నప్పుడే అని సిఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. దూరదర్శన్‌కు గుర్తింపు తెచ్చింది కూడా రామాయణమేనని, కొవిడ్ సమయంలో రామాయణం, మహాభారతం,పెద్ద మొత్తంలో చూశారని తెలిపారు.

**రామోజీరావు ఫిల్మ్ సిటీ ఒక అద్భుతం**

రామోజీ ఫిలిం సిటీని అద్భుతంగా నిర్మించారని, దేశానికే కాదు.. ప్రపంచానికే ఆదర్శమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు.

నేను యూనివర్సల్ స్టూడియో చూడలేదు. రామోజీ ఫిల్మ్ సిటీ..దేశంలోనే ప్రత్యేకమైన స్టూడియో. ఇది తెలంగాణలో ఉందని చెప్పేందుకు గర్విస్తున్నాం అని తెలిపారు. ఇక్కడ శ్రీమద్ మహాభాగవతం పార్ట్–1 సినిమా తీయాలన్న ఆలోచన వచ్చినందుకు మూవీ టీమ్‌ను అభినందిస్తున్నామన్నారు. తెలంగాణని 2035 లోపు తెలంగాణను ట్రిలియన్ ఎకానమీగా తీర్చిదిద్దాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పమని, 2047 నాటి 3 ట్రిలియన్ ఎకానమీగా ఉండేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం. దీనికోసం 2047 విజన్ డాక్యుమెంట్ సిద్ధం చేసుకుంటున్నాం. ఇందులో సినీ రంగానికి ప్రత్యేక చాప్టర్ ఉంటుంది. నాడు రామానంద్ సాగర్ తీసిన రామాయణం సీరియల్ ఎంత పాపులర్ అయిందో అదేవిధంగా "శ్రీమద్ భాగవతం పార్ట్–1" సైతం అంత హిట్ కావాలని కోరుకుంటున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి . నారాయణ రెడ్డి, కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రామిరెడ్డి, భగవత్ ఫిలిం ప్రొడక్షన్స్ మోతి సాగర్ అమృత్ సాగర్ చోప్రా, ఆకాష్ సాగర్, రామోజీ ఫిలిం సిటీ ఎండి కిరణ్, శైలజ,రామోజీ ఫిలిం సిటీ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## బంతి పడిందని పాడుబడ్డ ఇంట్లోకి బాలుడు.. షాకింగ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** నాంపల్లి మార్కెట్ ప్రాంతంలోని ఒక యువకుడు చేసిన రీల్ సంచలనంగా మారింది. తాను చేసిన ఈ వీడియో వెనుక ఇంతటి విషయం ఉందా అని ఆ కుర్రాడు ఇప్పుడు షాక్ అయ్యే పరిస్థితి. వివరాల్లోకి వెళ్తే, స్థానికంగా ఉండే ఒక యువకులు క్రికెట్ ఆడుతున్నారు. ఈ క్రమంలో బాల్ పక్కన ఉన్న ఇంట్లో పడింది. లోపలకి వెళ్లి బాల్ తెచ్చుకునే ప్రయత్నంలో అతనికి ఇంట్లో ఒక వింత దృశ్యం కనిపించింది. ఆ ఇంట్లో.. మనిషి అస్థిపంజరాన్ని చూశాడా యువకుడు. దీంతో అతనికి ఒక ఐడియా వచ్చింది. దీనిని రీల్స్ చేస్తే, మంచి వ్యూస్ రావడంతోపాటు, తన స్నేహితుల్ని థ్రిల్ చేయొచ్చని ఆలోచనకు వచ్చాడు. అంతే, తన సెల్‌ఫోన్ తో షూట్ చేసుకుంటూ.. మీకు ఒక షాకింగ్ వీడియో చూపిస్తానంటూ పాడుబడ్డ ఇంట్లోకి వెళ్ళాడు యువకుడు. ఇంటి లోపలతో పాటు,అక్కడే ఉన్న మనిషి అస్థిపంజరం చూపిస్తూ వీడియో రికార్డ్ చేశాడు. ఆ వీడియోను తన ఫేస్ బుక్‌లో పెట్టాడు. అది కాస్తా వైరల్ కావడంతో సదరు రీల్ పోలీస్‌ల వరకూ వెళ్లింది. ఆ వీడియో చూసిన హబీబ్ నగర్ పోలీసులు యువకుడెవరని ఆరా తీసి, అతడ్ని స్టేషన్‌కు పిలిచి వివరాలు అడిగారు.క్రికెట్ ఆడుతుండగా బాల్ ఆ ఇంట్లో పడటంతో తీసుకునేందుకు వెళ్లానని, అక్కడ అస్థిపంజరం కనిపించడంతో మరుసటి రోజు వీడియో తీశానని పోలీసులకు వెల్లడించాడాయువకుడు. దీంతో హబీబ్ నగర్ పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని క్లూస్ టీం సాయంతో ఆధారాలు సేకరిస్తున్నారు. సదరు అస్థిపంజరం ఎవరిదని ఆరా తీస్తున్నారు. అయితే, ఏడు సంవత్సరాలుగా ఆ ఇంట్లో ఎవరూ లేరని, ఇంటి ఓనర్ విదేశాలలో ఉన్నట్లు స్థానికులు పోలీసులకు చెప్పారు.



## ఆసుపత్రిలో రోగిపై అత్యాచార యత్నం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్‌లో దారుణ ఘటన చోటుచేసుకుంది. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళపై వార్డు బాయ్ అత్యాచారయత్నం చేశాడు. ఈ షాకింగ్ ఘటన నగరంలో ని విద్యానగర్ ఆంధ్ర మహిళా సభ ఆస్పత్రిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. అనారోగ్య సమస్యతో ఆంధ్ర మహిళా సభ ఆస్పత్రిలో ఓ మహిళ చికిత్స పొందుతుంది. మహిళా ఒంటరిగా ఉండటం గమనించిన వార్డు బాయ్ ఆమెపై అత్యాచారయత్నానికి ప్రయత్నించాడు. దీంతో అప్రమత్తమైన మహిళ.. బిగ్గరగా తనను కాపాడాలని కేకలు వేసింది. వెంటనే ఆస్పత్రి సిబ్బంది, కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకొని వార్డు బాయ్‌ను పట్టుకుని అతన్ని చితకబాదారు. బాధితులు నల్లకుంట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసు ఘటనపై ఆరా తీస్తున్నారు.

## మాజీమంత్రి జగదీశ్‌రెడ్డి నా ఫోన్ ట్యాపింగ్ చేయించాడు
### బిఎస్‌పి నేత జానయ్య

**ప్రజాపక్షం/హైదరాబాద్:**ఫోన్ ట్యాపింగ్ కేసులో జుబ్లీ హిల్స్ పోలీస్ స్టేషన్‌లో బిఎస్ఇప నేత వట్టే జానయ్య యాదవ్ సోమవారం విచారణకు హాజరయ్యారు . ఫోన్ ట్యాపింగ్ లిస్ట్ లో జానయ్య నెంబర్ ఉండటంతో విచారణకు రావాలని ఆయనకు సిట్ అధికారులు సమాచారం ఇచ్చారు. 2023 ఎన్నికల సమయంలో జానయ్య యాదవ్ ఫోన్ ట్యాప్ అయినట్లు గుర్తించారు. ఆ ఎన్నికలలో సూర్యాపేట నియోజకవర్గ బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థిగా జానయ్య పోటీ చేశారు. ఫోన్ ట్యాపింగ్‌పై ఆధారాలను జానయ్య సిట్ అధికారలకు సమర్పించినట్లు మీడియాకు సమాచారం ఇచ్చారు. అప్పటి బిఆర్ఎస్ మంత్రి జగదీశ్ రెడ్డి తన ఫోన్ ట్యాపింగ్ చేయించాడని వాంగ్మూలం ఇచ్చినట్లుగా తెలిపారు.

## పాతబస్తీలో దారుణ హత్య

**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్ పాతబస్తీలోని చంద్రాయణగుట్టలో గంజాయి, స్టెరాయిడ్స్ అమ్మకాల్లో లాభాల తేడాలపై ఇద్దరు గ్యాంగుల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది.

ఈ గొడవలో అజీజ్ అనే వ్యక్తిని ప్రత్యర్థులు దారుణంగా హత్య చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్ట ం నిమిత్తం ఉస్మానియా మార్చురికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## బిజెపి పాలిత రాష్ట్రాల అంగన్‌వాడీ కేంద్రాల్లో 'కోడిగుడ్డు' నిలిపివేత

### త్వరలోనే పోషకాహార ప్రణాళిక
### మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క





**ప్రజాపక్షం/హైదరాబాద్:**బిజెపి పాలిత రాష్ట్రాల్లో అంగన్‌వాడిలలో అనేక పోషకాలు ఉన్న కోడిగుడ్డు సరఫరాను నిలిపివేశారని, కానీ తెలంగాణ రాష్ట్రంలో మాత్రం చిన్నారులు, గర్భిణీలు, బాలింతలు, కౌమార బాలికలకు పోషకాహారం అందించేందుకు ప్రత్యేక కార్యక్రమాలను అమలు చేస్తున్నామని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క అన్నారు. నిపుణుల సలహా మేరకు అన్ని వయసుల వారికి పౌష్టికాహారం అందించే అంశం పరిశీలనలో ఉందని, త్వరలోనే తెలంగాణ పోషకాహార ప్రణాళికను రూపొందిస్తామని వెల్లడించారు. తెలంగాణ రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంగన్‌వాడి సేవల బలోపేతం, చిన్నారుల్లో పోషకాహార మెరుగుదల, మహిళా స్వయం సహాయక బృందాల భాగస్వా మ్యం వంటి అంశాలపై రాష్ట్ర స్థాయి సమావేశం బేగంపేటలోని టూరిజం ప్లాజాలో సోమవారం జరిగింది.

ఈ సమావేశానికి మంత్రి సీతక్క అధ్యక్షత వహించగా, ఈ సమావేశంలో పోషకాహారంపై పనిచేస్తున్న నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ (ఎన్ఐఎన్), ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్ రీసెర్చ్, సిఎఫ్‌టిఆర్ఐ(మైసూర్), ఎయిమ్స్, ఇక్రిసాట్, యూనిసెఫ్ వంటి ప్రభుత్వరంగ సంస్థలు, ప్రథం, ఆంధ్ర మహిళా సభ, హర్మన్, బాల రక్షభారతి వంటి స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, పోషకాహారం అందించడంలో లైన్ డిపార్ట్ మెంట్లుగా వ్యవహరిస్తున్న పలు సంక్షేమ శాఖలు, పౌరసరఫరాలు, విద్యా శాఖ, టిజి ఫుడ్స్, సెర్ప్, ఐ అండ్ పిఆర్ శాఖల ఉన్నతాధికారులు హాజరై, తమ విలువైన అభిప్రాయాలు తెలియజేశారు. అంగన్‌వాడి లబ్ధిదారులకు రోజుకు 200 మిల్లీ లీటర్ల విజయ పాలు, కిశోర బాలికలకు పోషకాలతో కూడిన పల్లీ, తృణధాన్య పట్టీలు, వారానికి రెండు సార్లు ఎగ్ బిర్యానీ అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని స్పష్టం చేశారు. అన్ని రంగాల్లో ముందజలో ఉన్న తెలంగాణలో పోషకారలోపంతో పిల్లలు బాధపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యను అధిగమించేందుకు ఇప్పటికే చర్యలు చేపట్టామన్నారు. శక్తివంతమైన, ఆరోగ్యవంతమైన తెలంగాణ నిర్మాణంలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సమిష్టి కృషితోనే పౌష్టిక తెలంగాణ సాధ్య పడుతుందన్నారు. తెలంగాణ రైజింగ్–2047 డాక్యుమెంట్‌కు అనుగుణంగా అంగన్‌వాడి సేవలను మరింత మెరుగు పరుస్తామన్నారు. ఇక నిర్మాణ సౌకర్యంలేని ప్రాంతాల్లో మొబైల్ అంగన్‌వాడిలను ప్రవేశపెట్టనున్నట్లు వెల్లడించారు. నాక్, జె ఎన్ టియు వంటి సంస్థలు మోడల్స్ సిద్ధం చేస్తున్నారని, హైదరాబాద్‌లో వలస కూలీల పిల్లలకు పౌష్టికాహారం అందించేలా మొబైల్ అంగన్‌వాడిలు నిర్వహిస్తామని ఆమె తెలిపారు. అంగన్‌వాడి కేంద్రాలను దత్తత తీసుకునేందుకు స్వచ్ఛంద సంస్థలు ఆసక్తి తెలిపిన నేపథ్యంలో వారికి అవసరమైన ప్రోత్సాహక చర్యలు తీసుకుంటామన్నారు. కాగా ప్రత్యేకంగా పోషన్ వాటిక కార్యక్రమం కింద నేషనల్ సీడ్స్ కార్పొరేషన్ ద్వారా ఆరు రకాల కూరగాయల విత్తనాలతో కూడిన సీడ్స్ కిట్‌ను మంత్రి సీతక్క ఆవిష్కరించారు. మొదటి విడతలో 4,500 అంగన్‌వాడి కేంద్రాలకు ఈ విత్తనాల కిట్లు పంపిణీ చేయనున్నట్లు వివరించారు.

ఈ సమావేశంలో మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, డైరెక్టర్ జి. సృజన, తెలంగాణ ఫుడ్ ఎండి చంద్రశేఖర్ రెడ్డి, ఐ అండ్ పిఆర్ అడిషనల్ డైరెక్టర్ డి ఎస్ జగన్, తదితర శాఖల ఉన్నతాధికారులు, పలు స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## గిరిజన విద్యార్థుల సమస్యలు పరిష్కరించండి

### మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కు గిరిజన సంఘాల నేతలు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న గిరిజన సమస్యలను పరిష్కరించాలని ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్‌ను గిరిజన సంఘాల నేతలు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ అంజయ నాయక్, గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీరామ నాయక్ . గిరిజన సమాఖ్య హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు నేనావత్ రూప్ సింగ్, నాయకులు ఇస్లావత్ శ్రీను నాయక్, బాలు నాయక్ బృందం సోమవారం, హైదరాబాద్‌లోని మినిస్టర్ క్వార్టర్స్ లోమంత్రి అడ్లూరి లక్ష్మ ణ్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. గిరిజన గురుకుల విద్యాసంస్థలో మిగిలిపోయిన సీట్లను త్వరగా భర్తీ చేయాలని, రూ.154 కోట్ల బెస్ట్ అవైలబుల్ స్కీము బకాయిలను విడుదల చేయాలని,అంబేద్కర్ విద్యా నిధి పథకంలో విదేశీ విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల లిస్టును తక్షణం ఆమోదించాలని ఈ సందర్భం గా గిరిజన సంఘాల నాయకులు మంత్రికి విజ్ఞప్తి చేశారు. విదేశాల్లో వివిధ యూనివర్సిటీల్లో ఉన్నత విద్యనభ్యసిస్తున్న దళిత, గిరిజన విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అంబేద్కర్ విద్యా నిధి పథకం ద్వారా ఒక్కో విద్యార్థికి రూ.20 లక్షల చొప్పున స్కాలర్ షిప్ లను మంజూరు చేస్తుందన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావస్తున్నా విద్యార్థులను ఎంపికే చేయలేదని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సాంఘిక సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖలు 2024 25 గాను వచ్చిన దరఖాస్తుల ఆధారంగా అర్హత కలిగిన విద్యార్థులను ఎంపిక చేసి ఆ లిస్టును గత ఏడాది సెప్టెంబర్‌లో అనుమతి కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వద్దకు వెళ్లిందని తెలిపారు. రెండవ విద్యా సంవత్సరంలోకి ప్రవేశించినా అనుమతి ఇవ్వకపోవడంతో విదేశాల్లో చదువుతున్న పేద దళిత, గిరిజన విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ముఖ్యమంత్రి వద్ద పెండింగ్ ఉన్న అంబేద్కర్ విదేశీ విద్యానిధి పథకంలోని విద్యార్థుల లిస్టుకు త్వరగా అనుమతి వచ్చేలాగా కృషి చేయాలని మంత్రిని కోరారు.

ఈ సందర్భంగా మంత్రి స్పందిస్తూ రూ.154 కోట్ల బెస్ట్ అవైలబుల్ బకాయిలను విడుదలకు సంబంధించి ఇప్పటికే ప్రైవేటు పాఠశాల యజమానులతో మాట్లాడానని ఈ బకాయిలను విడుదల చేయించే బాధ్య త నేను తీసుకుంటానని హామీ ఇవ్వడంతో విద్యార్థులను పాఠశాలల్లో అనుమతించడానికి ప్రవేట్ యాజమాన్యాలు అంగీకరించాయని సంఘం నాయకులకు వివరించారు. గిరిజన సంఘం రాష్ట్ర నాయకుల డిమాండ్లను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే పరిష్కరించేందుకు కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు .

## తీన్మార్ మల్లన్నపై మహిళా కమిషన్‌కు తెలంగాణ జాగృతి ఫిర్యాదు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎంఎల్‌సి కల్వకుంట్ల కవితపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎంఎల్‌సి తీన్మార్ మల్లన్నపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ జాగృతి మహిళా నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని తెలంగాణ మహిళా కమిషన్ కార్యాలయంలో జాగృతి ప్రతినిధు లు సోమవారం మధ్యాహ్నం తెలంగాణ మహిళా కమిషన్ కార్యాలయంలో కమిషన్ సభ్యులు సుదం లక్ష్మి, రేవతిరావు,ఉమ, అఫ్రోజ్ సహీనాకు సోమవారం ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో మహిళా జాగృతి అధ్యక్షురాలు మరిపల్లి మాధవి, సీనియర్ నాయకులు వరలక్ష్మి, పడాల మనోజ, దేశపాక సుచిత్ర, సంధ్య రెడ్డి, షాహీన్, పరమేశ్వరి, కుసుమ రజిత, రజితా రెడ్డి ఉన్నారు.



ముందుగా తీన్మార్ మల్లన్నపై ఫిర్యాదు చేసేందుకు వచ్చిన వారిని కమిషన్ లోపలికి అనుమతించకపోవడం పట్ల తెలంగాణ మహిళా జాగృతి నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో వారు మహిళా కమిషన్ కార్యాలయం ఎదుట బైఠాయించారు. ఆ తర్వాత కొందరు నాయకులను లోపలికి అనుమతించడంతో వానే ఆందోళన విరమించారు.

## 17 నుంచి ఎఐ భారత్ ఉత్సవాలు

### చైర్మన్ డాక్టర్ సివి మహేష్‌కుమార్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** భారత దేశంలో శరవేగంగా విస్తరిస్తున్న ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) టెక్నాలజీ పట్ల యువతలో అవగాహన కలిగించేందుకు హైదరాబాద్‌లో ఈనెల 17 నుంచి మూడు రోజుల పాటు ఎఐ భారత్ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు సమావేశాల చైర్మన్ డాక్టర్ సివి మహేష్ కుమార్ తెలిపారు. 17వ తేదీ కేంద్రీయ హైదరాబాద్ విశ్వ విద్యాలయంలో, 18న డ్రాప్ అవుట్ స్టార్టప్ కేంద్రం గచ్చిబౌలిలో, 19న మేడ్చల్ సిఎంఆర్ ఇంజనీరింగ్ కాలేజ్ లో ఎఐ భారత్ మహోత్సవం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయని ఆయన వివరించారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయా వివరాలు వెల్లడించారు. ఆధునిక భారతావనికి ఎఐ టెక్నాలజీ ఒక ఆయువు పట్టు అని, భవిష్యత్ లో ఎఐ టెక్నాలజీ అన్ని రంగాలకు వ్యాపిస్తుందని డాక్టర్ సివి మహేష్ కుమార్ తెలిపారు. ఈ మూడు రోజుల సదస్సులో ప్రముఖులు చాలా మంది పాల్గొని ఎఐ అద్భుతాల గురించి వివరిస్తారని ఆయన చెప్పారు. డిఆర్డివో పూర్వ చైర్మన్ డా. జి. సతీష్ రెడ్డి, సిబిఐ పూర్వ జాయింట్ డైరెక్టర్ జె.డి.లక్ష్మీ నారాయణ, ఫ్యూచురా ఎండి డెరిక్ జోన్, భారత మహిళా టీమ్ క్రికెటర్ అనుషా రెడ్డి పాల్గొననున్నారు. త్వరలో కర్నూలు, తిరుపతి, విశాఖపట్నం లలో ఈ ఉత్సవాలు నిర్వహిస్తామని, దుబాయ్ లో అంతర్జాతీయ స్థాయిలో నిర్వహిస్తామని డాక్టర్ సివి మహేష్ కుమార్ వివరించారు. పెంటాగ్రామ్ చైర్మన్ శాస్త్రవేత్త డా ఇ.జి.రాజన్ మాట్లాడుతూ అన్ని రంగాల్లో ఎఐ టెక్నాలజీ ఏవిధంగా ఉపయుక్తం కానున్నదో అవగాహన కలిగించడమే లక్ష్యంగా ఈ సమావేశాలు జరుగుతాయని చెప్పా రు. వైస్ చైర్ పర్సన్ శిరీష ఇంటూరు మాట్లాడుతూ ఆపరేషన్ సిందూర్ విజయకేతనంగా ఐ స్టాండ ఫర్ వారియర్స్ సంస్థతో కలసి ప్రత్యేక క్యాంపెయిన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆగస్టు 15న మధ్యాహ్నం 12 గంటలకు జోష్ పేరిట ప్రతిఒక్కరు వారి వారి స్థానాల్లో లేచి నిలబడి జాతీయ గీతం ఆలపించాలనే లక్ష్యంతో ఈ ఎఐ సమావేశాల్లో యువతను జాగృతం చేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎఐ భారత్ ఉత్సవాల లోగోను, జోష్ గోడ పత్రికను ఆవిష్కరించారు. ఎఐ భారత్ ఉత్సవ్ లో ఉచితంగా పాల్గొనవచ్చని, అయితే ముందుగా www.gaai.biz వెబ్‌సైట్‌లో పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో శాస్త్రవేత్త డాక్టర్ ఇ.జి. రాజన్, టాగిల్ నౌ సిఇవో రఘు బొడ్డు, సిఎంఆర్ గ్రూప్ అఫ్ ఇన్స్టూట్స్ వైస్ చైర్మన్ అభినవ్ చామకూర, కనుప్రియ, ఎ. ప్రవీణ తదితరులు పాల్గొన్నారు.

## 'వైద్య పరికరాల దుష్పరిణామాల కమిటీ' ఏర్పాటు

### 31లోపు వివరాలు తెలపాలని ఎన్ఎంసి ఆదేశాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:**వైద్య పరికరాల వాడకంతో సంబంధం ఉన్న దుష్పరిణామాలను గుర్తించి, రోగుల భద్రతను మెరుగుపర్చేందుకు 'వైద్య పరికరాల దుష్పరిణామాల కమిటీ' (మెడికల్ డివైస్ అడవర్స్ ఇవెంట్ కమిటీ)ని ఏర్పాటు చేయాలని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ నిర్ణయించింది. అన్ని వైద్య కళాశాలలు, వైద్య సంస్థలు వెంటనే 'దుష్పరిణామాల కమిటీని' ఏర్పాటు చేస్తూ నేషనల్ మెడికల్ కమిషన్‌లో నమోదు చేసుకోవాలని ఆదేశించింది. ఈ కమిటీకి చైర్మన్‌గా వైద్య కళాశాల సూపరింటెండెంట్ వ్యవహరించాలని, కమిటీ కో ఆర్డినేటర్, ఇతర సభ్యులను నియమించి, వారి వివరాలను నేషనల్ మెడికల్ కమిషన్ లో పొందుపర్చాలని స్పష్టం చేసింది. భారతీయ ఫార్మకోపియా కమిషన్ ఆధ్వర్యంలో 2015లో ప్రారంభమైన మెటీరియోవిజిలెన్స్ ప్రోగ్రాం ఆఫ్ ఇండియా (ఎంవిపిఐ) ద్వారా దేశవ్యాప్తంగా ప్రస్తుతం ఆసుపత్రులు, వైద్య కళాశాలల్లోని వైద్య పరికరాల వాడకంలో వచ్చే సమస్యలను మెడికల్ డివైస్ అడవర్స్ ఈవెంట్ మానిటరింగ్ సెంటర్ల ద్వారా పర్యవేక్షిస్తున్నారు. అయితే ప్రత్యేకంగా కమిటీని ఏర్పాటు చేయడం ద్వారా వైద్య కళాశాలలు, ఆసుపత్రులలో రోగుల భద్రతకు తోడ్పడంతో పాటు అధ్యాపకులు, విద్యార్థులకు మౌలికంగా శిక్షణ, పరిశోధనలలో చురుకైన భాగస్వామ్యం ఉంటుందని నేషనల్ మెడికల్ కమిషన్ భావిస్తుంది.

ప్రజాపక్షం
మంగళవారం, 15 జులై

## ఎన్నికల కమిషన్ ముమ్మందుకే...

బిహార్‌లో భారత ఎన్నికల కమిషన్ ఆదరా బాదరా—అసెంబ్లీ ఎన్నికలకు కొద్ది నెలల ముందు చేపట్టిన ఓటర్ల జాబితాల ప్రత్యేక ముమ్మర రివిజన్ (ఎస్ఐఆర్)లో దాని ఉద్దేశాలను ప్రశ్నిస్తూ, పెద్ద ఎత్తున అట్టడుగు, మైనారిటీ, ఇతర పేదల ఓట్లు రద్దు చేయబడతాయనే భయాలను వ్యక్తం చేస్తూ దాఖలైన పలు పిటిషన్లను విచారించిన సుప్రీంకోర్టు ధర్మాసనం ఓటర్ల గుర్తింపునకు ఆధార్, ఓటరు, రేషన్ కార్డులను ఆధారంగా స్వీకరించే విషయాన్ని పరిశీలించాలని ఇచ్చిన సలహాను గౌరవించకుండా ఎన్నికల కమిషన్ ముందుకు సాగుతున్నది. ఓటరు జాబితాల ముమ్మర రివిజన్ ఎన్నికల కమిషన్ రాజ్యాంగ విధి అని బెంచి చేసిన వ్యాఖ్యను మాత్రం ఆధారం చేసుకుంది. ఇసికి గల రాజ్యాంగ అధికారాన్ని ఎవరూ ప్రశ్నించలేదు. అయితే తగినంత వ్యవధి లేకుండా ఏడు కోట్లకు పైగా ఉన్న ఓటర్లలో ఇసి కోరిన సులభ లభ్యం కాని డాక్యుమెంట్లలో ఏదేని జత చేసి నెలరోజుల్లో ఎన్నికల అధికారులిచ్చిన ఓటరు ఫారాలు తిరిగి సమర్పించడం సాధ్యం కాదు. తార్కాణంగా జనన సర్టిఫికెట్లు, స్కూలు సర్టిఫికెట్లు, లేకపోతే తల్లిదండ్రుల్లో ఎవరో ఒకరి జన్మ సర్టిఫికెట్, అధికారుల నుంచి నివాస ధృవీకరణ సర్టిఫికెట్ల కోసం రెక్కాడితే గాని నాలుగు వేళ్లు నోట్లోకి పోని పేదలు పనులు మానుకొని ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నారు. నిరక్షరాస్యత, పేదరికం, పనుల కోసం కోట్ల మంది వలస వెళ్లటం విస్తారంగా ఉన్న బిహార్ వంటి రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలకు నాలుగు నెలల ముందు ఇటువంటి కఠిన పరీక్ష పెట్టిన ఎన్నికల కమిషన్ చిత్తశుద్ధిని ప్రతిపక్షం శంకిస్తోంది. తనను కోర్టు ముందు సమర్థించుకోవడానికన్నట్లు ఈనెల 28న సుప్రీంకోర్టులో తిరిగి విచారణ దృష్ట్యా—ఆదివారం (13వ తేదీ) నాటికి 76 శాతం ఓటర్లు దరఖాస్తు ఫారాలు సమర్పించారని, నెట్‌లో అప్‌లోడ్ శరవేగంతో జరుగుతోందని ఇసి చెబుతోంది. విదేశీయులు పెద్ద సంఖ్యలో ఓటర్ల జాబితాలో ఉన్నారన్న వాదనకు సమర్థనగా, పెద్ద సంఖ్య లో నేపాలీ, బంగ్లాదేశ్, మయన్మార్ పౌరులు ఓటర్లుగా—ఆధార్, ఓటర్, రేషన్ కార్డులతో—ఉన్నారని క్షేత్రస్థాయి అధికారులు కనుగొన్నట్లు మరో వార్తను ఇసి విడుదల చేసింది. సరిహద్దు రాష్ట్రం కాబట్టి కొందరు విదేశీయులు తమ దేశాల్లో కల్లోలాల సందర్భంలో పొట్ట చేతపట్టుకొని సరిహద్దు దాటి సక్రమంగానో, అక్రమంగానే మనదేశంలోకి వచ్చి ఉండవచ్చు. విదేశీయుల పేరుతో సరైన జన్మ, నివాస సర్టిఫికెట్లు లేని ప్రజలను విదేశీయులుగా గుర్తించి, వెనక్కి పంపే బాధ్యత కేంద్ర హోంశాఖది తప్ప ఇసిది కాదు. వారి పేర్లను తొలగిస్తూ జాతీయ పౌర జాబితాను రూపొందించే కేంద్రం ప్రయత్నానికి ముందస్తు చర్యగా ఇసి ఈ ఓట్ల రివిజన్ కార్యం చేపట్టినట్లున్నది. బిహార్ ఎన్నికల తరువాత ఓటర్ల ముమ్మర తనిఖీ ప్రక్రియను వచ్చే ఏడాదిలో అసెంబ్లీ ఎన్నికలు జరిగే పశ్చిమబెంగాల్, అసోం, కేరళ, పుదుచ్చేరి, తమిళనాడులో చేపడుతామని ఇసి ఇంతకుముందే చెప్పింది. అసోంలో విదేశీయుల గుర్తింపు ప్రక్రియ పదేళ్లకు పైగా పూర్తికాలేదు. డాక్యుమెంట్లు లేని దాదాపు 16 లక్షల మంది విదేశీయులన్న ముద్రతో ఏ సౌకర్యాలకు నోచుకోక దుర్భర జీవితం గడుపుతున్నారు. బిజెపికి కొరకరాని కొయ్యగా తయారైన పశ్చిమబెంగాల్లో వేలాదిమంది బంగ్లాదేశ్ ముస్లింలు ముఖ్యంగా సరిహద్దు జిల్లాల్లో ఉన్నారని ఆరోపించబడుతున్నది. తృణమూల్ కాంగ్రెస్ మద్దతుదారులుగా ఉన్న ముస్లింల ఓటు హక్కు రద్దు చేసే కుట్ర చేస్తున్నారని టిఎంసి ప్రత్యారోపణ చేస్తున్నది.

ఇదిలా ఉండగా, దేశమంతటా ఈ ప్రక్రియ చేబట్టడానికి యంత్రాంగాన్ని సిద్ధం చేయాలని భారత ఎన్నికల కమిషన్ రాష్ట్ర ఎన్నికల ముఖ్య అధికారులకు వర్తమానం పంపినట్లు ఆదివారం ఒక వార్త పత్రికలకు అందింది. హోంమంత్రి అమిత్ షా శనివారం నాడు 'ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్' పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో బిహార్‌లో ఎస్ఐఆర్‌ను సమర్థిస్తూ, ''ఇదేమీ మొదటిసారి జరగడం లేదు. ఒక్క బిహార్‌లోనే జరగదు. దేశమంతటా జరుగుతుందని భావిస్తున్నాను. ఏమైనా ఈ విషయం సుప్రీంకోర్టు ముందుంది'' అన్నారు. ఆ మరునాడే ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ అయినాయి. కాబట్టి ఇదంతా ఒక పద్ధతి ప్రకారం కేంద్ర ప్రభుత్వ ఆదేశంతో జరుగుతున్నట్లు అనుమానాలకు బలం చేకూర్చుతున్నది. ప్రతి ఏటా జనవరి 1వ తారీఖు కట్ ఆఫ్ డేట్‌గా ఇసి ఓటర్ల జాబితాల్లో చేర్పులు—తొలగింపులు చేస్తుంటుంది. కాని ఇప్పుడు ముమ్మర రివిజన్‌ను బిహార్‌లో ట్రయల్‌గా సంవత్సరం మధ్యలో మొదలుపెట్టడం, ఇసి ప్రభుత్వం చెప్పు చేతల్లో పనిచేస్తున్నట్లు అనేక ఆరోపణలు ఎదుర్కొంటున్న నేపథ్యంలో సందేహాలకు తావిస్తున్నది. ఎన్నికల నిర్వహణలో ఇసి నిజాయితీయే ప్రశ్నార్థకమవుతుంది. ఏమైనా, సుప్రీంకోర్టు విచారణ కోసం వేచి చూద్దాం!

## గ్రేటర్ హైదరాబాద్‌లో చెత్తను ఉచితంగా తరలించాలి



లేఖ

గ్రేటర్ హైదరాబాద్ నగరంలో ఖాళీ స్థలంలో నగర నాగరీకులు చెత్తను పారవేస్తుంటారు. కాలనీలోని ట్రాన్స్‌ఫార్మర్, పార్కుల వద్ద, ఇతర ఎక్కడ ఖాళీ స్థలం దొరికినా చెత్తను పారవేయడం ఒక ప్రక్రియగా కొనసాగుతున్నది. చెత్తను తరలించే వాహనదారులకు పైసలు చెల్లించలేక ఈ పని చేస్తుంటారు కొందరు, నిజంగా పైసలు లేక మరికొందరు, ఎందుకు పైసలు చెల్లించాలని ఉద్దేశంతో మరికొందరు. ప్రభుత్వమే భరించాలని ఉద్దేశంతో ఉంటున్నారు. అదేవిధంగా ఇళ్ల నిర్మాణం కోసం కూల్చివేసిన వ్యర్థాలు కూడా ఖాళీ స్థలములలో రోడ్డు ప్రక్కన దర్శనమిస్తుంటాయి. రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా మంచినీటి సరఫరా, మహాలక్ష్మి పథకం క్రింద స్త్రీలకు ఉచిత బస్సు ప్రయాణం ఇంకా ఇతర ఉచిత పథకాలు, సేవలు అందిస్తున్నారు. కార్పొరేషన్ వారు చెత్తను ఆయా స్థలంలో పారవేయకుండా నిరోధించుటకు కొన్ని స్థలాలలో సిబ్బందిని నియమిస్తున్నారు. మరికొన్ని స్థలాల్లో రికార్డ్ మైక్ రూపంలో బోర్డుల ద్వారా ప్రకటనలు చేస్తూ చెత్తను ఈ స్థలములో వేసేవారికి తగు జరిమాన విధించబడుతుందని, కెమెరాల ద్వారా గుర్తిస్తున్నామని హెచ్చరిస్తున్నారు. చెత్తను ఉచితంగా తరలించుటకు ఏర్పాటు చేసిన ఎడల ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం దొరుకుతుందని నేను ఆశిస్తున్నాను. తద్వారా నగరాన్ని చెత్త రహితంగా పరిశుభ్రంగా ఆరోగ్యవంతంగా తీర్చి దిద్దుటకు వీలు ఏర్పడి ప్రకటనల వ్యయం కూడా మిగులుతుంది సిబ్బందిని కూడా ఇతర పనులకు ఉపయోగించుకొనవచ్చు.

— డిఆర్ఆర్
9849592958

# మీడియాపై భౌతిక దాడులు పత్రికా స్వేచ్ఛకు భంగం

భారత రాజ్యాంగ నిర్దేశాలననుసరించి శాసన, కార్యనిర్వాహక, న్యాయ వ్యవస్థలు మన దేశ పార్లమెంటరీ ప్రజాస్వామ్య సౌధానికి మూడు ముఖ్యమైన మూలస్తంభాలుగా కొనసాగుతున్నాయి. ఐతే నాలుగో ముఖ్యమైన మూలస్తంభం గా గుర్తించబడిన ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా మిగతా మూడు మూలస్తంభాల పనితీరుని నిరంతర నిఘా నేత్రాలతో ఎప్పటికప్పుడు విశ్లేషిస్తూ దేశంలో ప్రజాస్వామ్య పరిపుష్టికి ఊపిరులూదుతున్న నేపథ్యంలో ప్రపంచంలో రెండో అతి పెద్దదైన ప్రజాస్వామ్య దేశంగా మన దేశం తన స్థానాన్ని సుస్థిరం చేసుకున్న వైనం బహిరంగ రహస్యమే.

ఇటీవల ఉభయ తెలుగు రాష్ట్రాలలో పత్రికలూ ప్రసార సాధనాలపై జరుగుతున్న దాడులూ, అక్రమ కేసుల నమోదు నేపథ్యంలో లాయర్లూ, ప్రజలూ ఐదో మూలస్తంభంగా మారినప్పుడే దేశం లో ప్రజాస్వామ్య మనుగడ సుస్థిరమౌతుందనే నల్సార్ యూనివర్శిటీ మాజీ ప్రొఫెసర్ మాడభూషి శ్రీధర్ లాంటి న్యాయ కోవిదుల వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకుంటున్నాయి. డెబ్బై ఎనిమిది సంవత్సరాల సుదీర్ఘ స్వతంత్ర పాలనలో కేంద్రం లో, రాష్ట్రంలో అధికార, విపక్ష పార్టీలకు చెందిన కొంతమంది రాజకీయ పార్టీల నేతలపై రకరకాల ఆర్థిక అవకతవకలూ, కుంభకోణాలకు సంబంధించిన ఆరోపణలు వచ్చిన సందర్భాల్లో న్యాయ విచారణలూ, పోలీస్‌ల చేత అరెస్టులూ, కేసులూ కొనసాగినప్పుడు ముఖ్యమంత్రి, ప్రధానమంత్రి స్థాయి నేతలు సైతం ఎంతో వినమ్రంగా, గంభీరంగా తమ నిర్దోషిత్వాన్ని నిరూపించుకోవడానికి విచారణ సంస్థలకు సహకరించిన వైనం బహిరంగ రహస్యమే. ఐతే ఈ మధ్య కాలంలో ఉభయ తెలుగు రాష్ట్రాలలో సదరు సాంప్రదాయాలకు భిన్నంగా అవినీతి ఆరోపణలను ఎదుర్కొంటున్న నేతల్లో కొంతమంది తాము పోలీస్‌ల దర్యాప్తుకూ, న్యాయ విచారణకు అతీతమన్నట్లు వ్యవహరిస్తూ తమ అనుచర గణాన్ని పోలీసు శాఖపై ఉసిగొల్పుతూ, తాము అధికారంలోకి వచ్చిన తర్వాత మీ అంతు చూస్తామని బెదిరిస్తూ, తాము చెప్పేదే న్యాయమని వాదిస్తూ, న్యాయ విచారణకు సైతం బలప్రదర్శనతో హాజరౌతుండడం గమనార్హం. ఈ నేపథ్యంలో పత్రికలూ, ప్రసార సాధనాలు ఎంతో నిజాయితీగా, నిష్పక్షపాతంగా నేరారోపణలకు సంబంధించిన వాస్తవాలను పాత్రికేయ విలువలకు కట్టుబడి ప్రజల ముందుంచాలనేది ప్రజల ఆకాంక్ష.

### స్వతంత్ర ప్రతిపత్తికి ఒకింత దూరమౌతున్న మీడియా?!

దేశ, రాష్ట్ర ప్రజల జీవనాన్ని ప్రభావితం చేసే రకరకాల ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ప్రాజెక్టులూ, వాటికి సంబంధించిన అంచనా వ్యయాలు,ఆచరణలో పెడుతున్న ఖర్చుల్లో కోట్లాది రూపాయల కుంభకోణాలు జరుగుతున్నాయనే ఆరోపణలు తలెత్తినప్పుడు వాటికి సంబంధించిన సమాచార సేకరణ, ముద్రణ, పంపిణీలో గతంలో పత్రికలూ, ప్రసార సాధనాలు వంద శాతం నిష్పక్షపాత వైఖరిని అవలంబించేవని చెప్పక తప్పదు. కాని వర్తమాన రాజకీయాల్లో ప్రాంతీయ, జాతీయ పార్టీలనే తేడా లేకుండా ప్రతి రాజకీయ పార్టీ తమ పార్టీ రాజకీయ ప్రయోజనాల పరిరక్షణ కోసం ఓ పత్రికతో పాటు ఓ ఎలక్ట్రానిక్ మీడియా సంస్థను నిర్వహిస్తున్న నేపథ్యంలో తమ రాజకీయ ప్రయోజనాల కోసం అవసరమైతే అర్ధ సత్యాలను, అసత్యాలను సైతం ప్రచారం చేస్తున్నారంటూ ఒక పార్టీ మరొక పార్టీపై ఆరోపణలు చేసుకుంటుండడం గమనార్హం. నిజానికి ఈ ధోరణి ఈనాటిదేమీ కాదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వంపై అధిక సర్క్యులేషన్ కలిగిన ఓ తెలుగు దినపత్రికతో పాటు మరో పత్రిక తమ పార్టీపై, ప్రభుత్వంపై అసత్య ఆరోపణలతో బురద జల్లుతున్నాయని బహిరంగ వ్యాఖ్యలు చేయడంతో పాటు సదరు పత్రికలు, టెలివిజన్ ఛానల్స్‌పై ప్రభుత్వ పరంగా, న్యాయపరంగా చర్యలను తీసుకోవడం లోకవిదితమే. ఐతే ఒకటి రెండు సందర్భాల్లో సదరు మీడియా సంస్థలపై దాడులు సైతం జరిగినాయని ఆ మీడియా సంస్థలు ఆరోపణలు చేయడం తెల్సినదే. తదనంతరం వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సైతం ఓ తెలుగు దినపత్రికనూ, టెలివిజన్ ఛానెల్‌నూ ప్రారంభించడం జరిగింది. తదనంతర పరిణామాల నేపథ్యంలో కొన్ని పత్రికలూ, ఎలక్ట్రానిక్ మీడియా సంస్థలు ఆచరణలో ఆయా రాజకీయ పార్టీల ప్రయోజనాల పరిరక్షణ కోసం కరపత్రాలుగా, మౌత్‌పీస్‌లుగా పనిచేస్తున్నాయనే భావన ను కలిగిస్తున్నాయనే మీడియా విశ్లేషకుల అభిప్రాయం ప్రాధాన్యత సంతరించుకుంటోంది. ఈ క్రమంలో సమకాలీన రాజకీయాల్లో రాజ్యాధికారం కోసం పోటీ పడుతున్న వివిధ రాజకీయ పార్టీల పై ఉప్పెన లా విరుచుకుపడుతున్న వేల కోట్ల రూపాయల ఆర్థిక అవినీతి ఆరోపణలూ, కుంభకోణాలూ, ప్రజల ప్రజాస్వామిక హక్కులకు, జీవన భద్రతకు సంబంధించి ప్రభుత్వాలు రూపొందిస్తున్న వివిధ విధానాలకు సంబంధించిన పాలసీలూ, వాటి పరిణామాలకు సంబంధించి ఆయా పత్రికల్లో కనపడుతున్న వార్తల్లో ఏవి నిజమో? ఏవి అబద్ధమో? తెలియడం లేదు. వాటికి తోడు తాము నిర్మించుకున్న సోషల్ మీడియా సైన్యం బాసటతో నిజం నిద్ర లేవక ముందే అబద్ధాన్ని అరవై కిలోమీటర్లు ప్రయాణింపజేస్తున్న వైనంతో అసలు లబ్ధిదారులైన ప్రజలు ఆందోళన చెందుతున్నారు.



### టెలిఫోన్ ట్యాపింగ్‌పై సర్వత్రా విమర్శల వెల్లువ ?

వ్యక్తిగత గోప్యత పౌరులకు రాజ్యాంగం ప్రసాదించిన హక్కు, కాగా దానికీ వారి జీవించే హక్కుకు సజీవ సంబంధమున్న నేపథ్యంలో టెలిఫోన్ ట్యాపింగ్ ఘటన ఆరోపణ అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంటోంది. ఐతే గతేడాదిన్నర కాలం నుండి తెలంగాణ రాష్ట్ర రాజకీయాలను కుదిపేస్తున్న టెలిఫోన్ ట్యాపింగ్ గత బిఆర్‌యస్ పార్టీ ప్రభుత్వ పాలనలో జరిగిందనే ఆరోపణలపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంచే ఏర్పాటైన సిట్ నేతృత్వంలో అత్యంత లోతైన దర్యాప్తు కొనసాగుతున్నది. సదరు టెలిఫోన్ ట్యాపింగ్‌లో నిందితులుగా భావిస్తున్న పోలీస్ అధికారులు విచారణలో భాగంగా ఇచ్చిన వాంగ్మూలాల ఆధారంగా బిఆర్‌యస్ పార్టీలోని కొంతమంది ముఖ్య నాయకులతో పాటు ఆనాడు ప్రతిపక్షంలో వున్న కాంగ్రెస్, బిజెపి తదితర పార్టీల ముఖ్య నాయకుల ఫోన్లతో పాటు న్యాయమూర్తులు, కొంతమంది సినీ సెలబ్రిటీల ఫోన్లు సైతం ట్యాపింగ్‌కు గురైనట్లు సమాచారం అందుతోందని పత్రికలు, ప్రసార సాధనాలు కథనాలను ప్రచారం చేస్తున్నాయి. ఐతే సదరు కథనాలలోని నిజానిజాల నిగ్గు తేలాల్సి వుంది. సిట్ సైతం ఒక్కొక్కరుగా ట్యాపింగ్‌కు గురైన వ్యక్తుల వాంగ్మూలాలను సేకరిస్తోంది. ఈ విచారణపై బిఆర్‌యస్ పార్టీ స్పందిస్తూ ఇది ఓ లొట్ట పీస్ కేసనీ, తుపేల్ కేసని ప్రభుత్వంలో స్పెషల్ బ్రాంచ్ విభాగంలోని పోలీసు అధికారులు ప్రభుత్వ అవసరాలను బట్టి ఫోన్లపై నిఘా వుంచడం, ప్రభుత్వానికి అవసరమైన సమాచారాన్ని సేకరించి ఇవ్వడం, పాలనలో రొటీన్‌గా జరిగేదే తప్ప ఎవ్వరూ టెలిఫోన్ ట్యాపింగ్ చేయమని అధికారులకు ఉత్తర్వులు ఇవ్వలేదని వాదిస్తోంది. ఈ క్రమంలో ఓ తెలుగు న్యూస్ ఛానల్ బిఆర్‌యస్ పార్టీపై, ఆ పార్టీ అగ్రనేతలపై వారి శీలాన్ని హననం చేసే విధంగా వార్తలను ప్రసారం చేస్తుందనేది బిఆర్‌యస్ ప్రధాన ఆరోపణ. ఒకవేళ అదే నిజమైతే అది నిస్సందేహంగా ఖండనార్హమే కాదు శిక్షార్హం కూడాను. ఈ నేపథ్యంలో ఆ పార్టీ అగ్రనేత ల పరువుకు నష్టం కలిగించిన ఛానల్‌పై న్యాయ స్థానాల్లో చట్టప్రకారం పరువు నష్టం దావా వేయవచ్చు. తప్పుడు ప్రచారాలకు పాల్పడుతున్న ఛానల్ పై దావా వేసి సాక్ష్యాధారాలతో తాము నిరపరాధులమని రుజువు చేసుకోవచ్చు. ఛానల్ యాజమాన్యాన్ని చట్టపరంగా శిక్షించడానికి ప్రయత్నించవచ్చు కూడా. ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజ్యాంగ బద్ధంగా వివిధ రూపాల్లో నిరసనలు చేపట్టవచ్చు. అంతేకాని భౌతిక దాడులకు పాల్పడడం సహేతుకం కాదు. ఐతే వీటన్నింటిని కాదంటూ సదరు ఛానల్ ప్రధాన కార్యాలయంపై, ఆ ఛానల్ కార్యాలయం ముందు పార్క్ చేసి వున్న కార్లపై, ఆ సంస్థ ఉద్యోగులపై భౌతిక దాడులకు పాల్పడిన వైనాన్ని బిఆర్‌యస్ పార్టీ మినహా రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీల అధినేతలు, పార్లమెంట్ సభ్యులూ, శాసనసభ్యులూ, కొంతమంది సీనియర్ పాత్రికేయులు, పత్రికా సంపాదకులు, ప్రెస్ అకాడమీ ఛైర్మన్ ఈ దాడిని ప్రజాస్వామ్యంపై జరిగిన దాడి గా ప్రకటిస్తూ ముక్తకంఠంతో ఖండించారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రితో పాటు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఇతర మం త్రులూ, శాసనసభ్యులూ ఈ దాడిని అత్యంత హేయమైనదిగా అభివర్ణిస్తూ ఈ దాడికి పాల్పడిన శక్తులపై చట్టరీత్యా తగు చర్యలను తీసుకోక తప్పదని చట్టం తన పని తాను చేసుకుపోతుందని చెప్పారు.

### బిఆర్‌యస్ పార్టీ ఏం చెబుతోంది ?

ఓ వైపు సిట్ విచారణ కొనసాగుతుండగానే ఈ విచారణ తమ పార్టీపై, పార్టీ అధినేతలపై దురుద్దేశపూర్వకంగా, కక్షసాధింపు చర్యలో భాగంగా కాంగ్రెసు పార్టీ, తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న దాడిగా అభివర్ణిస్తూ సదరు దుష్ప్రచారాన్ని కొనసాగిస్తున్న తెలుగు ఛానల్‌పై అతి సాధారణ నిరసన తెలపడం జరిగిందనీ, రాష్ట్రంలో ఈ ఛానెల్‌తో పాటు మరో రెండు ఛానెల్స్ సైతం ఇదే తోవలో పయనిస్తున్నాయనీ వారు వారి ధోరణిని మార్చుకోక పోతే మూడు ఛానెళ్ళూ తీవ్ర పరిణామాల ను ఎదుర్కోవాల్సి వస్తుందని, వారిపై ఫిర్యాదు చేస్తే పోలీసులు పట్టించుకోవట్లేదనీ అందుకే వారిని ప్రజా కోర్టులో శిక్షిస్తామని ఆ పార్టీకే చెందిన మాజీ మంత్రి ఒకరు పత్రికాభిముఖంగా, బహిరంగంగా, హెచ్చరించడం జరిగింది. ఐతే ఫిర్యాదులపై పోలీసుశాఖ స్పందించి కేసులు నమోదు చేయాల్సిందే. ఒక వేళ టెలిఫోన్ కుంభకోణం జరిగిందని సిట్ విచారణలో తేలినా బిఆర్‌యస్ పార్టీ న్యాయస్థానాలను ఆశ్రయించే అవకాశాలూ లేకపోలేదు. దేశంలో సిబిఐ, ఇడి లాంటి అత్యంత ప్రతిష్టాత్మకమైన దర్యాప్తు సంస్థలు సమగ్ర విచారణ జరిపిన 2G కుంభకోణం, బోఫోర్స్ కుంభకోణం, రఫేల్ కుంభకోణాల లాంటి అనేక కుంభకోణాలు కల్పితాలూ, నిరాధారాలే, అసలు జరగనే లేదంటూ న్యాయస్థానాలు ఇచ్చిన తీర్పుల అనుభవాల రీత్యా టెలిఫోన్ ట్యాపింగ్ ఇన్వెస్టిగేషన్ రిపోర్టులో ఏం తేలుతుందో? న్యాయస్థానాల గడప తొక్కితే ఆ కేసు ఏ మలుపులు తీసుకుంటుందో? ఇప్పటికిప్పుడే తేలడం కష్టమనే కఠోర సత్యాన్ని జీర్ణించుకోక తప్పదు. ఏదేమైనప్పటికీ ప్రజాస్వామ్య వ్యవస్థలో వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగిస్తూ, వారి జీవించే హక్కును పెను ప్రమాదంలోకి నెట్టివేసే టెలిఫోన్ ట్యాపింగ్‌పై సమగ్ర విచారణ జరిపి, ఒకవేళ అది జరిగిందని రుజువైతే దానికి బాధ్యులైన వ్యక్తులు ఏ స్థాయి అధికారులైనా, రాజకీయ పెద్దలైనా, వారిని చట్టరీత్యా కఠినంగా శిక్షించాల్సిందేననేది ప్రజాస్వామ్య ప్రియుల ఆశ, ఆకాంక్ష కూడా.

ఐతే వారి ఆశ నెరవేరుతుందో లేదా అడియాస గానే మిగిలిపోతుందో రాబోయే కాలమే తేల్చి చెప్పాల్సి వుంది.

— డాక్టర్ నీలం సంపత్
9866767471

# పంచాయతీలు బలపడితేనే ప్రజాస్వామ్యం నిలబడుతుంది



జి.అజయ్‌కుమార్
సామాజిక విశ్లేషకులు

'ప్రజల పాలన— ప్రజల చేతుల్లో ఉండాలి' అన్న మహాత్మాగాంధీ ఆశయం 1993లో 73వ రాజ్యాంగ సవరణ ద్వారా కార్యరూపం దాల్చింది. ఈ మార్గదర్శక నిర్ణయంతో గ్రామ పంచాయతీలకు రాజ్యాంగ హోదా లభించింది. ఆ రోజు నుంచి ప్రజలే పాలకులు అన్న భావన భారత ప్రజాస్వామ్యంలో బలంగా నిలిచింది. గ్రామ అభివృద్ధికి గ్రామస్థులే నిర్ణయాలు తీసుకోవాలి — ఇదే స్వరాజ్యసారం! కానీ నాలుగు దశాబ్దాల ప్రయాణం అనంతరం ఈ ప్రజాస్వామ్య వ్యవస్థ వాస్తవంగా చాలా మారింది. ఇవాళ పంచాయతీ ఎన్నికలు అభివృద్ధి దిశగా నడిపించే నాయకుల ఎంపికకు కాకుండా, 'మా వాడే గెలవాలి' అనే స్వార్థంగా మారాయి. అభ్యర్థి సామర్థ్యం కంటే అతని కుల ప్రాతినిధ్యమే ముఖ్యం. సమస్యల పరిష్కారాల కంటే ప్రత్యర్థులపై ఆధిపత్యమే లక్ష్యం అనే సంధాన సాగుతున్నాయి.

### 73వ రాజ్యాంగ సవరణ ప్రకారం

ప్రతి 5 ఏళ్లకు పంచాయతీ ఎన్నికలు జరగాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలి. గ్రామ సభల ఆధారంగా పాలన జరగాలి. కానీ వాస్తవంగా ఏమవుతోంది? చాలా రాష్ట్రాల్లో పంచాయతీ పదవుల గడువు ముగిసిన స్థానిక సంస్థల ఎన్నికలు జరగడం లేదు. గ్రామ సభలు చాలా చోట్ల జరగడం లేదు. నిధుల విడుదలలో రాజకీయ జోక్యం ఎక్కువైంది. పథకాలు అందరికీ కాకుండా — గ్రూపు ప్రాధాన్యత ఉన్నవారికే చేరుతున్నాయి.

### వాస్తవ గణాంకాలు

దేశంలో 2.5 లక్షల పంచాయతీలు — 30 లక్షల మంది ప్రజాప్రతినిధులు ఉన్నారు. 60% పైగా సర్పంచ్ పదవులు కుల ప్రాతిపదికన నిర్ణయించబడుతున్నట్లు అధ్యయనాలు చెపుతున్నాయి. తెలంగాణలో 12,769, ఆంధ్రప్రదేశ్‌లో 13,097 పంచాయతీలు. కొన్ని జిల్లాల్లో 2 సంవత్సరాలుగా ఒక్క గ్రామ సభ కూడా జరగలేదు. అభివృద్ధి వికేంద్రీకరణ కాకుండా వర్గాలు, రాజకీయ పార్టీల ఆధిపత్యానికి పరిమితమవుతోంది. మౌలిక వసతులు సమానంగా అందరికి పంచబడటం లేదు. సామాజిక చీలికలు పెరిగిపోతున్నాయి. నిజాయితీ గల అభ్యర్థులు భయంతో పోటీకి దూరం అవుతున్నారు. ఓ గ్రూపు గెలిస్తే, మిగతా గ్రూపుల లేదా పార్టీల వారిపై కక్ష సాధింపులు కొనసాగుతున్నాయి.



### ఇప్పుడు మారాల్సింది ప్రజలు

ఓటు ఒక అధికారం కాదు — బాధ్యత. ఓటు వేయడం అనేది గ్రామ భవిష్యత్తును నిర్ణయించే చర్య. కులాన్ని చూసి కాకుండా — నాయకుడి నిజాయితీ చూడాలి. ప్రచార ర్యాలీలను కాదు పనితీరు గమనించాలి. కక్ష్యలతో కాదు విచక్షణతో ఓటు వేయాలి

### ఒక్క ఓటుతో ఊరే మారుతుంది

ఒక మంచి నాయకుడు గెలిస్తే— గ్రామ సభలు చురుగ్గా జరుగుతాయి. నిధుల వినియోగం పారదర్శకంగా ఉంటుంది. ప్రభుత్వ పథకాలు అందరికీ సమానంగా చేరుతాయి. శాంతి, సామరస్యం, అభివృద్ధి సమంగా పెరుగుతాయి. రాజకీయ నాయకుల ఆటలలో కీలుబొమ్మలుగా కాకుండా— బాధ్యతాయుతమైన ఓటర్లుగా నిలవాలి. ఓటు కులానికి కాదు— అభివృద్ధికి వేయాలి. గ్రూపు నాయకుడికి కాదు— నిజాయితీ గల నాయకుడికి ఎన్నుకోవాలి.

# సరైన ప్రణాళికలు ఉంటే జనాభా కూడా వరమే!



ఫిరోజ్ ఖాన్
9640466464

జనాభా అంశంపై ప్రపంచ దేశాలు రెండుగా విడిపోయాయి. కొన్ని దేశాలు ఇప్పటికీ అధిక జనాభాతో బాధపడుతున్నట్లు భావించి నియంత్రణ చర్యలు పాటిస్తుండగా.. మరికొన్ని దేశాలు జనాభా పెరుగుదల కోసం అనేక ప్రోత్సాహకాలు ప్రకటిస్తున్నాయి. గతంలో జనాభా నియంత్రణ కోసం కఠిన చట్టాలు అమలు చేసిన దేశాలు కూడా ఇప్పుడు సడలింపులు ఇస్తున్నాయి. భారతదేశంలోని రాష్ట్రాల పరిస్థితులు కూడా అలాగే ఉన్నాయి. ఉత్తర భారతానికి చెందిన యూపీ, బిహార్, రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లాంటి రాష్ట్రాలు ఇప్పటికీ జనాభా నియంత్రణకు ప్రాధాన్యతనిస్తుండగా.. దక్షిణాదికి చెందిన ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, కర్ణాటక, తెలంగాణ వంటి రాష్ట్రాలు జనాభా పెరుగుదలను ప్రోత్సహించే దిశలో ప్రణాళికలు రచిస్తున్నాయి. ఈ నేపథ్యంలో జనాభా అనేది ప్రధాన సమస్య కాదని, ప్రభుత్వాల వద్ద సరైన ప్రణాళికలు లేకపోవడమే అసలు సమస్యలకు కారణమని తెలుస్తున్నది. సరైన సమయంలో సరైన నిర్ణయాలు తీసుకొని, సరైన ప్రణాళికలతో జనాభాను వినియోగించుకుంటే అది దేశానికి శాపంగా కాకుండా వరంగా మారే అవకాశాలే ఎక్కువ అని పలు దేశాలు ఇప్పటికే నిరూపించాయి. ప్రస్తుతం ప్రపంచ జనాభా 820 కోట్లకు పైనే. 2080 నాటికి ఇది 1030 కోట్లకు చేరవచ్చని అంచనా. 143 కోట్ల జనాభాతో భారతదేశం మొదటి స్థానంలో ఉండగా, 142 కోట్లతో చైనా రెండో స్థానంలో ఉన్నది. జనాభా పెరుగుదల సమస్యలు దేశాల ఆర్థిక, సామాజిక, పర్యావరణ సందర్భాలపై ఆధారపడి ఉంటాయి. సరైన ప్రణాళిక లేనప్పుడు జనాభా పెరుగుదల ఒత్తిడిని సృష్టిస్తుంది, కానీ సమర్థవంతమైన విధానాలతో ఈ సవాళ్లను అధిగమించవచ్చు. జూలైలో నిర్వహించనున్న ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకొని..



సరైన ప్రణాళికలతో సింగపూర్ ఇలా..


జనాభాను అంకెల పరంగానే కాకుండా జనసాంద్రత పరంగా పరిశీలిస్తే కూడా కొన్ని దేశాలు సరైన ప్రణాళికలతో ఎలా అభివృద్ధిపథంలో నడిచాయో తెలుస్తున్నది. ఇందులో అధిక జనసాంద్రత ఉన్నప్పటికీ సింగపూర్ సమర్థవంతమైన ప్రణాళిక ద్వారా ఆర్థిక, సామాజిక అభివృద్ధిని సాధించింది. జనసాంద్రత పరంగా సింగపూర్ ప్రపంచంలోనే మూడో స్థానంలో ఉన్నది. ఈ దేశ వైశాల్యం 719.9 చదరపు కిలోమీటర్లు మాత్రమే కాగా, చదరపు కిలోమీటర్‌కు 8,595 మంది నివసిస్తున్నారు. అయితే అధిక ఆర్థిక వృద్ధి, అత్యుత్తమ గృహనిర్మాణం, ఆరోగ్య సేవలతో ప్రపంచంలోనే ఈ దేశం అగ్రగామిగా నిలుస్తున్నది. 196070లలో 'స్టాప్ ఎట్ టూ' కార్యక్రమం ద్వారా జనన రేటును తగ్గించిన ఈ దేశం.. 1980ల నుండి ప్రోనాటలిస్ట్ విధానాలతో (బేబీ బోనస్ స్కీమ్) ద్వారా జనన రేటును సమతుల్యం చేసింది. జనాభా విషయంలో సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకోవడమే ఈ దేశ అభివృద్ధికి కారణమని తెలుస్తున్నది.

### డిసిషన్స్‌పైనే చైనా డెవలప్‌మెంట్..

జనాభాలో మొన్నటి వరకు ఫస్ట్ ప్లేస్‌లో ఉండి ఇప్పుడు రెండో స్థానంలో ఉన్న చైనా సరైన సమయంలో సరైన నిర్ణయాలు తీసుకోవడంతో అభివృద్ధిలో ముందంజలో ఉన్నట్లు స్పష్టమవుతున్నది. చైనా జనాభా ప్రస్తుతం 142 కోట్లు. అయితే జనసాంద్రత పరంగా ఈ దేశం ప్రపంచవ్యాప్తంగా 83వ స్థానంలో ఉంది. చదరపు కిలోమీటర్‌కు 153 మంది నివసిస్తున్నారు. అయితే 1980 నుంచి 2015 వరకు చైనా వన్ చైల్డ్ పాలసీని కఠినంగా అమలు చేసింది. దీని ద్వారా సుమారు 40 కోట్ల జనాభాను నియంత్రించగలిగింది. అయితే ఆర్థిక సంస్కరణలు తీసుకువచ్చిన ఆ దేశం జనాభా వనరులను సమర్థవంతంగా ఉపయోగించింది. ఫలితంగా ఇప్పుడు చైనా రెండో అతిపెద్ద ఆర్థిక శక్తిగా మారింది. అయితే కఠిన విధానాలు జనాభా నియంత్రణలో విజయవంతమైనప్పటికీ, దీర్ఘకాల సామాజిక పరిణామాలను పరిగణనలోకి తీసుకోకపోవడం సమస్యలను సృష్టించింది. వృద్ధ జనాభా ఎక్కువ కావడం, లింగ నిష్పత్తిలో తేడాలు రావడంతో ఆ దేశం వెంటనే అప్రమత్తమైంది. 2015లో టూ చైల్డ్ పాలసీ, 2021లో మూడు పిల్లల విధానాన్ని ప్రవేశపెట్టింది.

### భారతదేశం.. మేల్కొనాల్సిన సమయం..

భారతదేశం 3,287,263 చ.కి.మీ. వైశాల్యంతో ప్రపంచంలో ఏడో స్థానంలో ఉన్నది. కానీ 143 కోట్ల జనాభాతో మొదటి స్థానంలో ఉన్నది. ఇక్కడ జనసాంద్రత (485/చ.కి.మీ.) కూడా ఎక్కువే. అయితే ఉత్తర, భారత దేశాల్లో పరిస్థితులు ఇందుకు భిన్నంగా ఉన్నాయి. దక్షిణాది రాష్ట్రాలు జనాభా నియంత్రణను కఠినంగా పాటించగా, ఇప్పుడు ఇక్కడ సమస్యలు ఎదురవుతున్నాయి. అయితే ప్రపంచంలోని ఇతర దేశాలతో పోల్చుకుంటే భారతదేశంలో యువ జనాభా 65% (35 ఏళ్ల లోపు) ఉంది. ఈ అంశం సరైన ప్రణాళికతో ఆర్థిక వృద్ధికి దోహదపడగలదు. సరైన అర్బన్ ప్లానింగ్ పాలసీ, ఆర్థిక సంస్కరణలు, సాంకేతిక వినియోగం వంటి వాటిపై ప్రభుత్వాలు దృష్టి పెట్టాలి. విద్య, ఆరోగ్యం, సాంకేతికతను ఉపయోగించి జనాభాను ఒక శక్తిగా మార్చాలి. ఎక్స్‌పోర్ట్ ఆధారిత పరిశ్రమలను ప్రోత్సహించడం ద్వారా యువ జనాభాను ఉత్పాదక శక్తిగా మార్చవచ్చు. సాంకేతికతను ఉపయోగించి, గ్రామీణ నగర అసమానతలను తగ్గించవచ్చు. సమర్థవంతమైన ప్రణాళికల ద్వారా, జనాభా సమస్యల సవాళ్ల నుండి సమృద్ధికి మార్గాలను వెతికితే.. కొన్ని దశాబ్దాల్లోనే ఇండియా నంబర్ వన్ ఆర్థిక శక్తిగా మారే అవకాశముంది.



# జాతీయం

NATIONAL & GENERAL NEWS

## ఉక్రేన్‌కు మహిళా ప్రధానమంత్రి

### యులియా స్విరిడెంకో

**కీవ్ :** ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తమ దేశానికి ఒక మహిళను ప్రధానమంత్రిగా నియమించారు. రష్యాతో యుద్ధం పరిష్కారమై, కాల్పులు విరమించే ఆశలు నానాటికీ క్షీణించిపోతున్న పరిస్థితులమధ్య ఇప్పటివరకూ ఉప ప్రధానమంత్రిగా ఉన్న యులియా స్విరిడెంకోను ప్రధానమంత్రిగా నియమించారు. ఈ విషయాన్ని ఆయన పార్లమెంటుకు తెలియజేయాలి. ఆమె నియామకాన్ని ఉక్రేన్ పార్లమెంటు ఇంకా ఆమోదించాల్సి ఉంది. సోమవారంనాడు ఎక్స్ వేదికగా ఆయన ఈ విషయం ప్రకటించారు. "మేం ఉక్రేన్ కార్యనిర్వాహక వ్యవస్థలో పరివర్తన చర్యలు ప్రారంభించాం, ప్రధానమంత్రిని నియమించాం, యులియా స్విరిడెంకోను ప్రధానమంత్రి బాధ్యతలు తీసుకోవడానికి ఆహ్వానించాం, ఆమె ఇక ఆ కార్యకలాపాలను జోరుగా కొనసాగిస్తారు" అని పేర్కొన్నారు. ఉక్రేన్ కోశాగారం ప్రస్తుతం వట్టిపోయింది, నిధుల సమస్యలో చిక్కుకుని ఉంది. 39 ఏళ్ళ వయసుగల యులియా స్విరిడెంకో ప్రధానంగా ఒక ఆర్థికవేత్త. 2021 నుండి మొదటి ఉప ప్రధానమంత్రిగా, ఆర్థిక అభివృద్ధి, వాణిజ్యశాఖలమంత్రిగా పనిచేస్తున్నారు.

# భారతీయ నర్సును ఉరిశిక్షనుంచి కాపాడేందుకు సాధ్యమైనంత చేస్తున్నాం

### యెమెన్ విషయంలో ఇంతకంటే ఎక్కువ చేయలేం
### సుప్రీంకోర్టుకు వెల్లడించిన కేంద్రం




**న్యూఢిల్లీ :** యెమెన్‌లో హత్య కేసులో జులై 16న ఉరిశిక్షను ఎదుర్కోనున్న భారతీయ నర్సు నిమిష ప్రియను కాపాడే విషయంలో 'సాధ్యమైనంత వరకు చేస్తున్నాం' అని, అయితే, యెమెన్ స్థితిని దృష్టిలో ఉంచుకుంటే ప్రభుత్వం ఇంతకంటే 'ఎక్కువగా ఏమి చేయలేదు' అని సోమవారం కేంద్రం సుప్రీంకోర్టుకు తెలియజేసింది. నిమిష ప్రియను ఉరిశిక్షనుంచి కాపాడే విషయంలో 'భారత ప్రభుత్వం ఒక దశకు చేరుకోగలిగింది. మేం ఆ దశ చేరుకున్నాం' అని అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహ్‌తాలతో కూడిన ధర్మాసనానికి తెలిపారు. తన పౌరులను కాపాడటానికి ప్రభుత్వం ఆసక్తిగా ఉన్నదని, తాము ఈ విషయంలో సాధ్యమైనంత వరకు చేస్తున్నదని అత్యున్నత న్యాయ అధికారి చెప్పారు. యెమెన్ సున్నితత్వం, స్థితిని పరిగణనలోనికి తీసుకుంటే భారత ప్రభుత్వం పెద్దగా ఏమీ చేయగలిగేది లేదని అటార్నీ జనరల్ చెప్పారు. యెమెన్‌లోని హౌతీల గురించి కూడా ఆయన ప్రస్తావించారు. దానికి దౌత్యపరంగా కూడా గుర్తింపులేదని చెబుతోంది. ఉరిశిక్షను ప్రస్తుతానికి నిలిపివేయవచ్చో, లేదో తెలుసుకోవడానికి ప్రభుత్వం ఇటీవల సంబంధిత ప్రాంత పబ్లిక్ ప్రాసిక్యూటర్‌కు కూడా లేఖ రాసిందని అటార్నీ జనరల్ వెంకటరమణి చెప్పారు. భారత ప్రభుత్వం తనవంతు 'సాధ్యమైనంత వరకు చేసింది'. అక్కడి ప్రజలను బాగా ప్రభావితం చేసే కొంతమంది షేక్‌లతో కూడా ఒప్పందం కుదుర్చుకుంది' అని అటార్నీజనరల్ వెంకటరమణి తెలిపారు. నిమిష ప్రియ కేరళ రాష్ట్రంలోని పాలక్కాడ్ జిల్లా నుంచి యెమెన్ వెళ్లిన ఒక నర్సు అని, అక్కడ ఒక హత్యకేసులో ఆమెకు 2020లో మరణశిక్ష విధించబడిందని, ఆమె చేసుకున్న తుది అభ్యర్థన 2023 లో తిరస్కరణకు గురైంది. ఆమె ప్రస్తుతం యెమెన్ రాజధాని సనాలోని ఒక జైలులో శిక్షను అనుభవిస్తోంది. కాగా సోమవారం నాటి విచారణకు పిటిషనర్ ఆర్గనైజేషన్ 'సేవ్ నిమిష ప్రియ ఇంటర్నేషనల్ యాక్షన్ కౌన్సిల్' తరుపున న్యాయవాది హాజరయ్యా రు. తన న్యాయపరమైన మద్దతును కొనసాగిస్తూ 'అది ఒక దురదృష్టకరమైన పరిస్థితి' అన్నారు. యెమెన్ సుప్రీం జ్యుడీషియల్ కౌన్సిల్ వరకూ మరణశిక్ష నిర్ధారించబడిందని ఆ దేశ షరియా చట్టాన్ని ప్రస్తావిస్తూ ఆయన అన్నారు. ఒక సామాజిక కార్యకర్తతో కలిసివెళ్లి యెమెన్‌లో ఉంటున్న నిమిష ప్రియ తల్లి మృతుడి కుటుంబంతో బ్లడ్‌మనీ ఇచ్చేందుకు సంప్రదిస్తోందని ఆయన చెప్పారు.ఉరిశిక్షను తప్పించేందుకు మృతుడి కుటుంబం బ్లడ్‌మనీ తీసుకునేందుకు అనుమతిస్తే ఉరిశిక్ష నిలిపివేసే పరిస్థితి ఉంటుందని, కానీ పిటిషనర్ కుటుంబ సభ్యులు ప్రభుత్వం నుంచి నిధులను అడగలేదని, వారు స్వ యంగా డబ్బు సమకూర్చుకుంటున్నారని న్యాయవాది చెప్పారు.అయితే బ్లడ్ మనీ అనేది ఒక ప్రైవేట్ సంప్రదింపు మాత్రమేనని వెంకటరమణి చెప్పారు. యెమెన్ ప్రపంచంలోని మరే ఇతర ప్రాంతం లాంటిది కాదని, అక్కడి ప్రభుత్వం దౌత్య ప్రక్రియల ద్వారా లేదా అంతర్‌ప్రభుత్వ చర్చల ద్వారా ఏదైనా పొందవచ్చు అని వెంకటరమణి అన్నారు. 'అది చాలా సంక్లిష్టమైనది' అని ఆయన చెప్పారు. 'మేం ఎక్కువగా బహిరంగంగా వెళ్లి పరిస్థితిని రాజీ చేయాలి అనుకోవడం లేదు' అని అటార్నీ జనరల్ వివరించారు. బహుశా ఉరిశిక్షను నిలిపివేసి ఉండవచ్చని మాకు ఒక రకమైన అనధికారిక సమాచారం అందింది. అనంతరం ధర్మాసనం ఈ పిటిషన్ విచారణను జులై 18కి వాయిదా వేసింది. అక్కడి స్థితి గురించి తెలియజేయాలని కోరింది. యెమెన్ పరిపాలనా యంత్రాం గం జులై 16న నిమిష ప్రియ ఉరిశిక్షను ఖరారు చే సిందని మీడియాలో వచ్చిన వార్తను పిటిషనర్ తెలియజేశారు.

# గోవా గవర్నర్‌గా అశోక్ గజపతిరాజు

### లడాఖ్ ఎల్‌జిగా కవీందర్ గుప్తా, హర్యానా గవర్నర్‌గా ఆషిమ్ కుమార్
### నియామక ఉత్తర్వులను జారీ చేసిన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము
### ముగిసిన బండారు దత్తాత్రేయ పదవీ కాలం







**న్యూఢిల్లీ :** మూడు రాష్ట్రాలకు నూతన గ వర్నర్లను నియమిస్తూ రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఉత్తర్వులు జారీ చేశారు. గోవా గ వర్నర్‌గా విమానయాన శాఖ మాజీ మం త్రి అశోక్ గజపతిరాజును నియమించా రు. హర్యానా గవర్నర్‌గా ఆషిమ్ కుమార్ ఘోష్ నియమితలయ్యారు. లడాఖ్ లెఫ్టినెంట్ గవర్నర్‌గా బిడి మిశ్రా రాజీనామాను ఆమోదించిన రాష్ట్రపతి ఆయన స్థానంలో కవీందర్ గుప్తాను నియమించారు. ఈ మేరకు రాష్ట్రపతి భవన్ నుంచి ప్రకటన వెలువడింది. వారు బాధ్యతలు స్వీకరించిన తేదీల నుంచే ఈ నియామకాలు అమలులోకి వస్తాయని ప్రకటనలో పేర్కొంది. కాగా, గోవా గవర్నర్‌గా నియమితులైన అశోక్ గజపతిరాజు ఏడుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎంపిగా విజయం సాధించారు. 1978లో తొలిసారి జనతా పార్టీ తరపున ఎమ్మెల్యేగా విజయం సాధించిన అశోక్, ఆ తర్వాత టిడిపిలో చేరారు. ఆ పార్టీ నుంచి ఆరుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎంపిగా గెలుపొందారు. 2014లో పౌరవిమానయానశాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. మరోవైపు గవర్నర్‌గా బండారు దత్తాత్రేయ పదవీకాలం ముగిసింది. 2019 నుంచి 2025 వరకు ఆయన గవర్నర్‌గా పనిచేశారు. 2019లో హిమాచల్‌ప్రదేశ్ గవర్నర్‌గా నియామకమైన ఆయన, ఏడాదిన్నరపాటు సేవలు అందించారు. అనంతరం హర్యానా గవర్నర్‌గా దత్తాత్రేయ నియామకమయ్యారు. అక్కడ దాదాపు నాలుగేళ్లపాటు సేవలందించించారు. గతంలో ఆయన 2014 నుంచి 2019 వరకు తెలంగాణలోని సికింద్రాబాద్ నుంచి లోక్‌సభ సభ్యుడిగా ఉన్నారు.

**ప్రొఫెసర్ అషిమ్ కుమార్ ఘోష్ ప్రస్థానం**

ప్రొఫెసర్ అషిమ్ కుమార్ ఘోష్ బంగాల్లోని హావ్‌డాకు చెందినవారు. ఆయన 1999 నుంచి 2002 వరకు బంగాల్ బిజెపి అధ్యక్షుడిగా పని చేశారు. 2023లో హావ్‌డా లోక్‌సభ స్థానం నుంచి బిజెపి అభ్యర్థిగా ఉప ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయారు.

**కవిందర్ గుప్తా రాజకీయ జీవితం**

కవిందర్ గుప్తా జమ్మూ కశ్మీర్‌లోని బిజెపి అగ్ర నాయకుల్లో ఒకరు. 1993 నుంచి 1998 వరకు భారతీయ యువ మోర్చా జమ్ముకశ్మీర్ విభాగానికి అధ్యక్షుడిగా ఉన్నారు. ఆ తర్వాత 2005 నుంచి 2010 వరకు వరుసగా మూడు సార్లు జమ్ము నగర మేయర్‌గా ఎన్నికయ్యారు. అనంతరం 2014లో జరిగిన జమ్ముకశ్మీర్ శాసనసభ ఎన్నికల్లో గాంధీనగర్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2015 మార్చి 19న జమ్ముకశ్మీర్ శాసనసభ స్పీకర్‌గా నియమితులయ్యారు. 2018 ఏప్రిల్ 30న జమ్ముకశ్మీర్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగాను బాధ్యతలు చేపట్టారు. 2018 జూన్ 19న, బిజెపి-పిడిపితో పొత్తును తెంచుకోవడంతో గుప్తా ప్రమాణ స్వీకారం చేసిన 51 రోజుల తర్వాత ఉప ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారు.

# సీటు కాపాడుకోవడంలో నితీశ్ బిజీ

### బిహార్‌లో శాంతిభద్రతలపై రాహుల్‌గాంధీ



**న్యూఢిల్లీ :** బిహార్‌లో శాంతి భద్రతల పరిస్థితిపై ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రం 'భారతదేశ నేర రాజధాని'గా మారిందని, ముఖ్యమంత్రి నితీష్ కుమార్ తన సీటును కాపాడుకోవడంలో బిజీగా ఉన్నారని, బిజెపి మం త్రులు కమిషన్లు వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు ప్రభుత్వాన్ని మార్చడానికి మాత్రమే కాదని, రాష్ట్రాన్ని కాపాడటానికి వేయాలని రాహుల్ ఉద్ఘాటించారు. 11 రోజుల్లో 31 హత్యలు, రాష్ట్రంలో 'కాంట్రాక్ట్ కిల్లింగ్ పరిశ్రమ' గురించి మీడియాలో వచ్చిన స్క్రీన్‌షాట్‌లను రాహుల్ ఎక్స్‌లో పంచుకున్నారు. బిహార్ భారతదేశ నేర రాజధానిగా మారిందని, ప్రతి వీధిలో భయం, ప్రతి ఇంట్లో అశాంతి నెలకొందని పేర్కొన్నారు. నిరుద్యోగ యువతను గుండా రాజ్ హంతకులుగా మారుస్తున్నారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి తన సీటును కాపాడుకోవడంలో బిజీగా ఉన్నారని, బిజెపి మంత్రులు కమిషన్లు వసూలు చేస్తున్నారని, ఈసారి ఓటు ప్రభుత్వాన్ని మార్చడానికి మాత్రమే కాదు, బిహార్‌ను కాపాడటాని వేయాలని తాను మళ్లీ పునరావృతం చేస్తున్నానన్నారు. ఈ నెల ప్రారంభంలో ప్రముఖ వ్యాపారవేత్త గోపాల్ ఖేమ్కాను పాట్నాలోని తన నివాసం వెలుపల కాల్చి చంపిన ఘటన బిజెపి, ముఖ్యమంత్రి కుమార్ కలిసి బిహార్‌ను 'భారతదేశ నేర రాజధాని'గా మార్చారని మరోసారి రుజువు చేసిందని గాంధీ అన్నారు. హాజీపూర్‌లో తన కొడుకును కాల్చి చంపిన ఏడు సంవత్సరాల తర్వాత, ఖేమ్కాను పాట్నాలోని తన నివాసం వెలుపల బైక్‌పై వచ్చిన దుండగుడు కాల్చి చంపాడు.

# కోల్‌కతాలో ఉపాధ్యాయుల ఆందోళన



**కోల్‌కతా :** సుప్రీంకోర్టు తమ ఉద్యోగ నియామకాలను రద్దు చేసిన అర్హులైన, కళంకం లేని పాఠశాల ఉపాధ్యాయుల పెద్ద సంఖ్యలో సోమవారం ఆందోళనకు దిగారు. మధ్యాహ్నం రాష్ట్ర సచివాలయం నబన్నకు ర్యాలీగా బయలుదేరారు. అయితే కొన్ని కిలోమీటర్ల దూరం ముందే వారిని హౌరా మైదాన్ వద్ద పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఉపాధ్యాయులు, పోలీసులకు మధ్య ఘర్షణ జరిగింది. 'శిక్షక్ అధికార్ మంచ్' (ఉపాధ్యాయుల హక్కుల వేదిక) బ్యానర్ కింద ఆందోళన చేపట్టగా, పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్లను ఆందోళనకారులు తోసుకుంటూ ముందుకెళ్లారు. తాము సచివాలయానికి వెళ్లే తీరుతామని భీష్మించుకున్నారు. దీంతో హౌరా మైదాన్ వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అయితే జిటి రోడ్డులోని ముల్లిక్ ఫటక్ వద్ద ముందుగా ఏర్పాటు చేసిన ఇనుప గోడ బారికేడ్లతో పోలీసులు చివరకు నిరసనకారులను అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో హింసాత్మక ఘటనలకు పాల్పడవద్దని ప్రజాప్రతినిధులు ఇరు వర్గాలకు విజ్ఞప్తి చేశారు. ర్యాలీకి నాయకత్వం వహిస్తున్న ఉపాధ్యాయులలో ఒక వర్గానికి చెందిన 20 మంది ఉపాధ్యాయుల బృందం నబన్నాలో ప్రధాన కార్యదర్శి మనోజ్ పంత్‌ను కలిసి తమ డిమాండ్లను విన్నవించనున్నట్లు వారు పేర్కొన్నారు. 2016 స్కూల్ సర్వీస్ కమిషన్ పరీక్షల ఓఎంఆర్ షీట్‌లను, కళంకం లేని అభ్యర్థుల పూర్తి జాబితాను ప్రచురించాలని, షరతులు లేకుండా వారిని ఉద్యోగాలలో తిరిగి నియమించాలని పట్టుబడుతూ నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు, అధికారిక ప్రతిస్పందన కోసం ముఖ్యమంత్రిని సంప్రదించాలని కోరారు. కాగా, ఉపాధ్యాయులను సచివాలయానికి వెళ్లకుండా అడ్డుకునేందుకు జల ఫిరంగులు, ఓవర్ హెడ్ డ్రోన్ నిఘాతో సాయుధులైన పోలీసులు, రాపిడ్ యాక్షన్ ఫోర్స్ (ఆర్‌ఎఎఫ్) సిబ్బందితో కూడిన భారీ బృందం నిరసనకారులను ఆపడానికి మోహరించారు. 10 అడుగుల ఎత్తు వరకు ఉన్న బహుళ ఇనుప బారికేడ్ గోడలు కూడా ఏర్పాటు చేశారు. అయితే తాము పరీక్షకూ హాజరుకామని, తమకు జరిగిందని, తమ ఉద్యోగాలు తిరిగి ఇవ్వడం ప్రభుత్వ బాధ్యత అని నిరసన తెలుపుతున్న ఒక ఉపాధ్యాయుడు అన్నారు.

# అమరులకు నివాళులు అర్పించకుండా.. నాపై దాడికి యత్నం

### జమ్ముకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ఆరోపణ

**శ్రీనగర్ :** జమ్ము కశ్మీర్‌లో రాజకీయ ప్రకంపనలు మొదలయ్యాయి. 1931లో డోగ్రా సైన్యం చంపిన 22మంది అమరులకు నివాళులు అర్పించడానికి ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా సోమవారం నక్ష్‌బంద్ సాహిబ్ స్మశానవాటిక గేట్లు ఎక్కి తనపై, తన అనుచరులపై 'చేయిచేసుకునే' ప్రయత్నాలు జరిగాయని ఆరోపించారు. నేషనల్ కాన్ఫరెన్స్, ప్రతిపక్ష పార్టీలకు చెందిన పలువురు నాయకులు జులై 13న అమరులకు నివాళులు అర్పించడానికి వెళ్లకుండా నిరోధించేందుకు గృహ నిర్బంధం చేసిన ఒక రోజు తర్వాత ఈ నాటకీయ పరిణామం చోటుచేసుకుంది. నేషనల్ కాన్ఫరెన్స్ ప్రెసిడెంట్ ఫరూక్ అబ్దుల్లా ఖన్యార్ క్రాసింగ్ నుండి ఒక ఆటోలో అమరుల స్మారకం వద్దకు ప్రయాణించగా, విద్యాశాఖ మంత్రి సకినా ఇట్టూ స్మారకచిహ్నం వద్దకు స్కూటీ సీటుపైకి ఎక్కి ప్రయాణించి అందరినీ ఆశ్యర్యపరిచారు. శ్రీనగర్ డౌన్‌టౌన్‌లో కన్యార్, నౌహట్ట రెండు వైపుల నుంచి అమరుల సమాధులకు దారితీసే రహదారులన్నింటినీ భద్రతా బలగాలు మూసివేయించాయి. ఒమర్ అబ్దుల్లా దళం పాత నగరంలోని ఖన్యార్‌కు చేరుకున్నాక ఒక కిలోమీటర్ దూరం నడుచుకుంటూ స్మశాన వాటిక వద్దకు చేరుకున్నారు. అయితే అక్కడ అధికారులు స్మశానవాటిక గేట్లకు తాళంవేసి ఉండటాన్ని గమనించారు. అయితే ముఖ్యమంత్రి ఒమర్‌అబ్దుల్లా మెయిన్ గేట్ ఎక్కి స్మశానవాటిక ప్రాంగణంలోకి ప్రవేశించి 'ఫతేహా' సమర్పించారు. చివరిగేట్ తెరవడానికి ముందే ఆయన భద్రతా సిబ్బంది, పలువురు నేషనల్ కాన్ఫరెన్స్ నాయకులు కూడా అలాగే చేశారు. అనంతరం ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా విలేకరులతో మాట్లాడుతూ అమరుల స్మశానవాటిక వద్దకు వెళ్లకుండా తనను, తన అనుచరులను నిలువరించే ప్రయత్నం చేశారని లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్‌సిన్హా, పోలీసులపై తీవ్రస్థాయిలో విమర్శల దాడికి దిగారు. భద్రత, చట్టం తమ బాధ్యత అని చెప్పుకునే వ్యక్తుల సూచనల మేరకు మాకు ఇక్కడ 'ఫతేహా' ఇవ్వడానికి అనుమతి ఇవ్వకపోవడం విచారకరమన్నారు. ఆదివారం మమ్ములను గృహనిర్బంధంలోనే ఉంచడం జరిగిందన్నారు. 'వాళ్ల ధైర్యం చూడండి, వాళ్లు ఈరోజు కూడా మమ్ములను ఆపడానికి ప్రయత్నించారు. మాపై దాడికి కూడా ప్రయత్నించారు. పోలీసులు కొన్నిసార్లు చట్టాలను కూడా మర్చిపోతారు. నన్ను ఈరోజు ఎందుకు ఆపారు?. నిన్న ఆ ఆంక్షలు ఎందుకు లేవు?'. అని ముఖ్యమంత్రి ఆగ్రహంతో ఊగిపోయారు. మేం బానిసలం కాదు. మేం ప్రజల సేవకులం. కానీ పోలీసులు యూనిఫారంలోనే ఉండి చట్టాన్ని ఎందుకు నాశనం చేస్తారో నాకు అర్థం కావడం లేదు' అని ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా అన్నారు.

# నేడు శుక్లా బృందం భూమికి రాక

### వైద్యుల పర్యవేక్షణలో వారం రోజులు ఏకాంతవాసం



**న్యూఢిల్లీ:** అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐ ఎస్ ఎస్)లో అడుగుపెట్టిన మొట్టమొదటి భారతీయ వ్యోమగామి శుభాంశు శుక్లా మంగళవారం మధ్యాహ్నం మూడు గంటలకు భూమికి తిరిగి వస్తారు. శుక్లాతోపాటు మరో మూడు దేశాలకు చెందిన వ్యోమగాములతో డ్రాగన్ అంతరిక్ష నౌక కాలిఫోర్నియా తీరంలో దిగుతుంది. భారత కాలమానం ప్రకారం సోమవారం సాయంత్రం 4.45 గంటలకు అంటే ముందుగా సిద్ధం చేసిన ప్రణాళికకు భిన్నంగా 10 నిమిషాలు ఆలస్యంగా డ్రాగన్ నౌక ఐ ఎస్ ఎస్ నుండి విడివడి తిరుగు ప్రయాణం ప్రారంభించింది. నలుగురు వ్యోమగాములూ మధ్యాహ్నం 2.27 గంటలకు డ్రాగన్ నౌకలోకి ప్రవేశించేముందుగా మిగిలిన ఏడుగురు తోటి వ్యోమగాములను ఆలింగనం చేసుకుని, కరచాలనాలతో వీడ్కోలు తీసుకున్నారు. వారిమధ్య కొత్త స్నేహాలు ఏర్పడ్డాయి. డ్రాగన్ నౌకఉపరితలం భూమి వాతావరణంలోకి ప్రవేశించినప్పుడు 1600 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతతో ఉంటుంది. భూమికి 5.7 కి.మీ దూరంలోకి రాగానే మొదటి ప్యారాచూట్ తెరచుకుంటుంది. తర్వాత రెండు కి.మీ దూరంలోకి రాగానే రెండో ప్యారాచూట్ తెరుకుంటుంది. డ్రాగన్ నౌక వేగాన్ని నియంత్రించడానికి ఈ ప్యారాచూట్‌లు ఉపయోగపడతాయి. ఈ బృందం భూమికి చేరుకోవడానికి మొత్తం 22.5 గంటలు ప్రయాణం చేయాలి. దాదాపు 433 గంటలు లేదా 18 రోజుల పాటు ఈ వ్యోమగాముల బృందం ఐ ఎస్ ఎస్‌లో గడిపింది. ఈ స మయంలో 288సార్లు భూమిచుట్టూ పరిభ్రమ ణం చేశారు. అంటే జూన్ 26న డ్రాగన్ నౌక ఐ ఎ స్ ఎస్‌కు అనుసంధానమైన తర్వాత దాదాపు 70.60 లక్షల మైళ్ళు దూరం భూమిచుట్టూ తిరిగారు. ఇక భవిష్యత్‌లో ఎంతోమంది భారత వ్యోమగాములు రోదసీ యాత్రలు చేసినాగానీ శుక్లా మొట్టమొదటి ఐ ఎస్ ఎస్ పర్యటన దేశ చరిత్రలో శిలాక్షరాలతో లిఖించబడుతుంది. భూమికి చేరుకున్న తర్వాత శుక్లా వారం రోజులపాటు క్వారంటైన్‌లో ఉంటారు. తిరిగి భూమ్యాకర్షణశక్తికి అలవాటుపడి ఆరోగ్యం పుంజుకునేవరకూ అంతరిక్ష వైద్య నిపుణుల పర్యవేక్షణలో వారు చెప్పినట్లు చేస్తారు. కాగా శుక్లా తల్లిదండ్రులు, కుటుంబీకులు, బంధువులు, స్నేహితులు శుక్లాకు ఘన స్వాగతం ఏర్పాటు చేసేందుకు లక్నోలో బ్ర హ్మాండమైన ఏర్పాట్లు చేసుకుంటున్నారు. శుక్లా రోద సీ ప్రయాణం నిమిత్తం భారత అంతరిక్ష పరిశోధనాసంస్థ (ఇస్రో) రూ.550 కోట్లు ఐ ఎస్ ఎస్‌కు చెల్లించింది. రోదసీలో భవిష్యత్ వ్యోమగాముల మనుగడకు సంబంధించిన అంశాలపై మొత్తం 60కి పైగా వివిధ రకాల ప్రయోగాలు ఈ నలుగురు వ్యోమగాముల బృందం చేసింది. ఈ ఎఎక్స్-4 మిషన్ ద్వారా శుక్లాతోపాటు నాసాకు చెందిన సీనియర్ వ్యోమగామి కమాండర్ పెగ్గీ విట్సన్ (అమెరికా), మిషన్ స్పెషలిస్టులు స్లోవోజ్ ఉజ్నాన్స్కీ-విస్నియెవ్స్కీ (పోలెండ్), టిబోర్ కపూ (హంగేరీ)లు అంతరిక్ష కేంద్రంలో 60కి పైగా ప్రయోగాలు చేశారు. శుక్లా బృందం బయలుదేరేముందురోజు ఆదివారంనాడు ఐ ఎస్ ఎస్‌లో వీడ్కోలు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వ్యోమగాములు ఎంతో భావోద్వేగాలకు గురయ్యారు. నేను ఎంతో ఆనందంగా గడిపారు, అందరితోకలిసి వృత్తి నైపుణ్యంతో పనిచేశాను" అని వీడ్కోలు కార్యక్రమంలో శుక్లా తన భావోద్వేగాన్ని తోటి వ్యోమగాములతో పంచుకున్నారు. ఇది చరిత్రాత్మకమైన పర్యటన అని శుక్లా అన్నారు. 1984లో మొదటి భారతీయుడు రాకేశ్ శర్మ సోవియట్ యూనియన్ సహాయంతో రోదసీయాత్ర చేశారు.

### భావ ప్రకటనా స్వేచ్ఛను దుర్వినియోగం చేస్తే

# రక్షణ కల్పించలేం

### కార్టూనిస్ట్ హేమంత్ మాలవీయ పిటిషన్ కొట్టివేసిన సుప్రీంకోర్టు



**న్యూఢిల్లీ :** అరెస్టు నుంచి తనకు రక్షణ క ల్పించాలని కార్టూనిస్ట్ హేమంత్ మాలవీ య సుప్రీం కోర్టులో వేసిన పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం కొట్టివేసింది. అతడికి అరెస్టు నుంచి రక్షణ కల్పించడానికి నిరాకరించింది. కొందరు కళాకారులు, కార్టూనిస్టులు, స్టాండప్ కమెడియన్ లు ఈ మధ్య భావ ప్రకటనా స్వేచ్ఛను దుర్వినియోగం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రధాని నరేంద్రమోదీ, ఆ ర్‌ఎస్‌ఎస్‌పై వేసిన కార్టూన్ అభ్యంతరకరంగా ఉండటంతో కార్టూనిస్టు హేమంత్ మాలవీయపై గతంలో కేసు నమోదయ్యి ంది. అరెస్టు నుంచి రక్షణ కల్పించాలం టూ ఆయన వేసిన పిటిషన్‌ను విచారించి న సుప్రీంకోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. త దుపరి విచారణ మంగళవారానికి వాయి దా వేస్తున్నట్లు తెలిపింది. ప్రధాని నరేంద్రమోదీ, ఆర్‌ఎస్‌ఎస్‌పై వేసిన కార్టూన్ అభ్యంతరకరంగా ఉండటంతో కార్టూని స్టు హేమంత్ మాలవీయపై కేసు నమోదయ్యింది. మధ్యప్రదేశ్ హైకోర్టులో అతడు ముందస్తు బెయిల్ పిటిషన్ వేయగా.. ఈనెల 3న పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం కార్టూన్ గీయడంలో ఆ యన విచక్షణ లేకుండా ప్రవర్తించాడని పేర్కొంటూ..దానిని తోసిపుచ్చింది. దీం తో మాలవీయ సుప్రీం కోర్టును ఆశ్రయించారు. దేశంలో కొవిడ్ ప్రభావం ఎక్కువగా ఉన్న సమయంలో ఈ కార్టూన్ ప్రచురితమయ్యిందని హేమంత్ మాలవీయ సుప్రీం కోర్టుకు తెలిపారు. ఆ సమయంలో వ్యాక్సిన్ భద్రతపై వచ్చిన తప్పుడు సమాచారం, ప్రజల ఆందోళనల నేపథ్యంలో ఒక రాజకీయ నాయకుడు, పౌరుడికి టీకాలు వేస్తున్నట్లు వ్యంగ్య చిత్రాన్ని గీసినట్లు పేర్కొన్నారు. ఇందులో ఎవరినీ కించపరిచే ఉద్దేశం లేదని స్పష్టం చేశారు.


# ఘనంగా ఫ్రాన్స్ జాతీయ వేడుకలు



**పారిస్ :** ఫ్రాన్స్‌లో సోమవారంనాడు ఘనంగా జాతీయ దినోత్సవ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా 7000 మంది కవాతులు చేశారు. ఫ్రాన్స్‌లోని అన్ని పట్టణాలలో బ్రహ్మాండంగా ఉత్సవ వేడుకలు నిర్వహించారు. అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ ఈ వేడుకల్లో పాల్గొన్నారు. అగ్నిజ్యోతి వెలిగించారు. ఫ్రాన్స్ రక్షణ రంగ వ్యయాన్ని భారీగా పెంచుతామని ఆయన ప్రకటించారు. ఈ ఏడాది ఇండోనేసియా అధ్యక్షుడు ప్రబొవో సుబియంతో ఈ ఉత్సవాలకు ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. ఆసియాలో పెద్ద ఆర్థిక వ్యవస్థలలో ఒకటిగా, అతిపెద్ద ముస్లిందేశ ప్రతినిధిగా సుబియంతో ఈ వేడుకల్లో ప్రాతినిధ్యం వహించారు. త్రివిధ దళాలు తమ శక్తిసామర్థ్యాలను ప్రదర్శించాయి. డ్రోన్లు, యుద్ధ విమానాలు హడావుడి చేశాయి. ఈఫిల్ టవర్ లైట్‌షో అందరినీ ఎంతగానో ముగ్ధులను చేసింది. 1789 జులై 14వ తేదీన ఫ్రెంచ్ రివల్యూషన్ జరిగింది. బాస్టిల్లే కోటను, బాస్టిల్లా జైలుపైనా భారీ దాడి చేశారు. జైలు గోడలు బద్దలయ్యాయి. ఈ విప్లవంతో రాచరిక వ్యవస్థ అంతమైంది. నెపోలియన్ రాజ్య అభ్యున్నతిని, పతనాన్ని చవిచూసిన ఫ్రాన్స్, ఆ తర్వాత రెండు ప్రపంచ యుద్ధాలను కూడా ఎదుర్కొంది. చివరకు 1958లో ఫిఫ్త్ రిపబ్లిక్ ఆవిర్భవించి ఈనాటికి ఫ్రాన్స్ ప్రస్తుత దశలో స్థిరత్వాన్ని సాధించింది.

# ఫోన్ సీక్రెట్ రికార్డింగ్స్ కూడా సాక్ష్యాలే

### భార్యాభర్తల విడాకుల కేసుకు సంబంధించి సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు
### దంపతుల మధ్య వివాహ బంధం బలంగా లేదనే విషయాన్ని
### ఆ రికార్డింగ్స్ స్పష్టం చేస్తాయని వెల్లడి




**న్యూఢిల్లీ :** భార్యాభర్తల విడాకుల కేసుకు సంబంధించి సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఇలాంటి కేసుల్లో భాగస్వామి ఫోన్ సీక్రెట్ రికార్డింగ్‌లను సాక్ష్యాలుగా పరిగణించొచ్చని వెల్లడించింది. వారి మధ్య వివాహ బంధం బలంగా లేదనే విషయాన్ని ఆ రికార్డింగ్స్ స్పష్టం చేస్తాయని అత్యున్నత న్యాయస్థానం అభిప్రాయపడింది. ఈ వ్యవహారంపై పంజాబ్, హర్యానా హైకోర్టు గతంలో ఇచ్చిన తీర్పును కోర్టు పక్కనబెట్టింది. కాగా, పంజాబ్‌లోని బఠిందాకు చెందిన ఓ వ్యక్తి తన భార్య నుంచి విడాకులు కోరుతూ ఫ్యామిలీ కోర్టును ఆశ్రయించారు. తన పట్ల భార్య క్రూరంగా ప్రవర్తిస్తోందని ఆరోపించిన ఆయన.. అందుకు సాక్ష్యంగా వారి మధ్య జరిగిన ఫోన్ సంభాషణల రికార్డులను సమర్పించారు. దీన్ని పరిగణనలోకి తీసుకున్న ఫ్యామిలీ కోర్టు విడాకుల కేసు విచారణను ప్రారంభించింది. అయితే, దీన్ని సవాల్ చేస్తూ ఆమె పంజాబ్, హర్యానా హైకోర్టును ఆశ్రయించారు. తన సమ్మతి లేకుండా, తనకు తెలియకుండా ఆ సంభాషణలను రికార్డ్ చేశారని.. వాటిని సాక్ష్యంగా పరిగణిస్తే తన ప్రాథమిక హక్కులకు భంగం వాటిల్లినట్లేనని వాదించారు. ఆమె అభ్యర్థనను అంగీకరించిన హైకోర్టు.. ఫ్యామిలీ కోర్టు ఉత్తర్వులను పక్కనబెట్టింది. దీంతో ఆ భర్త సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీనిపై జస్టిస్ బి.వి. నాగరత్న నేతృత్వంలోని ధర్మాసనం విచారణ జరిపి కీలక వ్యాఖ్యలు చేసింది. భార్యాభర్తల మధ్య సంభాషణకు సంబంధించిన సీక్రెట్ రికార్డింగ్‌లను సాక్ష్యాలుగా పరిగణిస్తే.. వైవాహిక బంధాలు ప్రమాదంలో పడుతాయని, భాగస్వాములపై నిఘా పెట్టడాన్ని ప్రోత్సహించినట్లు అవుతుందని కొందరు వాదిస్తున్నారు. కానీ, ఆ వాదన సమర్థనీయమైనదని మేం భావించట్లేదు. ఒకరిపై ఒకరు నిఘా పెట్టే పరిస్థితికి వచ్చారంటే.. వారి మధ్య వైవాహిక బంధం ఎంతగా బీటలు వారిందో అర్థం చేసుకోవచ్చు. పరస్పరం విశ్వాసం లేదని స్పష్టమవుతోంది. అందుకే ఆ రికార్డింగ్స్‌ను సాక్ష్యాలుగా పరిగణించుకోవచ్చు అని సుప్రీం ధర్మాసనం స్పష్టం చేసింది. దీనిపై హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను కొట్టేసిన అత్యున్నత న్యాయస్థానం.. ఈ విడాకుల కేసులో ట్రయల్ కోర్టు తమ విచారణ కొనసాగించొచ్చని తెలిపింది.


**IV అదనపు జిల్లా మరియు సెషన్ల న్యాయమూర్తి (మహిళా న్యాయస్థానం) కోర్టులో: నల్గొండ**

**జ.న. 153 ఆఫ్ 2019**

మధ్య:

**ముత్యాల బాబు మరియు ఇతరులు,**
**... పిటిషనర్లు/అప్పీలుదారులు**

మరియు

**ఆవుల లింగయ్య మరియు ఇతరులు**
**... ప్రతివాదులు/ప్రతివాదులు**

TO,

**ప్రతివాది నం. 2 :** ఆవుల మల్లమ్మ, భార్య / భర్త లేట్ ఎ. చిన్న ఇద్దయ్య, వయస్సు: 73 సంవత్సరాలు, పోగకువారిగూడెం, ఇంటి యజమాని రాంపురం గ్రామం, పి.ఎ. పల్లి మండలం మరియు నల్గొండ జిల్లా.

**ప్రతివాది నం. 4 :** ఆవుల చిన్న వెంకటయ్య, భార్య / భర్త లేట్ ఎ. చిన్న ఇద్దయ్య, వయస్సు: మేజర్, ఇంటి యజమాని రాంపురం గ్రామం, పి.ఎ. పల్లి మండలం మరియు నల్గొండ జిల్లా.

పైన పేర్కొన్న వాది సివిల్ అప్పీల్ **జ.న. 153 ఆఫ్ 2019** నల్గొండ కోర్టులో అప్పీల్ దాఖలు చేశారని గమనించండి మరియు ఆ దావాను 15-07-2025న ఉదయం 10-30 గంటలకు కోర్టు ముందు హాజరు కావాలని పోస్ట్ చేయబడింది. లేకుంటే ఈ విషయంపై ఏకపక్షంగా నిర్ణయం తీసుకోబడుతుంది.

(కోర్టు ఆదేశం ప్రకారం)

సం/-
**మునగాల నారాయణ రావు,**
**న్యాయవాది,**
నల్గొండ

నల్గొండ
తేదీ: 14-07-2025 సెల్: 9441913371



# జనరల్
STATE & REGIONAL NEWS

## ఆరేళ్ళ కనిష్ఠస్థాయికి వినియోగదారుల ద్రవ్యోల్బణం

**న్యూఢిల్లీ :** దేశంలో వినియోగదారుల ధరల ద్రవ్యోల్బణం ఆరేళ్ళ కనిష్ఠస్థాయికి చేరుకుంది. జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్‌ఎస్‌ఓ) సోమవారం విడుదల చేసిన ప్రకటన ప్రకారం, వినియోగదారుల ధరల ద్రవ్యోల్బణం జూన్ నెలలో 2.1 శాతంగా నమోదైంది. ఇంతకుముందు 2019 జనవరిలో ఈ ద్రవ్యోల్బణం 1.97 శాతంగా నమోదుకాగా, ఆ తర్వాత ఇంత కనిష్ఠస్థాయికి చేరుకోవడం ఇదే మొదటిసారి. ఈ ఏడాది మే నెలలో వినియోగ ధరల సూచీ ఆధారిత ద్రవ్యోల్బణం 2.82 శాతంగా నమోదైంది. ఇదే ద్రవ్యోల్బణం ఏడాది జూన్ నెలలో 5.08 శాతంగా ఉంది. అంటే గత ఏడాది నవంబరు నెల నుండీ వినియోగదారుల ధరల ద్రవ్యోల్బణం క్షీణదిశలో ప్రయాణం చేస్తోంది. వినియోగదారుల ధరల సూచీ (సిపిఐ) ఆధారంగా ఈ ఏడాది జూన్‌నెల ద్రవ్యోల్బణాన్ని పోలిస్తే 2.1 శాతం తక్కువగా ఉంది. ఆహారం, ఇంధనం సహా దేశ ఆర్థిక వ్యవస్థలో అన్ని వస్తు సేవల ధరల ద్రవ్యోల్బణంతో పోల్చి చూస్తే ఈ జూన్ నెలలో 72 బేసిస్ పాయింట్లు తగ్గింది. ఈ ఏడాది జూన్ నెలలో అన్ని వస్తుసేవల ధరల ద్రవ్యోల్బణం, ఆహార ద్రవ్యోల్బణం గణనీయస్థాయిలో కనిష్ఠస్థాయికి చేరుకున్నాయని ఎన్‌ఎస్‌ఓ తెలియజేసింది.



## మంత్రి జూపల్లిని కలిసిన బాలీవుడ్ నటుడు గగన్ మాలిక్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును సోమవారం బేగంపేట టూరిజం ప్లాజాలో ప్రముఖ బాలీవుడ్ నటుడు, జిటివి రామాయణంలో రాముడి పాత్రధారి, బుద్ధిజం ప్రచారకులు గగన్‌మాలిక్ మర్యాదపూర్వకంగా కలిశారు. గగన్ మాలిక్ ను బుద్ధవనం ప్రాజెక్ట్ స్పెషల్ ఆఫీసర్‌గా మల్లేపల్లి లక్ష్మయ్య మంత్రి జూపల్లికి పరిచయం చేశారు. అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన బుద్ధవనానికి ప్రపంచ దేశాల్లో ప్రాచుర్యం కల్పించడం, వివిధ బౌద్ధ దేశాలను బుద్ధవనానికి రప్పించడం, వారి సాంస్కృతిక కేంద్రాలను బుద్ధవనంలో ఏర్పాటు చేయడంతో పాటు ఈ ఏడాది అక్టోబర్లో థాయ్లాండకు చెందిన బౌద్ధ భిక్షువులు సుమారు 100 మందితో గుల్బర్గా మీదుగా బుద్ధవనానికి పాదయాత్రగా రావడం తదితర అంశాలను ఈ సందర్భంగా చర్చించారు.



## ఏడాది పదవీకాలం ఎంతో సంతృప్తినిచ్చింది

స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దేశంలోనే ఆదర్శవంతమైన నూతన క్రీడా విధానాన్ని ప్రకటించామని స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి అన్నారు. స్పోర్ట్స్ చైర్మన్ గా బాధ్యతలు తీసుకొని ఏడాది కాలం పూర్తి అయిన సందర్భంగా సోమవారం ఎల్‌బిస్టేడియంలోని తన చాంబర్‌లో స్పోర్ట్స్ అథారిటీ అధికారులతో కలిసి కేకు కట్ చేశారు. ఈ సందర్భంగా మీడియాతో ఆయన మాట్లాడుతూ.. ఏడాది పదవీకాలం ఎంతో సంతృప్తినిచ్చిందని, అనుకున్న దానికన్నా ఎంతో వేగంగా పనిచేశామని శివసేన రెడ్డి అన్నారు. జాతీయ అంతర్జాతీయ టోర్నమెంట్లు నిర్వహించి క్రీడాకారులు ఉత్సాహం ఎలా పాల్గొనడమే కాకుండా క్రీడాభిమానుల ప్రశంసలు పొందామని తెలిపారు. సిఎం కప్ 2024ను నిర్వహించి గ్రామీణ క్రీడాకారుల్లో ఉత్తేజం కలిగించామని, 20సంవత్సరాల నుండి ఎటువంటి ఆధునీకరణకు నోచుకోని వివిధ స్టేడియాలను మరో 20 సంవత్సరాల భవిష్యత్తు అవసరాలకు సరిపడేలా ఆధునికరించామని, దశాబ్ద కాలంగా క్రీడారంగాన్ని విస్మరించిన గత ప్రభుత్వము క్రీడాకారులకు క్రీడా సంఘాలకు ఎన్నో బకాయిలు పెట్టిపోతే ఒకటి ఒకటిగా వాటన్నిటిని విడుదల చేస్తున్నామని ఆయన అన్నారు. హాకీంపేట తో పాటు కరీంనగర్ అదిలాబాద్ క్రీడా పాఠశాలలను బలోపేతం చేస్తూ విద్యార్థులకు కావలసిన అన్ని సౌకర్యాలను మెరుగుపరుస్తున్నామని ఆయన తెలిపారు. ఎంత ఒత్తిడి పని భారం ఉన్నా సరే కార్యక్రమాల విజయవంతానికి కృషి చేస్తున్న అధికారులను కోచులను సిబ్బందిని ఆయన ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ డిప్యూటీ డైరెక్టర్లు చంద్రారెడ్డి, రవీందర్, అనిత, సుజాత, పద్మావతి ఇంజనీర్లు భాష, అశోక్ కుమార్ అసిస్టెంట్ డైరెక్టర్లు కేఆర్ భట్టార్ కళ్యాణి మినిస్ట్రియల్ సిబ్బంది కోచులు స్టేడియం అడ్మినిస్ట్రేటర్లు నాలుగో తరగతి సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రెషర్‌బాంబు పేలి ముగ్గురు పౌరులకు గాయాలు

**ప్రజాపక్షం/భద్రాచలం :** మావోయిస్టులు అమర్చిన ప్రెషర్ బాంబు పేలి ముగ్గురు పౌరులు గాయాలపాలైన ఘటన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో చోటు చేసుకుంది. ఆ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లా మద్దేడ్ పోలీస్టేషన్ పరిధిలో ఆదివారం రాత్రి ధంగోల్ గ్రామస్తులు పుట్టగొడుగుల సేకరణ కోసం సమీప అటవీ ప్రాంతానికి వెళ్లారు. ఈ సమయంలో పోలీసుల కోసం మావోయిస్టులు అమర్చిన ప్రెషర్ ఐఇడి బాంబు ఒక్క సారిగా పేలడంతో ఒక బాలికతో సహా ముగ్గురు గ్రామస్తులు గాయాలపాలయ్యారు. గాయపడిన వారిలో కడియం కవిత, కోర్సే సంతోష్, చిదెం కన్హయ్యలు ఉన్నారు. వారిని రాత్రిరాత్రే తక్షణ చికిత్సల కోసం బీజాపూర్ జిల్లా ఆస్పత్రికి తరలించి వైద్య సేవలు అందిస్తున్నారు. గిరిజనులు అడవల్లో సంచరించే సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని, అనుమానాస్పద వ్యక్తులు తారసపడితే వెంటనే పోలీసులకు సమాచారాన్ని ఇవ్వాలని పోలీస్ అధికారులు తెలిపారు.

# 'ఆయిల్ పామింగ్'కు ప్రభుత్వం కృషి

పెద్దవేడు గ్రామంలో ఆయిల్ పామ్ ప్లాంటేషన్ ప్రారంభం

వికారాబాద్, రంగారెడ్డి జిల్లాకు అధిక ప్రాముఖ్యత, అన్ని పంటలకు డ్రిప్ ఇరిగేషన్ ఇచ్చేందుకు పూర్తి అనుమతులు

రాష్ట వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు




**ప్రజాపక్షం/షాబాద్ :** దేశానికి సరిపడే ఆయిల్ పామింగ్ చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు అన్నారు. సోమవారం షాబాద్ మండల పరిధిలోని పెద్దవేడు గ్రామంలో సర్దార్‌నగర్ మార్కెట్ చైర్మెన్ పీసరి సురేందర్ రెడ్డి వ్యవసాయ క్షేత్రంలో ఆయిల్ పామింగ్ ప్లాంటేషన్ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, ప్రభుత్వ విప్ పట్నం మహేందర్ రెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య, జిల్లా గ్రంథాలయ చైర్మెన్‌లతో కలిసి ఆయిల్ పామ్ మొక్కలను నాటారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు మాట్లాడుతూ.. రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాలో హైదారాబాద్‌కు అతి దగ్గరలో ఉండడంతో మంచి డిమాండ్ ఉంటుందన్నారు. రైతులు భూములు అమ్ముకోకుండ ఆయిల్ పామ్ మొక్కలను సాగు చేస్తే మంచి లాభాలు వస్తాయని వివరించారు. కేంద్ర, రాష్ట ప్రభుత్వాలు ఆయిల్ సాగుపై ప్రత్యేక దృషి సారించేందుకు రాష్ట ప్రభుత్వం రైతుల క్షేమం కోసం నిరంతరం పని చేస్తుందన్నారు. గత సంత్సరంలో 2 వేల ఎకరాలు సాగు చేస్తే వచ్చే ఎడాదికి 5 వేల ఎకరాలు సాగు చేయాలని అధికారులకు సూచించారు. చేవెళ్ల నియోజక వర్గంలో సుమారుగా 400 ఎకరాలు ఆయిల్ పామ్ సాగు చేస్తే వెంటనే ఇక్కడ కంపెనీ ఏర్పాటు చేస్తామని చెప్పారు. త్వరలో షాద్‌నగర్ స్వమిపంలోని కేశంపేట్ మండలంలో నూతనంగా కంపెనీ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం ఉద్యానవన శాఖ డైరెక్టర్ ఆస్మీన్ బాష మాట్లాడుతూ.. దేశానికి 30 మిలియన్ ఆయిల్ అవసరం ఉండగా, కేవలం మన దగ్గర 13వేల మిలియన్ మాత్రమే ఉంది. ఇంక 71 వేల మిలియన ఆయిల్ ఇతర దేశాల నుండి ఇన్‌పుట్ చేసుకుంటున్నామన్నారు. మన రాష్ట్రంలో ఆయిల్ పామ్ సాగు చేస్తుకుంటే మంచి లాభాలు రైతులకు వస్తాయని వివరించారు. రైతులు పంట సాగు చేసుకునేందుకు ప్రభుత్వమే పూర్తి రాయితీ కల్పిస్తుందన్నారు. ఈ అవకాశం పెద్ద రైతులు, సన్నకారు రైతులు ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. ప్రభుత్వ విప్ మహేందర్ రెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య, జిల్లా గ్రంథాలయ చైర్మెన్ మధుసుదన్ రెడ్డి మాట్లాడుతూ.. రైతులు పండించిన పూలు, కూరగాయాలు నగరంలోని గుడి మల్కాపూర్ మార్కెట్‌కు తరలించాలంటే రైతులకు వాహణాల ట్రాఫిక్ ఇబ్బందులు వస్తున్నాయి, గుడిమల్కాపూర్ మార్కెట్‌ను మొహినాబాద్‌కు మార్చాలని మంత్రికి వివరించారు. దీంతో మంత్రి స్పందించి భూమిని కేటాయించండి నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గుడి మల్కాపూర్ మార్కేట్ వైజ్ చైర్మెన్ చంద్రశేఖర్, సర్దార్‌నగర్ మార్కేట్ చైర్మెన్ పీసరి సురేందర్ రెడ్డి, చేవెళ్ల మార్కేట్ చైర్మెన్ పెంటయ్య, అధికారులు జేడి ఉష, డిఎస్‌హెచ్ సురేష్, ఆర్డీఒ చంద్రకళ, తహాశీల్దార్ అన్వర్, ఎంపిడిఒ అపర్ణ, మండల వ్యవసా అధికారి కృష్ణ మోహన్, ఎఈఒ కిరణ్మయి, రాజేశ్వరి, శివతేజ కాంగ్రెస్ పార్టీ నాయకులు తమ్మళి రవీందర్, మండల మహిళ అధ్యక్షురాలు ఆశ్వీని ,రాహూల్ గుప్త, మాజీ ఎంపిటిసి కుమ్మరి చెన్నయ్య, అశోక్, శ్రీనివాస్ గౌడ్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## "బహుజనగణమన" పుస్తకాన్ని ఆవిష్కరించిన గవర్నర్ బండారు దత్తాత్రేయ




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సమాజం సమతుల్యంగా ఉండాలంటే అందరికీ సమాన హక్కులు ఉండాలన్న దార్శనిక ఆలోచనలతో "బహుజనగణమన" దీర్ఘకావ్యం వెలువడిందని గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. బిసి జన గణన, ఆర్థిక, రాజకీయ, సామాజిక న్యాయం, సమాన హక్కుల కోసం ప్రముఖ కవి, తెలంగాణ సాహిత్య అకాడమి మాజీ చైర్మన్ జూలూరు గౌరీ శంకర్ రాసిన "బహు జన గణమన దీర్ఘకావ్యాన్ని" సోమాజిగూడలోని హైదరాబాద్ ప్రెస్ క్లబ్‌లో బండారు దత్తాత్రేయ సోమవారం ఆవిష్కరించారు. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమి మాజీ చైర్మన్ అల్లం నారాయణ, రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్, రిటైర్డ్ ఐఎస్ చిరంజీవులు, బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్, ప్రముఖ రచయిత్రి జ్వలిత, ప్రొఫెసర్ తిరుమలి, ప్రముఖ సాహిత్య విమర్శకులు సంగిశెట్టి శ్రీనివాస్, హైదరాబాద్ ప్రెస్ క్లబ్ కార్యదర్శి రవికాంత్ రెడ్డి తదితరులు హాజరయ్యారు.



రైల్వే స్టేషన్ల పునరాభివృద్ధి పనులపై

## దక్షిణ మధ్య రైల్వే జిఎం సంజయ్ కుమార్ శ్రీవాస్తవ సమీక్ష

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రైలు కార్యకలాపాల భద్రతపై దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ సమీక్ష సమావేశం నిర్వహించారు. దక్షిణ మధ్య రైల్వేలో చేపట్టిన స్టేషన్ పునరాభివృద్ధి పనుల పురోగతిపై కూడా సమీక్షించారు. ఈ సమావేశంలో దక్షిణ మధ్య రైల్వే అదనపు జనరల్ మేనేజర్ నీరజ్ అగ్ర వాల్, అన్ని ప్రధాన విభాగాధిపతులతో పాటు పాల్గొన్నారు. సికింద్రాబాద్, హైదరాబాద్, విజయవాడ, గుంతకల్, గుంటూరు,నాందేడ్ వంటి ఆరు డివిజన్ల డివిజనల్ రైల్వే మేనేజర్లు (డిఆర్ఎంలు) వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు. అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా జోన్‌లోని 119 స్టేషన్లలో సుమారు రూ. 6744 కోట్లతో చేపట్టిన పునరాభివృద్ధి పనుల స్థితిగతులపై సంజయ్ కుమార్ శ్రీవాస్తవ సమీక్ష నిర్వహించారు.వీటిలో బేగంపేట, వరంగల్, కరీంనగర్ స్టేషన్లలో పనులు పూర్తయ్యాయి. స్టేషన్లపై వాటి డివిజన్, ప్రాజెక్ట్ ఖర్చు, పూర్తి చేయడానికి లక్ష్యంగా పెట్టుకున్న తేదీ మరియు పని యొక్క ప్రస్తుత స్థితికి సంబంధించిన వివరణాత్మక పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. జోన్ వ్యాప్తంగా 11 స్టేషన్లలో ప్రధానంగా చేపట్టిన పునరాభివృద్ధి పనుల పురోగతి స్థితిపై జనరల్ మేనేజర్ ప్రశంసించారు. ప్రాజెక్టులను వీలైనంత త్వరగా పూర్తి చేయడానికి పనుల వేగంతో కొనసాగించాలని ఆయన అధికారులను ఆదేశించారు.

## రష్యాలో నైపుణ్యంగల కార్మికుల కొరత

### డిసెంబరునాటికి భారత్ నుండి 10 లక్షలమంది

**మాస్కో:** ఈ ఏడాది చివరి నాటికి భారత్ నుండి రష్యా 10 లక్షలమంది నైపుణ్యం గల కార్మికులను తీసుకువెళ్ళనున్నది. రష్యాలోని అత్యున్నత స్థాయి పరిశ్రమలలో నైపుణ్యంగల కార్మికుల కొరత ఏర్పడింది. ఈ పోస్టులను భర్తీ చేసేందుకు ఈ ఏడాది చివరి నాటికి పది లక్షలమంది కార్మికులను రష్యా తీసుకువెళుతుంది. ఒక వ్యాపారవేత్త ఈ విషయం చెప్పారు. "నాకు తెలిసినంతవరకూ ఈ ఏడాది చివరి నాటికి భారత దేశం నుండి 10 లక్షలమంది ప్రత్యేక నైపుణ్యంగల కార్మికులను రష్యా తీసుకువెళుతుంది, స్వెర్డ్‌లోవిస్క్ ప్రాంతంతో సహా రష్యాకు వీరిని తరలిస్తారు. యెకటరింబర్గ్‌లో భారతీయ కార్మికులకోసం కొత్తగా ఒక కాన్సులేట్ జనరల్‌ను కూడా ప్రారంభిస్తారు.

# వర్షాలు సమృద్ధిగా కురుస్తాయ్

'రంగం' కార్యక్రమంలో భవిష్య-వాణి వినిపించిన స్వర్ణలత



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఈసారి వర్షాలు సమృద్ధిగా కురు స్తాయని, అలాగే అగ్నిప్రమాదాలు కూడా జరుగుతాయని రంగం కార్యక్రమంలో స్వర్ణలత భవిష్యవాణి వినిపించారు. సికింద్రాబాద్ లష్కర్ బోనాల ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన 'రంగం' కార్యక్రమాన్ని సోమవారం ఉదయం ఘనంగా నిర్వహించారు. రాష్ట్రాన్ని, దేశాన్ని కాపాడే భారం తనదని తెలిపారు. రాబోయే రోజుల్లో మహమ్మారి వెంటాడుతుందని, అగ్నిప్రమాదాలు కూడా సంభవిస్తాయని చెప్పారు. జాగ్రత్తగా ఉండాలని భక్తలకు సూచించారు. ఈ ఏడాది వర్షాలు తప్పకుండా కురుస్తాయని, పాడి పంటలు సమృద్ధిగా పండుతాయన్నారు. 'బాలబాలికలను మీరు విచ్చలవిడిగా వదిలేస్తున్నారు, కానీ నేను కడుపులో పెట్టుకొని కాచుకుంటున్నాను. ఈసారి చాలా సంతోషంగా పూజలు చేశారు. మీ అందరినీ సంతోషంగా సమానంగా చూస్తాను. కాలం తీరితే ఎవరు ఏది అనుభవించాలో అది అనుభవిస్తారు. నేను అడ్డురాను అని స్వర్ణలత భవిష్యవాణి వినిపించారు.

**అమ్మవారు కోరినవిధంగా ప్రభుత్వం తరుపున అన్నీ చేస్తాం**

**మంత్రి పొన్నం ప్రభాకర్**

ఉజ్జయిని మహంకాళి బోనాల సందర్భంగా లక్షలాది మంది బోనాలు సమర్పించి, అమ్మవారి చల్లని దీవెనలు ఉండాలని వేడుకున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. రాబోయే కాలంలో సమృద్ధి వర్షాలు పాడి, పంటలతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని కోరుకున్నట్లు చెప్పారు. అమ్మవారు కోరిన విధంగా ప్రభుత్వం తరుపున అన్ని చేస్తామన్నారు. అమ్మవారి దేవాదాయ శాఖ తరపున శాస్త్రీయంగా జరగాల్సిన పూజలు నిర్వహిస్తామన్నారు. 1815లో ఏర్పడిన అమ్మవారి దేవాలయంలో అన్ని ఏర్పాట్లు చేస్తామన్నారు. ప్రజలంతా సహకరించారని, ఎక్కడ ఎలాంటి సమస్యలు లేకుండా అమ్మవారి ఆశీర్వాదంతో ఈ కార్యక్రమాలు జరిగాయన్నారు. అమ్మవారికి గతంలో బంద్ అయిన బలి రక్తం అమ్మవారు కోరిన విధంగా ఈ అంశాన్ని ప్రభుత్వం పరిశీలన చేస్తుందన్నారు.

## బాలల పరిరక్షణకు విస్తృతంగా పనిచేయాలి

మంత్రి సీతక్క

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బాలల పరిరక్షణ కోసం మరింత విస్తృతంగా పని చేయాలని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క సూచించారు. తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ సీతాదయాకర్‌రెడ్డి హైదరాబాద్‌లోని సచివాలయంలో మంత్రి సీతక్కను సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కమిషన్ ఏర్పడి మూడు నెలలు పూర్తి చేసుకున్న నేపథ్యంలో తొలి మూడు నెలల నివేదికను మంత్రి సీతక్కకు సీతా దయాకర్ రెడ్డి సమర్పించారు.బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చేపట్టిన కార్యకలాపాలు, జిల్లాల్లో కలెక్టర్లతో నిర్వహించిన సమీక్ష సమావేశాలు, బాలల హక్కుల పరిరక్షణ కోసం చేపట్టిన చర్యలు, క్షేత్ర స్థాయి పర్యటనలు,యూనిసెఫ్ నుంచి తీసుకున్న శిక్షణ, స్వచ్ఛంద సంస్థలతో సంప్రదింపులు, బాలల హక్కుల పరిరక్షణ కోసం చేపట్టిన ప్రచార కార్యక్రమాలు, జిల్లా పర్యటనలు,శిశు విహార్ సందర్శన,ఇందిరా మహిళా శక్తి మిషన్ వర్క్ షాప్, ఇటుక బట్టీల్లో పని చేస్తున్న వలస కూలీ పిల్లలకు భరోసా కార్యక్రమాలు,అవగాహన కార్యక్రమాలు తదితర కార్యక్రమాలను నిర్వహించారు.

## బిసి స్టడీ సర్కిల్ ద్వారా గ్రూప్స్‌కు ఉచిత శిక్షణ

బిసి స్టడీ సర్కిల్ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో మొత్తం 12 టిజి బిసి స్టడి సర్కిళ్లలో గ్రూప్స్, ఆర్ఆర్‌బి, ఎస్ఎస్‌సి, బ్యాంకింగ్ రంగాలలో నియమాకం కోసం ఫౌండేషన్ కోర్సు ఉచిత కోచింగ్ కార్యక్రమాన్ని వచ్చేనెల 8వ తేదీ నుంచి 150 రోజుల పాటు నిర్వహించనున్నట్లు హైదరాబాద్ టిజి బిసి స్టడీ సర్కిల్ డైరెక్టర్ డి. శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. అర్హులైన అభ్యర్థులు www.tgbcstudycircle.cgg.gov.in ద్వారా ఈనెల 13వ తేదీ నుంచి వచ్చేనెల 11వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులు గ్రాడ్యుయేషన్ పూర్తిచేసి తల్లిదండ్రుల వార్షికాదాయం గ్రామీణ ప్రాంతంలో రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2లక్షల లోపు కలిగి ఉండాలన్నారు. డిగ్రీ పరీక్షలో అత్యధిక శాతం మార్కులు, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం అభ్యర్థుల ఎంపిక విధానం ఉంటుందన్నారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.1000 చొప్పున ఐదు నెలల పాటు స్టైఫండ్ మంజూరు చేస్తారన్నారు. మరిన్ని వివరాలకు 040 24071178 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

# రైలు బోగీలలో సిసిటివి కెమెరాలు

రైళ్లలో ఇక భద్రతకు పెద్దపీట

చీమ చిటుక్కుమన్నా తెలిసిపోతుంది!

ప్రయాణికుల భద్రతపై రైల్వే శాఖ కీలక నిర్ణయం

74వేల రైలు కోచ్‌లలో సిసి కెమెరాలు

ఇప్పటికే ట్రయల్స్ నిర్వహణ-త్వరలో దక్షిణ మధ్య రైల్వేలో సిసిటివిలు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హత్యలు, దోపిడీలు, దొంగతనాలు, కిడ్నాప్‌లు, మిస్సింగ్ కేసులుతో పాటు ఇతర చిన్నాపెద్ద నేరాలను చేధించడంలో సిసిటివిల పాత్ర అమోఘం. గతంలో ఒక నేరాన్ని చేధించాలంటే రోజులు, నెలలు, ఏండ్లు గడిచిన సందర్భాలు ఉన్నాయి. అయితే సిసిటివిల ఎప్పుడైతే వచ్చాయో నిముషాలు, గంటల్లో పోలీసులు కేసులను చేధిస్తున్నారు. ఒక్క సిసి టివి కెమెరా 100 మంది పోలీసుల విధులతో సమానం. ఒక్క హైదరాబాద్ నగరంలోనే మనం కిలో మీటర్ ప్రయాణిస్తే సుమారు వందకుపైగా సిసికెమెరాలలో మన కదలికలు పడిపోతున్నాయి. ఇంత ప్రాముఖ్యత ఉన్న సిసిటివి కెమెరాలను రైల్వే శాఖ ఉపయోగించుకోవాలని నిర్ణయానికి వచ్చింది. ప్రయాణికుల భద్రతకు పెద్దపీట వేస్తూ, రైల్వే శాఖ ఒక కీలక నిర్ణయం తీసుకుంది. దేశవ్యాప్తంగా ఉన్న 74,000 రైలు కోచ్లలో త్వరలో సిసిటివి కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ నిర్ణయించారు. కోచ్ తలుపుల వద్ద ఈ కెమెరాలు అమర్చనున్నారు. ఈ చర్య ప్రయాణికుల భద్రతను గణనీయంగా మెరుగుపరుస్తుంది. ప్రయాణికులను లక్ష్యంగా చేసుకునే దుండగులు, ముఠాలను ఈ కెమెరాలు అరికడుతుంది. నార్తర్న్ రైల్వేలో లోకో ఇంజన్లు, కోచ్‌లలో విజయవంతంగా సిసిటివి కెమెరాల ట్రయల్స్ నిర్వహించిన తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నారు. త్వరలో దక్షిణ మధ్య రైల్వేలో కూడా ఈ సిసిటివిలను అమర్చనున్నారు. సిసిటివి కెమెరాల ట్రయల్స్‌ను మంత్రితో పాటు ఉన్నతాధికారులు సమీక్షించారు. ప్రతి రైలు కోచ్కు డోమ్ తరహా నాలుగు సిసిటివి కెమెరాలు ఏర్పాటు చేయనున్నారు. ఒక్కో ప్రవేశ మార్గంలో రెండు కెమెరాలు ఉంటాయి. అదేవిధంగా, ప్రతి లోకోమోటివ్లో ఆరు సిసిటివి కెమెరాలు ఉంటాయి. వీటిలో ఒకటి ముందు వైపు, ఒకటి వెనుక వైపు మరియు రెండు వైపులా ఉంటాయి. లోకో యొక్క ప్రతి క్యాబ్లో (ముందు మరియు వెనుక) ఒక డోమ్ సిసిటివి కెమెరా, రెండు డెస్క్‌మౌంటెడ్ మైక్రోఫోన్లు అమర్చబడతాయి. గంటకు 100 కిలోమీటర్ల కంటే ఎక్కువ వేగంతో ప్రయాణించే రైళ్లలో కూడా తక్కువ వెలుతురు ఉన్న పరిస్థితుల్లో కూడా అధికనాణ్యత గల దృశ్యాలు అందుబాటులో ఉండేలా ఉండే సిసిటివిలను అమర్చనున్నారు. సిసిటివి కెమెరాల ద్వారా సేకరించిన డేటాపై కృత్రిమ మేధస్సు (ఏఐ) వినియోగాన్ని రైల్వే ఉన్నతాధికారులు పరిశీలిస్తారు. ఏదైనా కోచ్‌లో నేరాలు జరిగిన సమయంలో వీటిని పరిశీలించి నిందితులను పట్టుకోవడంతో సిసిటివిలు దోహదపడతాయి.



# అనేక ప్రశ్నలకు తావిస్తున్న ఎఎఐబి నివేదిక

కారణం చెప్పలేదు...సిఫార్సులు చేయలేదు!

నెలరోజులుగా వదంతులన్నీ నిజం కాదని తేలింది

పైలట్ల ఫిట్‌నెస్, ఇంధన నాణ్యతలో లోపాలు లేవు

ఎయిర్ ఇండియా సిఇఓ విల్సన్

**న్యూఢిల్లీ :** అహ్మదాబాద్‌లో కుప్పకూలిపోయిన విమాన ప్రమాద ఘటనపై ఎఎఐబి (ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో) దర్యాప్తు చేసి మొన్న శనివారంనాడు సమర్పించిన 15 పేజీల ప్రాథమిక నివేదిక అనేక ప్రశ్నలకు తావిస్తోందని ఎయిర్ ఇండియా ఎయిర్‌లైన్స్ సిఇఓ క్యాంప్ బెల్ విల్సన్ అన్నారు. ప్రాథమిక నివేదిక ఎలాంటి కారణాన్ని చెప్పలేదని, అలాగని ఎలాంటి సిఫార్సులూ కూడా చేయలేదన్నారు. ప్రాథమిక నివేదికలో ఎలాంటి సాంకేతిక పరమైన సమస్యలనూ, విమాన నిర్వహణా పరమైన సమస్యలను కూడా ప్రస్తావించలేదని అన్నారు. అదేవిధంగా విమానంలో ఎలాంటి అసాధారణ పరిస్థితీ లేదన్నారు. విమానాన్ని పక్షి ఢీ కొట్టలేదని, ఎలాంటి పేలుడు పదార్థాలూ విమానంలో లేవని కూడా నివేదిక తెలియజేసింది. పైలట్ల ఆరోగ్యం, వారి ఫిట్‌నెస్‌లలో ఎలాంటి తేడాలు లేవని సమర్థించారు. ఈ నివేదికలో విమాన యంత్రాలకు సంబంధించిన ఎలాంటి లోపాలను వేలెత్తి చూపించలేదని అన్నారు. ఈ నివేదిక ద్వారా ముందస్తు నిర్ణయాలకు రావడం తెలివితక్కువ పనే అవుతుందన్నారు. గడచిన నెలరోజులుగా ఎయిర్ ఇండియా పనితీరుపై అనేక ఊహాగానాలు చెలరేగాయనీ, ఎంతో గందరగోళం నెలకుందనీ, అనేక సిద్ధాంతాలు బయటకు వచ్చాయనీ, ఎన్నో ఆరోపణలు, వదంతులూ వ్యాప్తి చెందాయనీ, పత్రికల్లో ఎంతో ఉత్కంఠతో కూడిన శీర్షికలు పెట్టి వార్తలు రాశారనీ, కానీ అవన్నీ తప్పు అని తర్వాత రుజువైందన్నారు.

ఐతే విమానం బయలుదేరి ఒక్క సెకను వ్యవధిలోనే ఇంజన్లకు ఇంధనాన్ని సరఫరా చేసే వ్యవస్థ పనిచేయలేదని స్విచ్ ఆఫ్ అయ్యిందని కాక్‌పిట్ వాయిస్ ద్వారా తేలిందని నివేదిక తెలియజేసింది. ఇంధన సరఫరా స్విచ్‌ను ఎందుకు ఆఫ్ చేశామని ఒక పైలట్ మరో పైలట్‌ను అడగడం కాక్‌పిట్ వాయిస్ రికార్డర్‌లో నమోదైంది. జూన్ 12వ తేదీన అహ్మదాబాద్ విమానాశ్రయం నుండి బయలుదేరిన ఎయిర్ ఇండియా 171 బోయింగ్ బయల్దేరిన 32 సెకన్ల తర్వాత కుప్పకూలిపోయింది. అందులో ప్రయాణిస్తున్న ఒక్కరు మినహా మిగిలిన 241 మంది మరణించారు. ఈ విమానం కుప్పకూలిన మెడికల్ కాలేజీ భవనంలో ఉన్న మరో 19 మంది కూడా మరణించారు.

"ప్రాథమిక నివేదిక విడుదలైన తర్వాత మాతో పాటు యావత్ ప్రపంచం కూడా ఏం జరిగిందనే విషయం తెలుసుకోవడానికి అదనపు సమాచారాన్ని సేకరించడం ప్రారంభించిందన్నారు. ఆశ్చర్యానికి అవకాశం లేకుండా ఈ నివేదిక అటు పూర్తి స్పష్టతకూ, ఇటు అదనపు ప్రశ్నలు లేవనెత్తడానికి అవకాశం ఇచ్చిందన్నారు. విమానం బయలుదేరేటప్పుడు నివేదిక చెప్పిన విషయాన్ని ప్రస్తావిస్తూ ఇంధన నాణ్యతలో కూడా ఎలాంటి లోపం లేదన్నారు. ఎయిర్‌లైన్స్ సిబ్బందికి అంతర్గతంగా ఇచ్చిన మెమోలో ఆయన ఈ విషయాలన్నీ ప్రస్తావించారు. అదేవిధంగా విమానం బయలుదేరేముందుగా పైలట్లకు అనివార్యంగా ఆరోగ్య పరీక్షలు చేస్తారని, వారు మద్యం సేవించి ఉన్నారా? అనే విషయాన్ని పరీక్షల ద్వారా నిర్ధారించుకుంటారన్నారు.

## వెంకటరమణ కాలనీ పడమర నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాపక్షం/ఎల్‌బి నగర్‌: వనస్థలిపురం డివిజన్‌లోని వెంకటరమణ కాలనీ(పడమర) నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా, ఉపాధ్యక్షులుగా, జాయింట్ సెక్రటరీగా, ఆర్గనైజింగ్ సెక్రటరీగా, కోశాధికారిలను నామినేషన్ వేయగా వారిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శి పోస్టింగ్‌కు ఎన్నిక నిర్వహించారు. ఈ పోటీలో మొత్తం ఓట్లు 165 గాను కల్వకోలు సురేందర్‌రెడ్డిపై నేనావత్ రాములు నాయక్ 75 ఓట్లతో గెలుపొందినట్లు ఎలక్షన్ అధికారి జనార్ధన్‌రెడ్డి తెలిపారు. అనంతరం నూతనంగా ఎన్నికైన కార్యవర్గానికి ఎన్నికైన పత్రాలను అందజేశారు. కాలనీ అధ్యక్షులుగా మాటేటి రవీంద్రనాథ్, ఉపాధ్యక్షులుగా బి. సుధాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా నేనావత్ రాములు నాయక్, సహాయ కార్యదర్శిగా కె. జగదీష్‌రెడ్డి, ఆర్గనేజింగ్ సెక్రటరీగా ఎం. కరుణాకర్ రెడ్డి ఎన్నికయ్యారు. అనంతరం అధ్యక్షలు రవీంద్రనాథ్ మాట్లాడుతూ కాలనీ అభివృద్ధి కోసం కృషి చేస్తామన్నారు. నవీన్‌కుమార్, వెంకటేష్, మల్లేష్, సతీష్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, కిషన్ గౌడ్, భాస్కర్ గౌడ్ ఉన్నారు.

## యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు

ప్రజాపక్షం/సరూర్‌నగర్‌: తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలోనే యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు, ఉద్యోగ నోటీఫికేషన్ విడుదల చేయడంలో అగ్రగామిగా నిలిచిందని టిపిసీసీ సభ్యులు, మహేశ్వరం నియోజకవర్గం సీనియర్ నాయకులు దేప భాస్కర్‌రెడ్డి అన్నారు. సోమవారం దిల్‌షుఖ్‌నగర్ సాయిబాబా దేవాలయంలో సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన సి.వి.రెడ్డి ఇన్స్టిట్యూట్ ఆఫ్ పోలీస్ అకాడమి ను రాష్ట్ర యువజన నాయకులు చిలుక ఉపేందర్‌రెడ్డితో కలిసి దేప భాస్కర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా దేప మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మొదటి సారిగా జాబ్ క్యాలెండర్ విడుదల చేసి వేలాది మంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించారని అన్నారు. అభినందనీయమన్నారు. దిల్‌షుఖ్‌నగర్ లో ప్రాం తంలో ఏర్పాటు చేసిన సి.వి.రెడ్డి ఇన్స్టిట్యూట్ ఆఫ్ పోలీస్ అకాడమి యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు జ్ఞానేశ్వర్‌యాదవ్, శేఖర్‌ముదిరాజ్, కళ్యాణ్, పెద్దపూర సైదులు, జంగారెడ్డి, డైరెక్టర్‌లు వెంకట్ చోళ, గోవింద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

### రంగారెడ్డి కలెక్టర్ సి.నారాయణరెడ్డి

ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి: ప్రజావాణిలో ప్రజల నుండి స్వీకరించిన ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యతనిస్తూ సత్వరమే పరిష్కరించాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమవేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా తమ సమస్యలు తెలపడానికి వచ్చిన ప్రజల నుండి ఫిర్యాదులను జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి,అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్,డిఆర్ఓ సంగీతతో కలిసి స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలిం చి సమస్యలను పరిష్కరించాలని అధికారులను జిల్లా ఆదేశించారు. మొత్తం 152 ఫిర్యాదులు వచ్చాయని,వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు.పిర్యాదు ల్లో అధికంగా రెవెన్యూ శాఖ130,ఇతర శాఖలకు 22,మొత్తం 152 దరఖస్తులు అందాయి.జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్,జిల్లా రెవెన్యూ అధికారి సంగీత,వివిధ శాఖల జిల్లా అధికారులు,మున్సిపల్ అధికారులు,మండల తహశీల్దారులు,కలెక్టరేట్ సూపరింటెండెంట్లు,అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికల్లో బిసిలకు 42 శాతం అమలు చేయాలి




ప్రజాపక్షం/షాబాద్ : లోకల్ బాడి ఎన్నికల్లో బిసిలకు 42 శాతం అమలు చేయాలని బిఆర్ఎస్ నాయకులు నక్క శ్రీనివాస్ గౌడ్ అన్నారు. సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం బిసిలకు 42 శాతం కేటాయించడం అభినందనీయం అన్నారు. ఇచ్చిన మాటను అమలు చేయాలంటే జడ్పిటిసి, ఎంపిటిసి, సర్పంచ్ ఎన్నికల్లో అమలు చేసి నిరుపించుకోవాలని డిమాండ్ చేశారు. హామీలు ఇవ్వడం కాదు అమలు చేసినప్పుడే బిసిలకు ఉపయోగపడుతుందన్నారు. పార్టీ నాయకులు వెంకటయ్య, పొన్నమోని రమేష్ యాదవ్, కమ్మరి శ్రీను, ముఖ్రమ్ తదితరులు ఉన్నారు.

## ప్రభుత్వ భూమిని రక్షించరూ..



ప్రజాపక్షం/షాద్‌నగర్: ప్రభుత్వ భూమిని కాపాడేందుకు కృషి చేయండి కమీషనర్ గారు అంటూ గ్రామ కాంగ్రెస్ యువకులు కోరారు. సోమవారం షాద్‌నగర్ మున్సిపల్ కమీషనర్ సునీతకు గ్రామ కాంగ్రెస్ యువ నాయకుడు సింగపాగ అనిల్‌కుమార్, బాబు, సోమ్లా, రవి, సురేష్, మున్నా, కిషోర్, ప్రకాష్, నరేష్‌లు వినతిపత్రం అందజేశారు. మున్సిపల్ పరిధిలోని సోలీపూర్ గ్రామంలో సర్వేనంబర్ 30,31లో బిల్డింగ్ బ్లాక్స్ వెంచర్ ఏర్పాటు సమయంలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం 10శాతం స్థలాన్ని పార్కు కోసం కేటాయించారు. ఈ స్థలంపై కన్నేసిన కొందరు ప్రైవేట్ వ్యక్తులు వచ్చి అక్రమించుకొని అక్రమ నిర్మాణాలు చేస్తున్నారని వివరించారు. అక్రమ నిర్మాణాలను తొలగించి ప్రభుత్వ స్థలాలను పరిరక్షించేందుకు చర్యలు తీసుకోవాలని కమీషనర్‌ను కోరారు. ఇందుకు కమీషనర్ సునీత స్పందిస్తూ ప్రభుత్వ స్థలాలు అక్రమించి నిర్మాణాలు చేస్తే ఉపేక్షించేది లేదని, తమ సిబ్బంది ద్వారా అక్కడకు చేరుకొని అక్రమ నిర్మాణాలను తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని వివరించారు. ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ కోసం అనేక చర్యలు తీసుకోవాలని, ప్రత్యేకంగా బోర్డులను సైతం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

## ఎంపి మల్లురవికి అభినందన



ప్రజాపక్షం/షాద్‌నగర్: కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణ కమిటి చైర్మెన్, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లురవి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించినట్లు షాద్‌నగర్ మార్కెట్ కమిటి వైస్ చైర్మెన్ బాబర్‌ఖాన్ తెలిపారు. సోమవారం మల్లురవి స్వగృహానికి స్థానిక కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివెళ్ళి జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు అంబరాన్ని అంటే విధంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాబర్‌ఖాన్ మాట్లాడుతూ కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటి చైర్మెన్, ఎంపి మల్లురవికి తమకు దశాబ్దాల అనుబంధం ఉందని, మంచి మనస్సు వ్యక్తి అని పేర్కొన్నారు. కాంగ్రెస్ గిరిజన ఆదివాసి కోఆర్డినేటర్ రఘునాయక్, చెంది తిరుపతిరెడ్డి, బాల్‌రాజ్ గౌడ్, దంగు శ్రీనివాస్ యాదవ్, ముబాకర్ పాల్గొన్నారు.

## మహిళల ఆరోగ్య పరిరక్షణకు కృషి




ప్రజాపక్షం/సరూర్‌నగర్‌: మహిళల ఆరోగ్య పరిరక్షణలో గర్భాశయాన్ని కాపాడే ప్రోత్సహించడమే కాకుండా, ప్రాక్టికల్ శిక్షణ ద్వారా డాక్టర్‌లకు ఎంతో విలువైన అనుభవాన్ని అందించేందుకు ఈ శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందని ఓజోన్ ఆసుపత్రి వైద్యనిపుణులు మైక్రోవేవ్ సర్జన్ శంకర్‌నాయక్, గైనకాలజిస్ట్ డాక్టర్ పూజిత తెలిపారు. సోమవారం ఓజోన్ ఆసుపత్రిలో మహిళల ఆరోగ్య పరిస్థితి పై రెండు రోజుల పాటు ప్రత్యేక సేవ్ ది ఉటీరస్ హ్యాండ్ ఆన్ వర్క్‌షాప్ విజయవంతంగా నిర్వహించారు. రాష్ట్రం నలుమూలలనుండి ప్రఖ్యాత గైనకాలజిస్టులు, ల్యాపరోస్కోపిక్ సర్జన్లు ఈ వర్క్‌షాప్‌లో పాల్గొని అత్యాదునిక సాంకేతికతలపై శిక్షణ అందించారు.


## అన్ని పనులు హైడ్రాకు అప్పగిస్తే..

# జిహెచ్‌ఎంసి ఏం చేస్తోంది?




### పండుగల సీజన్‌లో పనులు జరగడం లేదు

### ప్రజావాణిలో అధికారులను ప్రశ్నించిన కార్పొరేటర్ శ్రవణ్




ప్రజాపక్షం/హైదరాబాద్ : ప్రజలకు జిహెచ్‌ఎంసి అందించే సేవలన్ని హైడ్రాకు ఎందుకు బదిలీ చేస్తున్నారని మల్కాజిగిరి బిజెపి కార్పొరేటర్ శ్రవణ్ అధికారులను నిలదీశారు. జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో కమిషనర్ కుర్చికి కొబ్బరికాయ కొట్టి, శ్రవణ్ వినూత్నంగా నిరసన చేపట్టారు. అదనపు కమిషనర్ సి.ఎన్.రఘుప్రసాద్, చీఫ్ ఇంజనీర్(నిర్వహణ) సహదేవ్ రత్నకర్‌లు పండుగల సీజన్‌లో అవసరమైన పనులు చేస్తామని హామీనివ్వడంతో శ్రవణ్ నిరసన విరమించారు. జిహెచ్‌ఎంసి అధికారాలను, ప్రజలకు అందించాల్సిన సేవలను హైడ్రాకు ఎందుకు బదిలీ చేస్తున్నారని అధికారులను ప్రశ్నించారు. నాలాలు, డిజాస్టర్ రెస్పన్స్ పనులను హైడ్రా చేతిలో పెట్టి జిహెచ్‌ఎంసి నిద్రపోయే పరిస్థితికి వచ్చిందని విమర్శించారు. గతంలో వర్షాకాల అత్యవసర బృందాలు, నాలాల నిర్వహణ, డిజాస్టర్ రెస్పాన్స్ బృందాలు జిహెచ్‌ఎంసికి చెందిన ఎఇ పర్యవేక్షణలో ఉండేవని, రోడ్లపై నీరు నిలిచినా వీరితో పనులు చేయించేందుకు అవకాశం ఉండేదన్నారు. ప్రస్తుతం హైడ్రాకు అప్పగించడంతో దిక్కుతొచని పరిస్థితి నెలకొందన్నారు. ఫలితంగా రోడ్లపై గుంతలు, నీరు అలాగే ఉంటుందనారు. డిప్యూటి కమిషనర్ల బదిలీల్లో పెద్ద మొత్తంలో డబ్బులు చేతులు మారాయని శ్రవణ్ తీవ్ర స్థాయిలో ఆరోపించారు. డిప్యూటి కమిషనర్ల బదిలీలో జరిగిన అవకతవకలపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ప్రజావాణిలోకి ఫిర్యాదు చేయడానికి వచ్చే బాధితులను ఫోన్‌లు అనుమతించడం లేదన్నారు. ఈ అంశాలపై కమిషనర్, జోనల్ కమిషనర్, డిప్యూటి కమిషనర్లను అడిగేందుకు ఎవ్వరు అందుబాటులో లేరన్నారు.

### ప్రజావాణి ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలి : అదనపు కమిషనర్ సిఎన్‌రఘుప్రసాద్

ప్రజావాణిసందర్భంగా ప్రజల నుండి వచ్చిన విన్నపాల పరిష్కారంలో జాప్యం చేయరాదని జిహెచ్‌ఎంసి అదనపు సి.ఎన్. రఘుప్రసాద్ అధికారులకు సూచించారు. జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలో నిర్వహించినప్రజావాణిలో అదనపు కమిషనర్లువేణుగోపాల్, సత్యనారాయణ, గీతా రాధిక, ఎస్. పంకజ, అలీవేలు మంగతాయారు పాల్గొని నగరం నలుమూలల నుండి వచ్చిన ప్రజల నుండి విన్నపాలు స్వీకరించారు. రఘు ప్రసాద్ మాట్లాడుతూ నగర ప్రజల సమస్యల పరిష్కారానికి అధికారులు విశేష కృషి చేయాలన్నారు. ఈకార్యక్రమంలో చీఫ్ ఇంజనీర్(నిర్వహణ) సహదేవ్ రత్నాకర్, అదనపు చీఫ్ సిటీప్లానర్లు ప్రదీప్ కుమార్, బి.వెంకన్న, రంజిత్ కుమార్, చీఫ్ మెడికల్ అధికారి డాక్టర్ పద్మజ, చీఫ్ వెటర్నరీ అధికారి అబ్దుల్ వకీల్, చీఫ్ పిఆర్ఓ మహమ్మద్ ముర్తుజా, జాయింట్ కమిషనర్ స్పోర్ట్స్ వాణి దేవి, అడ్వటైజ్‌మెంట్ అధికారి దుర్గన భాను, జాయింట్ కమిషనర్ ఎస్టేట్ యాదయ్య, చీఫ్ హార్టికల్చర్ అధికారి సునంద, విద్యుత్ ఈఈ మమత, యుసిడి పిడి దేవేందర్ రెడ్డి, డిప్యూటీ సిఈ పనస రెడ్డి, మోహన్ రెడ్డి, హౌసింగ్ డిప్యూటి ఈఈ రాజేశ్వర్‌రావు పాల్గొన్నారు.

## ఐటిసి మంగళ్‌దీప్ ఆధ్వర్యంలో.. సిక్స్త్ సెన్స్ ప్యానెల్ కార్యక్రమం



ప్రజాపక్షం/హైదరాబాద్ : భారతదేశంలోని ప్రముఖఅగర్ బత్తి బ్రాండ్ అయిన ఐటిసి మంగళ్‌దీప్, తన సిక్స్త్ సెన్స్ ప్యానెల్ కార్యక్రమం కింద ప్రత్యేక సువాసన శిక్షణా కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసిన 30 మంది దృష్టి లోపం ఉన్న వ్యక్తులను హైదరాబాద్‌లో సత్కరించింది. ఈ కార్యక్రమం సిక్స్త్ సెన్స్ ప్యానెల్ సభ్యుల సంఖ్యను 180 మందికి విస్తరించడానికి కూడా దారితీసింది. ప్రస్తుతం వీరిలో ప్రముఖ విద్యా, వృత్తిపరమైన నేపథ్యాల నుండి పాల్గొంటున్నారు. 2021లో ప్రారంభించబడిన సిక్స్త్ సెన్స్ ప్యానెల్ సుసువాసన అభివృద్ధి ప్రక్రియలో దృష్టి లోపం ఉన్న వ్యక్తులను భాగస్వామ్యం చేయడానికి ఒక ప్రత్యేకమైన కార్యక్రమంగా రూపొందించినట్టు ఐటిసి అగర్‌బత్తి, మ్యాచెస్ విభాగం, డివిజనల్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ గౌరవ్ తాయల్ తెలిపారు. చెన్నై, కోల్‌కతా, ముంబై, ఢిల్లీ, హైదరాబాద్‌లలో 180మందికి పైగా సభ్యులకు శిక్షణ ఇచ్చామన్నారు. సిక్స్త్ సెన్స్ ప్యానెల్ 4 సంవత్సరాల క్రితం ప్రారంభమైందన్నారు. ఇప్పుడు మంగళ్‌దీప్ వద్ద ఎంపిక చేసిన సువాసన సమర్పణలను తాము ఎలా అభివృద్ధి చేస్తాం, మెరుగుపరుస్తాం అనే దానిలో అంతర్భాగంగా రూపాంతరం చెందిందన్నారు. సహజంగా అధికమైన ఘ్రాణ ఇంద్రియ జ్ఞానం ఉన్న వ్యక్తులతో కలిసి పనిచేయటం వల్ల సాంప్రదాయ పరీక్షా పద్ధతులకు మించి విలువైన దృక్పథాలు మాకు లభిస్తున్నాయన్నారు. రాబోయే రోజుల్లో దృష్టి లోపం ఉన్న సమాజంతో మరింత అర్థవంతమైన, ఆకర్షణీయమైన భాగస్వామ్యాన్ని చేసుకోవాలని మంగళ్‌దీప్ ఎదురుచూస్తున్నామన్నారు.

## ఆక్రమణ జరిగితే హైడ్రాకు ఫిర్యాదు



ప్రజాపక్షం/హైదరాబాద్ : ఆక్రమణ ఎంతటిదైనా, అవతలి వారు ఎంతటివారైనా.. నగర ప్రజలు వెనుకాడడంలేదు. మనకెందుకులే అనుకోవడంలేదు. నేరుగా హైడ్రా ప్రజావాణికి వచ్చి ఫిర్యాదు చేస్తున్నారు. వరద కాలువలు, చెరువలు,, రహదారులు,పార్కులు, ప్రభుత్వ, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలు ఇలా ఎక్కడ ఏవి ఆక్రమణలకు గురైనా ప్రజావాణికి వచ్చి వివరాలందిస్తున్నారు. ఆక్రమణలకు సంబంధించిన వివరాలను ఆధారాలతో అందిస్తున్నారు. ఇలా సోమవారం హైడ్రా ప్రజావాణికి మొత్తం 61 ఫిర్యాదులందాయి. వీటిని హైడ్ర అదనపు డైరెక్టర్ వర్ల పాపయ్య పరిశీలించారు.గూగుల్ మ్యాప్స్‌లో గతం లో ఎలా ఉండేది, ఇప్పుడు ఎలా మారిందో వివరాలను తెలుసుకున్నారు. ఫిర్యాదు దారుల ముందే ఆ పరిస్థితులను వివరించి, సంబంధిత అధికారులకు ఆ సమస్య పరిష్కార బాధ్యతలను అప్పగించారు.

## జిహెచ్‌ఎంసి పిఆర్‌ఓగా మామిండ్ల దశరథం



ప్రజాపక్షం/హైదరాబాద్ :జిహెచ్‌ఎంసి పిఆర్‌ఓగా మామిండ్ల దశరథం సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అంతకు ముందు ఆయన జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్‌ను సిపిఆర్‌ఓ మహమ్మద్‌ముర్తుజాతోకలిసి మర్యాదపూర్వకంగా కలిశారు. సమాచార, పౌర సంబంధాల శాఖ ప్రధాన కార్యాలయంలో అసిస్టెంట్ డైరక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న మామిండ్ల దశరథంను ఇటీవలే జిహెచ్‌ఎంసి పిఆర్‌ఓగా డిప్యూటేషన్‌పై నియమిస్తూ ఆ శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో కామారెడ్డి, జగిత్యాల, సిరిసిల్ల, సిద్ధిపేట, కరీంనగర్ జిల్లా పౌర సంబంధాల అధికారిగా, పురపాలక పట్టణాభివృద్ధి శాఖ పిఆర్‌ఓగా, జిడబ్ల్యూఎంసి పిఆర్‌ఓగా విధులు నిర్వహించారు.

## రూ.8 కోట్లతో బిటిరోడ్డు పనులు ప్రారంభం



ప్రజాపక్షం/షాద్‌నగర్: రూ.8కోట్లతో నిర్మించనున్న బిటి రోడ్డు నిర్మాణం పనులను ఫరూఖ్‌నగర్ మాజీ జడ్పిటిసి సభ్యుడు పి.వెంకట్‌రాంరెడ్డి ప్రారంభించారు. సోమవారం మండల పరిధిలోని కమ్మదనం నుండి మధురాపూర్ వరకు వేయనున్న బిటి రోడ్డు నిర్మాణం పనులను మాజీ జడ్పిటిసి సభ్యుడు వెంకట్‌రాంరెడ్డి, మాజీ ఎంపిటిసి సభ్యుడు భార్గవ్‌కుమార్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాల్‌రాజ్ గౌడ్‌లతోపాటు గ్రామస్తులు పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల పరిధిలోని కమ్మదనం నుండి గంట్లవెల్లి మీదుగా మధురాపూర్ వరకు ఉన్న పాత బిటి రోడ్డు పూర్తిగా దెబ్బతిందని, దాంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. దాంతో షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ దృష్టికి తీసుకువెళ్ళగా తక్షణమే స్పందించి ప్రభుత్వం నుండి రూ.8కోట్ల నిధులు మంజూరు చేయించారని, వెంటనే పనులు సైతం ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉందని పేర్కొన్నారు. డబుల్‌లైన్ బిటి రోడ్డు వేస్తుండటంతో ఈ గ్రామాలను అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. ఎన్నో ఏళ్ల నుండి ఈ బిటి రోడ్డును బాగుచేయాలని అనేక పర్యాయాలు గత పాలకుల దృష్టికి తీసుకువెళ్ళినా ఫలితం లేకుండా పోయిందని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యే తక్షణమే స్పందించడం, శంకుస్థాపన చేయడమే కాకుండా పనులుప్రారంభించడం అభినందనీయమన్నారు. మాజీ సర్పంచ్ శివారెడ్డి, కాంగ్రెస్ నాయకులు పుల్లారెడ్డి, అమర్నాథ్ రెడ్డి, వినాయకగౌడ్, జక్కు మాధవరెడ్డి, లక్నాపురం బుచ్చిరెడ్డి, రవి, పర్వత్‌రెడ్డి, బండి శ్రీనివాస్, వేణులు పాల్గొన్నారు.

## గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే కాంగ్రెస్ లక్ష్యం

### షాద్‌నగర్ శాసన సభ్యులు వీర్లపల్లి శంకర్




ప్రజాపక్షం/కొత్తూరు: గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేయాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా అనేక పథకాలను అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వివరించారు. సోమవారం నందిగామ మండల పరిధిలోని తాళ్లగూడ గ్రామంలో హెచ్ఎండిఏ నిధులు రూ.10లక్షలతో వేయనున్న సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. పల్లెల్లో సిసి రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులతోపాటు మండలాలను కలుపుతూ బిటి రోడ్లను సైతం నిర్మిస్తున్నట్లు తెలిపారు. రహదారుల నిర్మాణం పూర్తి అయితేనే గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి సాధించేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. వన మహోత్సవంలో పాల్గొని మొక్కలు నాటారు. ఉమ్మడి మండలాల మాజీ ఎంపిపి శివశంకర్ గౌడ్, మండల పార్టీ అధ్యక్షులు జంగ నరసింహ, కొందుర్గు మండల పార్టీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, కొత్తూరు మున్సిపల్ అధ్యక్షుడు జె.సుదర్శన్ గౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు హరినాథ్‌రెడ్డి, మాజీ ఎంపిటిసి కొమ్ము కృష్ణ, కుమారస్వామి గౌడ్, చంద్రపాల్‌రెడ్డి, నర్సింలు, సురేందర్‌లు పాల్గొన్నారు.

## గడ్డిఅన్నారం ప్రజలకు ఊరట

ప్రజాపక్షం/ సరూర్‌నగర్‌: సరూర్‌నగర్ చెరువు టన్నెల్ పనులు ప్రస్తుతం తుది దశకు చేరుకోవడంతో స్థానిక ప్రజలకు గొప్ప ఊరట కలిగిస్తోందని గడ్డిఅన్నారం డివిజన్ కార్పోరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం టన్నెల్ పనుల పురోగతిని ఇరిగేషన్ సరూర్‌నగర్ లేక్ వర్క్ ఇన్స్‌స్పెక్టర్ అశోక్ కలిసి కార్పోరేటర్ బద్దం ప్రేమ్ పరిశీలించారు. కార్పోరేటర్ మాట్లాడుతూ గత మూడున్నర సంవత్సరాలుగా ఈ టన్నెల్ పనులు అనేకసవాళ్లతో ముందుకు సాగిందన్నారు. మధ్యలో కాంట్రాక్టర్ ఆలస్యం వంటిఅనేక కారణాలతో ప్రజలకు నష్టాలు, అసౌకర్యాలు ఏర్పడ్డాయన్నారు.సమావేశాలు,నిరసనలు, కౌన్సిల్ సమావేశాల్లో గళమెత్తడం ద్వారా చివరకు పనులు విజయవంతంగా తుదిదశకు వచ్చాయని వెల్లడించారు. కీలక పాత్ర వహించిన యం.పి ఈటల రాజేందర్, జిహెచ్‌ఎంసీ కమిషనర్ కర్ణన్, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి , జోనల్ కమీషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ లకు హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## బోనాల ఉత్సవాలకు చెక్కుల పంపిణీ



ప్రజాపక్షం/ఎల్‌బి నగర్‌: బోనాల ఉత్సవాలకు సంబంధించిన ప్రభుత్వం అంధిస్తున్న చెక్కులను సోమవారం కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాలయంలో స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, రాష్ట్ర రోడ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రామ్‌రెడ్డి, బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి చేతుల మీదుగా బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ కాలనీలకు చెందిన దేవాలయ కమిటీ సభ్యులను చెక్కులు పంపిణీ చేశారు. పార్టీ నాయకులు విష్ణువర్ధన్‌రావు, విష్ణువర్ధన్‌రెడ్డి, సురేష్ కుమార్ తదితరులు ఉన్నారు.

**హయత్ నగర్‌లో...** తెలంగాణ రాష్ట్ర సంస్కృతి, సంంప్రదాయాలకు ప్రతీక అయిన బోనాల పండుగ సందర్భంగా దేవాలయాలకు అలంకరణ నిమిత్తం కోసం మంజూరు చేసిన చెక్కులను కర్మన్ ఘాట్ హనుమాన్ దేవాలయంలో స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, రాష్ట్ర రోడ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రామ్‌రెడ్డి, హయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవ జీవన్‌రెడ్డితో కలిసి హతయనగర్‌కు చెందిన దాదాపు 223 దేవాలయాలకు గాను 68,3400 రూపాయాలు చెక్కును కర్మన్‌ఘాట్ దేవాలయంలో ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు.

**మన్సూరాబాద్‌లో...**బోనాలపండుగను నిర్వహించుకునేందుకు అమ్మవారి దేవాలయాల కమిటీ సభ్యులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న చెక్కులను కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాలయంలో స్టేట్‌ఫైనాన్స్‌కార్పొరేషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, రాష్ట్ర రోడ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రామ్‌రెడ్డి, మన్సూరాబాద్ కార్పొరేటర్, జిహెచ్‌ఎంసి ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహ్మారెడ్డి చేతుల మీదుగా మన్సూరాబాద్ దేవాలయాల కమిటీ సభ్యులను చెక్కులు అందజేశారు.

## నందనవనం కాలనీల డ్రైనేజీ కోసం ప్రతిపాదనలు ఇవ్వండి

### హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోత్ సుజాత నాయక్



ప్రజాపక్షం/ఎల్‌బి నగర్‌: డ్రైనేజీ సమస్యలను తీర్చేందుకు హస్తినాపురం డివిజన్ పరిధిలోని నందనవనం, అగ్రికల్చర్ కాలనీ, విశ్వేశ్వరయ్య కాలనీలలో డ్రైనేజీ లైన్ నిర్మాణాలకు నిధులు మంజూరు చేసి, ప్రతిపాదనలు సిద్ధం చేయాలని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్, జిహెచ్‌ఎంసి స్టాండింగ్ కమిటీ సభ్యులు బానోత్ సుజాత నాయక్ సోమవారం జలమండలి ఎండి అశోక్‌రెడ్డిని వారి కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నందనవనంలో ఎన్నో ఏళ్ల క్రింతం నిర్మించిన డ్రైనేజీ పూర్తి స్థాయిలో అస్తవ్యస్తంగా ఉందని, గత కొంత కాలంగా డ్రైనేజీ మురుగు నీరు రోడ్లపై పారడం జరుగుతుందని ఆమె తెలిపారు. జనాభాకు అనుగుణంగా నూతనంగా డ్రైనేజీ లైన్లు ఏర్పాటు చేయాలని కోరారు. నూతనంగా జేఎన్ఆర్ఎం గృహాలకు, ఇతర కాలనీలకు సుమారు మూడు కిలోమీటర్ల మేర 300 డయతో డ్రైనేజ్ లైన్ నిర్మించేందుకు నిధులు మంజూరు చేయాలని కోరారు. అగ్రికల్చర్ కాలనీ, హస్తినాపురం సౌత్ కాలనీ, విశ్వేశ్వరయ్య కాలనీలో సుమారు రెండు కిలోమీటర్ల మేర పైప్‌లైన్ నిర్మించేందుకు అవసరం ఉందన్నారు. అదేవిధంగా మంచి నిటీ పైప్‌లైన్ ఏర్పాటు చేయాలని ఎండి తెలిపారు. ఈమేరకు జలమండలి ఎండి అశోక్‌రెడ్డి సానుకులంగా స్పందించినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గొపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఉన్నారు.

## బిసి రిజర్వేషన్లకు అడ్డొస్తే ఊరుకోం



ప్రజాపక్షం/కొత్తూరు: బీసి రిజర్వేషన్లకు అడ్డువస్తే ఉపేక్షించేది లేదని, ఎన్నో ఏళ్లుగా బీసిలకు జరుగుతున్న అన్యాయానికి నేడు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పుణ్యమా అని న్యాయం జరుగుతుంటే అడ్డుకునేందుకు కుట్రలు చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు జె.సుదర్శన్ గౌడ్ ఆరోపించారు. సోమవారం కొత్తూరు మున్సిపాలిటిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. సుదర్శన్ గౌడ్ మాట్లాడుతూ బీసిలు ఎదుర్కొంటున్న సమస్యలను దృష్టిలో పెట్టుకొని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తే అడ్డుకునేందుకు కుట్రలు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.ప్రభుత్వకాంగ్రెస్‌ప్రభుత్వ హయాంలోనే బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి ఎంతో న్యాయం జరుగుతుందని వివరించారు. గతంలో ఇళ్ళులేని పేదలకు ఇళ్ళు ఇవ్వడం, భూములను పంపిణీ చేయడం వంటి అనేక సహాసోసేతమైన నిర్ణయాలను తీసుకోవడం జరిగిందని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రంలో బిసిలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించడం ఎంతో గొప్ప విషయమని పేర్కొన్నారు. పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో బిసి రిజర్వేషన్లు ఎమ్మెల్సీ కవితకు గుర్తుకు రాలేవా అని ప్రశ్నించారు. నేడు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బిసిలకు ఇస్తే ఎందుకు తట్టుకోవడం లేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో బీసిలకు ఇచ్చిన రిజర్వేషన్ల ప్రకారం దేశ వ్యాప్తంగా కుల గనన నిర్వహించి బీసిలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. యువజన సంఘం మండల అధ్యక్షుడు వన్నాద శివశంకర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వీరమోని దేవేందర్, అంబటి ప్రభాకర్, సత్తయ్య,చిల్కమర్రి నర్సింలు, నవీన్‌చారి, ఆంజనేయులు, భరత్ పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తలు పాటించాలి

ప్రజాపక్షం/దమ్మాయిగూడ: సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కమిషనర్ వెంకట్ రెడ్డి అన్నారు. సోమవారం దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలో 100 రోజుల ప్రణాళికలో భాగంగా కీసర అంబేద్కర్‌నగర్ కాలనీలో డెంగ్యూ, మలేరియా వంటి సీజనల్ వ్యాధులు రాకుండా అవగాహన, తడి, పొడి వ్యర్థాల వేరుచేయడం, సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నివారించాలన్నారు. కీసర చౌరస్తాలో డాక్టర్ అంబేద్కర్ విగ్రహం వద్ద మానవహారం నిర్వహించారు. రోడ్డుకిరువైపుల చెత్త, పొదల తొలగింపు చేశారు.



## ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి: వికారాబాద్ కలెక్టర్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రవాణి కార్యక్రమానికి జిల్లా అధికారులు సకాలంలో హాజరై, ప్రజావాణికి వచ్చే దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించాలి అని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. వివిధ ప్రాంతాల ప్రజలనుండి 126 దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అధికారులందరు సమయపాలన పాటించాలని తెలిపారు. ప్రజావాణిలో వచ్చిన ప్రతి దరఖాస్తును క్షుణంగా పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సుధీర్, ట్రైనింగ్ కలెక్టర్ హర్స్‌చౌదరి ఆర్‌డిఒ వాసుచంద్ర, తదితరులు పాల్గొన్నారు.





## జిహెచ్‌ఎంసి మల్కాజిగిరి సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌గా జకీయ సుల్తాన్

ప్రజాపక్షం/మల్కాజిగిరి : జిహెచ్‌ఎంసి మల్కాజిగిరి సర్కిల్ డిప్యూటి కమిషనర్‌గా నియమితులైన జకీయ సుల్తాన్ సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు, సర్కిల్ కార్యాలయ అధికారులు, సిబ్బంది సహకారంతో ప్రజాభివృద్ధి కార్యక్రమాలు అమలు చేయటంలో కృషి చేస్తానన్నారు. అన్ని ప్రాంతాల వాసులు పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచటంలో బాధ్యతగా ఉంటూ శానిటరీ సిబ్బందికి సహకరించాలని కోరారు. ఇప్పటివరకు సర్కిల్ డిప్యూటి కమిషనర్‌గా పనిచేసిన జి.రాజు ఉప్పల్ సర్కిల్‌కు బదిలీ అయ్యారు.



## డ్రైనేజీ సమస్యలు పరిష్కరించాలని జోనల్ కమిషనర్‌కు వినతి

ప్రజాపక్షం/చర్లపల్లి: కాలనీలో డ్రైనేజీ సమస్యలు పరిష్కరించాలని ఉప్పల్ ఎంఎల్‌ఎ బండారి లక్ష్మారెడ్డి జోనల్ కమిషనర్‌ను కోరారు. చర్లపల్లి డివిజన్ పరిధిలోని రెడ్డి కాలనీ, భగవాన్ కాలనీ, కృష్ణానగర్ కాలనీ, ఎంఆర్‌ఆర్ కాలనీల నుండి ఎన్నో యేళ్లుగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ లేక వర్షాకాలం నీరు బయటికి వెళ్లక కాలనీలలో నీరు ప్రవహిస్తుండడంతో కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారు. డ్రైనేజీ వేసేందుకు ఎన్‌ఒసి రావడంతో జోనల్ కమిషనర్‌ను కలసి డ్రైనేజీ సమస్యలు పరిష్కరించాలని ఎంఎల్‌ఎ కోరారు. ఈ కార్యక్రమంలో మహేష్‌గౌడ్, భూమిరెడ్డి, వెంకట్ రాంరెడ్డి, జీవన్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, వెలుమరెడ్డి, అమరేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



## అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు

### మేడ్చల్ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్

ప్రజాపక్షం/ఘట్‌కేసర్ : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలనలోనే ఇందిరమ్మ కల సాకారం అయిందని ప్రభుత్వం చిత్తశుద్ధితో ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తోందని మేడ్చల్ నియోజకవర్గం ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. సోమవారం ఘట్‌కేసర్ మున్సిపాలిటీలో అంబేద్కర్ నగర్, కొండాపూర్, గుంటిగూడెం గ్రామంలో తోటకూర వజ్రేష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే మల్లి పెద్ది సుధీర్ రెడ్డి, మేడ్చల్ నియోజకవర్గం బి–బ్లాక్ అధ్యక్షులు వేముల మహేష్ గౌడ్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్, కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షులు మామిళ్ళ ముత్యాలు యాదవ్, మాజీ సర్పంచ్ అబ్బసాని యాదగిరి యాదవ్‌లు కలిసి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు.ఈ సందర్భంగా తోటకూర వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ నిరుపేద కుటుంబాలకు సొంతింటి కల నెరవేరాలన్నదే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్ష. ఇందిరమ్మ ఇండ్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షల నిధులను అర్హులైన లబ్దిదారులకి మంజూరు చేస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గడ్డి అన్నారం మార్కెట్ కమిటి డైరెక్టర్ మచ్చేందర్ రెడ్డి, కీసర గుట్ట డైరెక్టర్ సగ్గు అనిత, మాజీ రైతు సమన్వయ అధ్యక్షులు కొంతం అంజిరెడ్డి, మాజీ కౌన్సిలర్ మల్లేష్, బొక్క ప్రభాకర్ రెడ్డి, యూత్ అధ్యక్షులు బొక్క సంజీవ రెడ్డి, ఉపాధ్యక్షులు నాగరాజ్, మహ్మద్ ఖయ్యూం, మాధవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## నాలా పనులు ప్రారంభించిన కార్పొరేటర్

ప్రజాపక్షం/మల్కాజిగిరి: మల్కాజిగిరి డివిజన్‌లోని విష్ణుపురి కాలనీలో రూ.60లక్షల వ్యయంతో చేపట్టిన నాలా పనులను స్థానిక కార్పొరేటర్ శ్రవణ్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో రూ.1.5 కోట్ల వ్యయంతో చేపట్టిన నాలా పనులను తాజా పనులతో పూర్తిస్థాయిలో ఫలితాలనిస్తుందన్నారు. వినాయక చవితి పండుగలోగా నాలా పనులను పూర్తి చేయించాలని ఆయన అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో జిహెచ్‌ఎంసి మల్కాజిగిరి సర్కిల్ డిఇ మహేష్, ఎఇ నవీన్, రమేష్‌లతో పాటు నాని, శ్రీనివాస్, వెంకట లక్ష్మి , తదితరులు పాల్గొన్నారు.



# ప్రమాదకరంగా మారిన పాత ఫ్లైఓవర్లు

### మరమ్మతులు చేపట్టిన జిహెచ్‌ఎంసి



ప్రజాపక్షం/హైదరాబాద్ : పాతబడిన ఫ్లైఓవర్లు ప్రమాదకరంగా మారాయి. ఫ్లైఓవర్ వయోడక్ట్ కలిపే స్లబ్‌ల వద్ద ఎగుడు దిగుడుగా మారాయి. దీంతో ఫ్లైఓవర్‌పై వాహనాలు కుదుపులకు గురవుతున్నాయి. ఈ క్రమంలో పాతబడిన ఫ్లైఓవర్లకు మరమ్మతులు చేపట్టాలని మహానగర పాలక సంస్థ(జిహెచ్‌ఎంసి) నిర్ణయించింది. నగరంలో ఉన్న 24 పాత ఫ్లైఓవర్లపై అధ్యయనం చేయించారు. వాటికి దశల వారీగా మరమ్మతులు చేపట్టాలని అధికారులను జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ ఆదేశించారు. మాసబ్‌ట్యాంక్ జంక్షన్‌లోని ఫ్లైఓవర్‌కు మరమ్మతుల పనులు చేపట్టారు. ఈ ఫ్లైఓవర్ నుండి మెహిదీపట్నం వైపు పివిఎన్‌ఆర్ ఎక్స్‌ప్రెస్‌వే వరకు వాహనాల ట్రాఫిక్ రద్దీ ఏర్పడుతుంది. ఈ నేపథ్యంలో వాహనాల రాకపోకలికి అంతరాయం కలగకుండా చూసేందుకు జిహెచ్‌ఎంసి ఈ మరమ్మతుల పనులను రాత్రి సమయంలో చేపడుతోంది. ఫ్లైఓవర్‌లో నీటి లీకేజీని నివారించేందుకు, జాయింట్ల వద్ద రోడ్డు దెబ్బతినకుండా చూడటానికి స్ట్రిప్ సీల్ జాయింట్లను మారుస్తున్నారు. ఇప్పటికే నగరంలోని పాత ఫ్లైఓవర్లపై మరమ్మతులను జిహెచ్‌ఎంసి చేపట్టింది. లాలాపేట్, జామే ఉస్మానియా రైల్వే ఫ్లైఓవర్లకు ఇప్పటికే పూర్తిస్థాయిలో మరమ్మతులు జరిపారు. ఆ సమయంలో రోడ్డు ఒక భాగాన్ని పూర్తిగా మూసివేశారు. అయితే, మాసబ్‌ట్యాంక్ ఫ్లైఓవర్ విషయంలో అది సాధ్యపడలేదు. మాసబ్‌ట్యాంక్ ఫ్లైఓవర్‌పై విపరీతమైన ట్రాఫిక్ రద్దీ ఏర్పడుతుండటంతో రాత్రిపూట పనులు చేయాలని అధికారులు నిర్ణయించారు. రాత్రిపూట పనులు చేస్తూ, పగటిపూట పనులు జరుగుతున్న ఆ భాగంలో ఐరన్ షీట్లతో కప్పి వాహనాలను అనుమతిస్తున్నారు. ఈ స్ట్రిప్ సీల్ జాయింట్ల మరమ్మతుల కోసం జనవరి, ఫిబ్రవరిలో జిహెచ్‌ఎంసి టెండర్లు ఆహ్వానించింది. దాదాపు రూ.48లక్షల అంచనాతో పనులు ప్రారంభించింది. 1999లో నిర్మించిన మాసబ్‌టాంక్ ఫ్లైఓవర్ నగరంలోని తొలి తరం ఫ్లైఓవర్లలో ఒకటిగా నిలుస్తుంది.

నారాయణగూడ, బషీర్‌బాగ్, తార్నాక ఫ్లై ఓవర్లతో పాటు ఇది కూడా ఆ కాలంలోనే నిర్మించారు. సాధారణంగా ఫ్లైఓవర్ జీవితకాలం 30–40ఏళ్లు కాగా, మాసబ్‌టాంక్ ఫ్లైఓవర్ 25 ఏళ్లు కూడా పూర్తవకముందే దెబ్బతినడం ప్రారంభమైంది. దీంతో అధికారులు మరమ్మతులను వేగవంతం చేశారు.

1986లో నిర్మించిన ఖైరతాబాద్ ఫ్లైఓవర్‌పై ఇప్పటివరకు ఎలాంటి మరమ్మతులు చేపట్టకపోవడం గమనార్హం. అయినా వాహనదారులు అక్కడ బంపీల ప్రయాణాన్ని ఎదుర్కొంటున్నారు. మొత్తం 24 ఫ్లైఓవర్లకు దశల వారీగా మరమ్మతులు చేపట్టాలని నిర్ణయించారు. వీటిలో ఖైరతాబాద్, బషీర్‌బాగ్, నారాయణగూడ, సికింద్రాబాద్, పంజాగుట్ట, బేగంపేట్, తార్నాక, ఫతేనగర్, నల్లగొండ, క్రాస్‌రోడ్స్, మూసాపేట్, సీతాఫల్‌మండి, గ్రీన్‌ల్యాండ్స్, సచివాలయం తెలుగు తల్లి ఫ్లైఓవర్లు ఉన్నాయి.

## నిబద్ధత కల్గిన మరో నేతను సిపిఐ కోల్పోయింది

* కుటుంబ సభ్యులకు అండగా ఉంటాం

### నివాళులు అర్పించిన ఎమ్మెల్యే కూనంనేని





ప్రజాపక్షం/మేడ్చల్‌ప్రతినిధి/మల్కాజిగిరి: పార్టీ సిద్ధాంతాలకోసం నిబద్ధతతో తుది శ్వాస వరకు పోరాడిన నిరాడంబర జీవి, నిబద్ధత కల్గిన సిపిఐ మేడ్చల్ జిల్లా సమితి సభ్యులు కామ్రేడ్ కాపు సహదేవ్ భౌతిక కాయంపై పార్టీ అగ్ర నేతలు, వందల సంఖ్యలో తరలి వచ్చిన పార్టీ శ్రేణులు, అభిమానులు సోమవారం అరుణపతాకాన్ని కప్పి నివాళులర్పించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి, శాసన సభ్యుడు కూనంనేని సాంబశివరావు, రాష్ట్ర కార్యదర్శి వి ఎస్.బోస్, జాతీయ సమితి సభ్యులు ఎండి యూసుఫ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సాయిలు గౌడ్, జిల్లా కార్యదర్శి ఉమామహేష్, డిహెచ్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఏసురత్నం, కార్యదర్శి మారుపాక అనిల్, ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ధర్మేంద్ర, గిరిజన సమైక్య రాష్ట్ర కార్యదర్శి అంజయ్య నాయక్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దామోదర్‌రెడ్డి, శంకర్రావు, జిల్లా సమితి సభ్యులు దశరథ్, పి.శంకర్, రచ్చ కిషన్, స్వామి, హరినాథ్, సత్యప్రసాద్, వి.శ్రీనివాస్, కాసర్ల నాగరాజు, గిరిజ, లక్ష్మి రవిచంద్రన్, గద్దర్ అభిమాన సంఘ నాయకులు డివిల్ యాదగిరి, పలు ప్రజా సంఘాల నాయకులు, అభిమానులు కామ్రేడ్ సహదేవ్ జోహార్..జోహార్ అంటూ అశ్రునయనాలతో వీడ్కోలు పలికారు.

యాప్రాల్‌లోని ఆయన నివాసానికి వచ్చిన పలువురు సమీప వాసులు, అభిమానులు, సిపిఐ శ్రేణులతో పాటు పలు రాజకీయ పార్టీలకు చెందిన పలువురు సహదేవ్ భౌతిక కాయాన్ని చూసి కన్నీటి పర్యంతమయ్యారు.

ఆరు మాసాల కాలంలో నిత్యం ప్రజలతో మమేకమవుతూ వారి సమస్యలే తమవిగా భావించి పోరాట బాటలో నిలిచిన మేడ్చల్ జిల్లాకు చెందిన సిపిఐ నేతలు బాలమల్లేష్, రొయ్యల కృష్ణమూర్తి, సహదేవ్‌లు అనారోగ్యంతో మృతి చెందటం తీరని నష్టమని, వారి కుటుంబ సభ్యులకు పార్టీ అన్ని విధాలా తోడుగా నిలుస్తుందన్నారు. సహదేవ్ కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. కమ్యూనిస్టుగా వారి అంకిత భావం, సిద్ధాంతాల పట్ల నిబద్ధత కల్గిన నాయకులుగా పేరొందారన్నారు.



## దుర్గానగర్ కాలనీ సమస్యలు పరిష్కరిస్తా

ప్రజాపక్షం/కాప్రా : దుర్గానగర్ కాలనీలో ప్రజలె దుర్కొంటున్న సమస్యలను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరిస్తానని మల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం కాలనీలో జిహెచ్‌ఎంసి వర్క్ ఇనస్పెక్టర్లు భిక్షపతి, రామారావులతో కల్సి పర్యటించిన ఆయనను కాలనీ వాసులు పొన్నాల మహేందర్, రాజు తదితరులు సమస్యలను ఏకరువు పెట్టి ఎప్పుడు పరిష్కరిస్తారని నిలదీసారు. రోడ్డు సమస్యలను కూడా పరిష్కరించకపోతే ఎలా అని ప్రశ్నించారు.

## కబ్జాదారుడిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి: తూంకుంట మున్సిపల్ పరిధిలోని సర్వే నంబర్లు 286, 332లలో తమ వెంచర్ పక్కన కబ్జాలకు పాల్పడుతున్న గూడూరు సత్తిరెడ్డిపై కోర్టు తీర్పు మేరకు చర్యలు తీసుకోవాలని రెడ్డి అసోసియేషన ప్రతినిధులు ప్రజావాణిలో కలెక్టర్‌కు సోమవారం వినతిపత్రం సమర్పించారు.

ఈ ప్రాంతంలో ఏడేళ్ల క్రితం తాము కొనుగోలు చేసిన 133 ప్లాట్స్‌లలో నివసిస్తున్న తమ కాలనీవాసులకు వెంచర్ నిర్వాహకులతో తలెత్తిన వివాదంపై న్యాయస్థానం తమకు అనుకూలంగా తీర్పు వెల్లడించిన క్రమంలో రోడ్డు మూసేసి కబ్జాదారుడిపై చర్యలు తీసుకోవాలని ప్రతినిధులు కోరారు.



## అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు రూ.37లక్షలు

ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి : రామంతాపూర్ భగాయత్ సత్యనగర్ ప్రాంతంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజి పనులకు గాను రూ37 లక్షలు మంజూరయ్యాయని, వాటికి సంబంధించిన ప్రొసీడింగ్ పత్రాలను కాంగ్రెస్ ఉప్పల్ నియోజక వర్గ ఇన్‌చార్జి పరమేశ్వరరెడ్డి కాలనీ ప్రతినిధులకు సోమవారం అందచేసారు.

## ప్రజావాణిలో 96 అర్జీలు

ప్రజాపక్షం/మేడ్చల్‌ప్రతినిధి:కింది స్థాయిలో పరిష్కారం కాకపోవటంతో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణిలో తమ అర్జీలు ఇస్తే మోక్షం లభిస్తుందన్న గంపెడాశతో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి సోమవారం 96 అర్జీలను ధరఖాస్తుదారులు సమర్పించారు. జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి, అదనపు కలెక్టర్ రాధికా గుప్తా, విజయేందర్‌రెడ్డి, డిఆర్‌ఓ హరిప్రియ, ఇతర ప్రభుత్వ జిల్లా స్థాయి కార్యాలయాధి కారులతో కల్సి ప్రజావాణిలో అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ రాధికా గుప్తా అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ సుదూర ప్రాంతాల నుండి వ్యయ ప్రయాసల కోర్చి కలెక్టరేట్‌కు వచ్చే అర్జీలకు సత్వర పరిష్కారాన్ని చూపించి నమ్మకాన్ని పొందాల్సిన బాధ్యత ఉందన్న విషయం విస్మరించవద్దని సూచించారు. ఒక వేళ అర్జీలను పరిష్కరించలేనిపక్షంలో దానికి కారణాలను సైతం ధరఖాస్తుదారులకు తెలియచేస్తూ అన్నింటి వివరాలను ఆన్‌లైన్‌లో వెంటవెంటనే నమోదు చేయాలన్నారు.





### ప్రజావాణిలో కలెక్టర్ కి సిపిఐ ఆధ్వర్యంలో

## భగత్‌సింగ్ నగర్ కాలనీలో మౌలిక వసతుల ఏర్పాటుకు వినతి

### సిపిఐ మేడిపల్లి మండల కార్యదర్శి రచ్చ కిషన్

ప్రజాపక్షం/బోడుప్పల్ : మేడిపల్లి సర్వే నెంబర్ 48 భగత్ సింగ్ నగర్ కాలనీలో మౌలిక వస్తువులు కల్పించాలని కోరుతూ సిపిఐ మేడిపల్లి మండల కార్యదర్శి రచ్చ కిషన్ ఆధ్వర్యంలో మేడ్చల్ జిల్లా కలెక్టర్ కు ప్రజావాణిలో వినతిపత్రం అంద జేశారు. ఈ సందర్భంగా రచ్చ కిషన్ మాట్లాడు తూ, ఫీర్జాది గూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మేడిపల్లి సర్వే నెంబర్ 48లో గత 20 సంవత్సరాల నుంచి సిపిఐ ఆధ్వర్యంలో పేదలు గుడిసె లు వేసుకొని గత 10 సంవత్సరాల నుంచి భగత్ సింగ్ నగర్‌లో నివసిస్తున్నారని తెలిపారు.

కాలనీలో కరెంట్, నీళ్లు, ఇతర మౌలిక వసతులు కల్పించడం జరిగిందన్నారు. భగత్‌సింగ్ నగర్ కాలనీలో నివసిస్తున్న కొంతమంది వ్యక్తులు కుట్రలు, కుతంత్రాలు పన్ని గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్న వారిని ఇబ్బందులకు గురి చేస్తూ కరెంట్ కనెక్షన్లు రద్దు చేయా లని, నీటి సరఫరా నిలిపేయాలని అధికారులను కోరుతున్నారని, అలాంటి వ్యక్తుల మాట లు అధికారులు నమ్మవద్దని కోరడం జరిగిందన్నారు.

భగత్‌సింగ్ నగర్ లో నివసిస్తున్న పేద ప్రజలకు ఎలాంటి అవాంత రాలు జరగ కుండా మౌలిక వసతులు కల్పించాల ని వినతిపత్రం ఇవ్వడం జరిగింద న్నారు. బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రా చెరువు నాలా కబ్జాకు గురి అవుతుందని, ఇందిరమ్మ ఇంటి పథకం కింద మంజూరు అయిన ఇంటిని, నాలాని కబ్జా చేసు కుంటూ నిర్మిస్తున్న ఈ నిర్మాణాన్ని నిలిపి వేయాలని నాలాను కబ్జాదారుల నుంచి రక్షించాలని, జంట కార్పొరేషన్‌లో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని సిపిఐ ఆధ్వర్యం లో వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో మేడిపల్లి మండల కౌన్సిల్ సభ్యులు దండు రమేష్, కె.ప్రమీల, మహాలక్ష్మి, బాపిరాజు, జి.నాగరాజు, భూతం ఐలయ్య, ఇస్తారి, సోమరాజు, మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రైవేట్ వెంచర్ కోసం ప్రభుత్వ భూమిలో రోడ్డు

### కలెక్టర్‌కు ఆకుల సతీష్ ఫిర్యాదు

ప్రజాపక్షం/దుండిగల్ : దుండిగల్ మున్సిపాలిటీ బోరంపేట్‌లో ప్రైవేట్ వెంచర్ కోసం ప్రభుత్వ భూమిలో రోడ్లు వేస్తున్నారని నాయకులు ఆకుల సతీష్ పేర్కొన్నారు. బోరంపేట్ సర్వే నంబర్ 166 ప్రభుత్వ భూమిలో ప్రైవేట్ వెంచర్‌కోసం పై అధికారుల అనుమతిలేకుండా రోడ్లు వేస్తున్నారని, గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ భూమిలో ప్రైవేట్ వెంచర్ కోసం మున్సిపల్ రెవెన్యూ అధికారులు సహకరిస్తున్నారు. రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించి బౌండరీలు ఫిక్స్ చేయగా ప్రజలు లేనిచోట నివాస ప్రాంతం కాకపోయినా రోడ్డు విస్తరణ పనులంటూ అధికారులు కొనసాగిస్తున్నారు. వెంచర్ నిర్మాణదారునితో రెవెన్యూ, మున్సిపల్ అధికారులు చేతులు కలిపినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రైవేట్ వెంచర్ కోసం అధికారులు దగ్గరుండి రోడ్డు విస్తరణ పనులు సాగిస్తుండటంతో అసైన్డ్ భూములు కొల్పోయినా రైతులు ఆందోళనకు దిగారు. టిడిఆర్ ధ్రువపత్రాలు అందజేస్తామని వాటిద్వారా మార్కెట్ రేటు లభిస్తుందని, అధికారులు తెలుపడం కోసం , మెరుపు ప్రైవేట్ వెంచర్ హెచ్‌ఎండిఎ అనుమతుల కోసం ప్రభుత్వ భూమిలో రెండు శాఖలు అధికారులు రోడ్డు నిర్మాణం కోసం సహకరిస్తుండటంతో రెవెన్యూ, మున్సిపల్ అధికారులపై సోమవారం మేడ్చల్ జిల్లా ప్రజావాణిలో ఆకుల సతీష్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.



## 16న పెన్షనర్ల ఆవేదన సభ

ప్రజాపక్షం/మల్కాజిగిరి : రాష్ట్ర ప్రభుత్వం అర్హులకు పెన్షన్లను మంజూరు చేయటంలో నిర్లక్ష్యం వహిస్తుండటాన్ని నిరసిస్తూ ఈ నెల 16న నేరేడ్‌మెట్ లోని మూడుగుళ్ల ఎస్‌ఎస్ గార్డెన్స్ ఫంక్షన్ హాలులో పెన్షనర్ల ఆవేదన సభను నిర్వహిస్తున్నామని జిల్లా వికలాంగుల హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు ఎన్ వినయ్ తెలిపారు. ఈ సభకు మంద కృష్ణ మాదిగ ముఖ్య అతిథిగా పాల్గొననున్నారని చెప్పారు. వికాలంగులు, ఒంటరి మహిళలు, వృద్ధులు, వితంతువులు పెన్షన్ల కోసం ఎదురు చూస్తున్నారని, ఐదేళ్ల నుండి ధరఖాస్తులను పరిశీలించి లబ్దిదారులను గుర్తించటంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మనోహర్ మాదిగ, అంజయ్య, యాదగిరి, జయహరి, రాము, కేశవ్, చంద్రశేఖర్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాం..

### రోడ్డెక్కిన గురుకుల పాఠశాల విద్యార్థులు



ప్రజాపక్షం/శామీర్‌పేట : గురుకుల పాఠశాలలో కనీస మౌళిక వసతులు లేక తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నామని వసతులు కల్పించడంలో ప్రిన్సిపల్ నిర్లక్ష్యం వహిస్తుందని మహాత్మా జ్యోతిరావు పూలే కూకట్‌పల్లి బ్రాంచ్‌కు చెందిన గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థులు రోడ్డెక్కారు. సోమవారం గురుకుల పాఠశాల విద్యార్థులు పాఠశాల నుంచి బయటకు వచ్చి ప్రిన్సిపల్ డౌన్ డౌన్ అంటూ ప్రిన్సిపల్‌ను వెంటనే మార్చాలని నినాదాలు చేస్తూ తుర్కపల్లి చౌరస్తాలో బైఠాయించారు. అనంతరం హాస్టల్ గేట్ ముందు బైటాయించి దర్నా చేశారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు మాట్లాడుతూ విద్యార్థులు స్నానం చేయడానికి సరిపడా బాత్‌రూమ్‌లు లేవని అన్నారు. నాణ్యమైన బోజనం పెట్టడం లేదని నీటి సమస్య తీవ్రంగా ఉందని చెప్పారు. పారిశుద్య నిర్వాహణ సరిగా లేకపోవడంతో పాఠశాల ప్రాంగణం అపరిశుభ్రంగా మారిందని ఆవేదన చెందారు. ఇట్టి విషయాలను ఉపాద్యాయులకు పిర్యాదు చేస్తే దురుసుగా మాట్లాడుతున్నారని ఆరోపించారు. 500 మంది విద్యార్థులకు రెండు బాత్‌రూమ్‌లు సరిపోవడం లేదన్నారు. ప్రభుత్వం స్పందించి కనీస వసతులు కల్పించాలని విద్యార్థులు కోరారు.

## తీన్మార్ మల్లన్నపై దాడి హేయమైన చర్య

### కొడంగల్‌లో నిరసన చేపట్టిన మున్నూర్ కాపులు

ప్రజాపక్షం/కొడంగల్: తీన్మార్ మల్లన్నపై దాడి హేయమైన చర్య అని కొడంగల్ మున్నూర్ కాపు సంఘం తాలుక అధ్యక్షుడు బాకారం చంద్రశేఖర్ అన్నారు. సోమవారం పట్టణంలో జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట కవిత చేసిన దాడికి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విలేకరుల తో మాట్లాడుతు మున్నూర్ కాపు సంఘంలో కీలక సభ్యుడుగా ఉంటు ఒక శాసన మండలి సభ్యుడు బిసి నినాదంతో ప్రతి ఒక్కరికి మేల్కొలుపుతున్న తీన్మార్ మల్లన్నపై హత్యయత్నానికి పాల్పడిన దుండగులను ప్రభు త్వం కఠినంగా శిక్షించాలని అన్నా రు. క్యూ న్యూస్ ఛానెల్ కార్యాలయంపై దాడికి పాల్పడటమే కాకుం డా ఫర్నిచర్‌లు ధ్వంసం చేయడం అక్కడ ఉన్న వారిని తీవ్రంగా గాయపర్చడం, గన్‌మెన్ దగ్గర గన్ లాక్కుని మల్లన్నపై దాడికి పాల్పడే యత్నం చేయడం హేయమైన చర్యగా భావించారు. ప్రజలను జాగృతి చేయడం చైతన్య పర్చడం ఏ మాత్రం ఇష్టంలేని జాగృతి మహిళ అధ్యక్షురాలు ఈ దాడికి పాల్పడటం సిగ్గుచేటుగా ఉందని ఆరోపించారు. ఇలాంటి ఘటనలు మరోమారు పునరావృత్తం కాకుండా గట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం తాలుక ప్రధాన కార్యదర్శి బాకారం మల్లయ్య, అర్గె అనంత ప్రసాద్, కానుకుర్తి రమేష్, ఓం ప్రకాశ్, బోంకూర్ నరేష్‌కుమార్ పటేల్, మండల గౌరవ అధ్యక్షుడు బాకారం శేఖర్, అధ్యక్షుడు కానుకుర్తి హన్మంత్‌రెడ్డి, ఉడిమేశ్వరం శ్రీనివాస్‌రెడ్డి లు పాల్గొన్నారు.

# క్రీడ

## నితీశ్ రెడ్డి ఔట్..

## లార్డ్స్‌లో ఇంగ్లాండ్ పైచేయి




లార్డ్స్ టెస్టులో ఇంగ్లాండ్ పైచేయి సాధించింది. గెలుపు దిశగా వెళ్తోంది. మరో రెండు వికెట్లు తీస్తే ఆ జట్టు తన ఖాతాలో అద్భుత విజయాన్ని వేసుకుంటుంది. మూడవ టెస్టులో సోమవారం అయిదో రోజు టీమిండియా పీకల్లోతు కష్టాల్లో పడింది. ఉదయం 58 పరుగుల వద్ద ఇన్నింగ్స్ ఆరంభించిన టీమిండియా వరుసగా కీలక వికెట్లను కోల్పోయింది. దీంతో భోజన విరామ సమయానికి 8 వికెట్ల నష్టానికి 112 రన్స్ చేసింది. లార్డ్స్ మైదానంలో ఇంగ్లాండ్ బౌలర్లు రఫాడించారు. ఆఖరి రోజు పిచ్‌ను అనుకూలంగా వాడుకున్నారు. తొలుత జోఫ్రా ఆర్చర్, బెన్ స్టోక్స్ కట్టుదిట్టమైన బౌలింగ్ చేశారు. లైన్ అండ్ లెన్త్‌తో భారత బ్యాటర్లను ఇబ్బందిపెట్టారు. పంత్‌ను క్లీన్ బౌల్డ్ చేశాడు ఆర్చర్. ఆఫ్ స్టిక్‌పై పడిన బంతిని ఆఫ్ వికెట్‌ను ఎత్తిపడేసింది. ఆ తర్వాత సందర్ ను కూడా స్టన్నింగ్ రీతిలో ఔట్ చేశాడు ఆర్చర్. అద్భుతమైన రీతిలో తన బౌలింగ్‌లోనే క్యాచ్ పట్టేశాడు. కేఎల్ రాహుల్ వికెట్‌ను స్టోక్స్ తీసుకున్నాడు. నిలకడగా ఆడుతున్న కనిపించిన రాహుల్.. ఇన్‌స్వింగర్‌కు ఎల్బీ డబ్ల్యూ అయ్యాడు. విక్టరీ కోసం ఇండియాకు కావాల్సింది 81 రన్స్ మాత్రమే. కానీ, ఆ టార్గెట్ అసాధ్యంగా కనిపిస్తోంది. ప్రస్తుతం క్రీజ్‌లో జడేజా ఉన్నాడు. ఇక మిగిలింది బ్యాటర్లు బుమ్రా, సిరాజ్. నిప్పులు చెరుగుతున్న ఇంగ్లాండ్ బౌలర్లను.. టాయిలెండర్లు ఎలా ఎదుర్కుంటారో చూడాల్సిందే. ప్రధాన బ్యాటర్ జడేజా ఒక్కడే కావడంతో.. దాదాపు భారత్ ఆశలు గల్లంతు అయినట్లే. నితీశ్ రెడ్డి, జడేజా భాగస్వామ్యం.. కొంత వరకు ఇంగ్లాండ్‌ను ఇబ్బంది పెట్టినట్లు అనిపించినా.. సరిగ్గా లంచ్‌కు ముందు రెడ్డి ఔటయ్యాడు.

ఇండియా తన రెండో ఇన్నింగ్స్‌లో 39.3 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 112 రన్స్ చేసింది. రాహుల్ 39, పంత్ 9, సుందర్ 0, నితీశ్ 13 రన్స్ చేసి ఔటయ్యారు. ఇంగ్లాండ్ బౌలర్లలో ఆర్చర్ మూడు, స్టోక్స్.. కార్సేలు రెండేసి వికెట్లు తీసుకున్నారు. కీలకమైన అయిదో రోజు ఇండియన్ బ్యాటర్లు రాణించలేకపోయారు. కష్టమైన పిచ్‌పై బ్యాటర్లు రన్స్ స్కోర్ చేసేందుకు ఇబ్బందిపడ్డారు. తీవ్ర వత్తిడిలోకి వెళ్లిన బ్యాటర్లు.. ఆ టెన్షన్ తట్టుకోలేకపోయినట్లు తెలుస్తోంది. భారత బ్యాటర్లను స్టోక్స్ సేన వత్తిడిలోకి నెట్టి గెలుపు వాకిట నిలిచింది.

## సిరాజ్ మ్యాచ్ ఫీజులో.. 15 శాతం జరిమానా



లార్డ్స్ టెస్టులో దూకుడుగా వ్యవహరించిన భారత పేసర్ మహ్మద్ సిరాజ్‌పై ఐసిసి చర్యలు తీసుకుంది. మ్యాచు ఫీజులో 15 శాతం జరిమానా విధిస్తూ నిర్ణయం తీసుకుంది. అతడి ఖాతాలో ఓ డీ మెరిట్ పాయింట్‌ను చేర్చింది. ఐసిసి కోడ్ ఆఫ్ కండక్ట్ ఆర్టికల్ 2.5 ప్రకారం 'అభ్యంతరకరంగా ప్రవర్తించడం, భాషను వినియోగించడం, బ్యాటర్ ఔటై వెళ్తున్నప్పుడు దూకుడుగా వ్యవహరించడం అపరాధం' అని ఐసిసి పేర్కొంది. బెన్ డకెట్ ఔటైన క్రమంలో సిరాజ్ దూకుడుగా వ్యవహరించాడు. దీంతో అతడికి జరిమానాతోపాటు డీమెరిట్ పాయింట్‌ను విధించింది. గత 24 నెలల వ్యవధిలో సిరాజ్ చేసిన రెండో తప్పిదమిది. దీంతో ప్రస్తుతం అతడి ఖాతాలో రెండు డీ మెరిట్ పాయింట్లు ఉన్నాయి. రెండు సంవత్సరాల్లో ఆటగాడి ఖాతాలో 4 అంతకంటే ఎక్కువ డీ మెరిట్ పాయింట్లు ఉంటే అవి సస్పెన్షన్ పాయింట్లుగా మారతాయి. మ్యాచ్ నిషేధం ఎదుర్కొనే ప్రమాదం ఉంది.

### అంపైరింగ్‌పై 'కుంబ్లే ఫైర్'

మహ్మద్ సిరాజ్ బౌలింగ్‌లో ఇంగ్లాండ్ బ్యాటర్లు తీవ్రంగా ఇబ్బందిపడ్డారు. అయితే జో రూట్‌కు కాస్త అదృష్టమే కలిసొచ్చింది. సిరాజ్ వేసిన అద్భుతమైన బంతిని ఆడలేకపోవడంతో రూట్ ప్యాడ్లకు తాకింది. సిరాజ్ అప్పీలు చేసినా ఫీల్డ్ అంపైర్ రీఫెల్ మాత్రం నాటౌట్ ఇచ్చాడు. డీఆర్ఎస్ తీసుకున్నా.. అక్కడ అంపైర్స్ కాల్ రావడంతో భారత శిబిరం తీవ్ర నిరాశకు గురైంది. ఈ సిరీస్‌లో అంపైరింగ్‌పై ఇప్పటికే పలు విమర్శలు రాగా.. తాజాగా కుంబ్లే కూడా అంపైర్ రీఫెల్‌పై అసహనం వ్యక్తంచేశాడు. 'ఆ బంతిని చూస్తే స్టంప్‌ను మిస్ అవుతున్నట్లు అనిపించనేలేదు. చాలా దగ్గరగా ఉంది. అయినా అంపైర్ నాటౌట్ ఇచ్చాడు.' అని వ్యాఖ్యానించాడు.

## ఎస్ఆర్‌హెచ్ బౌలింగ్ కోచ్‌గా వరుణ్ ఆరన్




సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుకు బౌలింగ్ కోచ్‌గా వరుణ్ ఆరన్ నియమితుయ్యాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో అతను ఆ బాధ్యతలు స్వీకరించనున్నాడు. ఇప్పటి వరకు ఎస్ఆర్‌హెచ్ జట్టుకు జేమ్స్ ఫ్రాంక్లిన్ బౌలింగ్ కోచ్‌గా ఉన్నాడు. కోచింగ్ స్టాఫ్‌లో కొత్త సభ్యుడు వచ్చాడని, వెల్కమ్ ఆరన్ అని ఎస్ఆర్‌హెచ్ జట్టు తన ఎక్స్ అకౌంట్‌లో పోస్టు చేసింది. ఇండియా తరపున 2011 నుంచి 2015 వరకు ఆరన్ 9 టెస్టులు ఆడాడు. స్వదేశీ క్రికెట్‌లో అతను జార్ఖండ్‌కు ఆడేవాడు. ఇటీవలే అతను డొమెస్టిక్ కెరీర్‌కు గుడ్‌బై చెప్పాడు. ఓ దశలో 150 కిలోమీటర్ల వేగంతో బంతులు వేసే ఆరన్.. చాలా త్వరగా టెస్టు కెరీర్‌ను ముగించాడు. తరుచూ గాయాలు కావడంతో అతను ఎక్కువగా జాతీయ జట్టుకు ఆడలేకపోయాడు.

# యువతరంగం

ఫోకస్

## అతని జీవితం.. నేటి యువతకు ఓ పాఠం

డబ్బు జీవితంలో అత్యవసరం.. ఎవరూ కాదనరు. కానీ, డబ్బు మాత్రమే ప్రధానం కాదు.. కుటుంబ, సామాజిక సంబంధాల నుంచి మానసిక, శారీరక ఆరోగ్యం వరకూ ఇంకా ఎన్నో అంశాలు సమ్మిళితమై ఉంటాయి. డబ్బు సంపాదనలోపడి, జీవితంలో సర్వస్వం కోల్పోయిన, బెంగళూరుకు చెందిన ఒక టెకీ జీవితం నేటి యువతకు ఓ పాఠం అవుతుంది. Redditలో అతను తన జీవితాన్ని ఆవిష్కరించాడు. ఆ కథనాన్ని అనుసరించి, సదరు టెకీ జీవితం సంవత్సరానికి రూ.2.5 కోట్లు. అయితే, ఉద్యోగంలో సాధించే జీతాలే కాదు.. జీవితంలోని ఆర్థిక చైతన్యం, బాధలు, మార్పులు, ఆత్మవిమర్శలతో కూడిన పాఠాల సారాంశంగా అతని జీవితం కొనసాగింది.




అతను దాదాపు 20 ఏళ్ల క్రితం ఐదు లక్షల రూపాయలత వార్షిక వేతనంతో తన ఉద్యోగ కెరీర్‌ను ప్రారంభించాడు. ఇప్పుడు రూ.2.5 కోట్లు వేతనాన్ని ఏడాదికి సంపాదిస్తున్నాడు. అయితే ఈ ఎదుగుదలలో తాను ఏం కోల్పోయానన్నది అతను వివరించాడు. అతను ఎదుగుతున్న క్రమంలో, బాధలు, కుటుంబ విభేదాలు, ఆరోగ్య సమస్యలు, రుణ భారం వంటి ఎన్నో సమస్యలు చుట్టుముట్టాయి. తండ్రి తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. హృదయ శస్త్రచికిత్స చేయాల్సి వచ్చింది. రూ.20 రోజుల పాటు ఆస్పత్రి ఐసియులో ఉన్నాడు. ఈ సమయంలో 50 రోజుల ఐసియు బిల్లులు ఆ టెకీని పూర్తిగా అప్పుల్లోకి నెట్టేశాయి. ఆరోగ్య బీమా లేకపోవడంతో డబ్బు మొత్తం మంచినీళ్లలా ఖర్చయిపోయింది. తండ్రి బాగు కోసం అక్కతో కలిసి రూ. 5 లక్షలు పర్సనల్ తీసుకున్నాడు. వాళ్ల అక్క కూడా రూ.5 లక్షలు పర్సనల్ లోన్ తీసుకుంది. ఇక తండ్రి మరణం తర్వాత అతని ఆర్థిక పరిస్థితి చాలా దిగజారింది. ఈ సమయంలో తరతరాల నుంచి వస్తున్న కుటుంబ ఆస్తిని కూడా అమ్ముకోవాల్సి వచ్చింది. తండ్రి మరణంతో ఒంటరైన తల్లిని చూసుకోవడానికి సింగపూర్‌లో పని చేయాలన్న తన కలను కూడా వదులుకున్నాడు. ఇక్కడే కష్టపడి పనిచేసి 2018 నాటికి రూ.50 లక్షల జీతానికి చేరుకున్నాడు. అప్పులేకుండా రెండవ ఇల్లు, స్థిరమైన ఆదాయాన్ని పొందగలిగాడు. కానీ, ఈ వృద్ధిలోని ప్రధాన పాఠం ఏంటంటే.. ఆదాయానికి మించి, ఆర్థిక జ్ఞానం అవసరం ముఖ్యం అని తెలుసుకున్నాడు. తన 30వ దశకంలో తీవ్ర బిపితో ఆసుపత్రిలో చేరిన తర్వాత.. డబ్బు మాయలో పడి ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయడం ఎంత పెద్ద తప్పో అతను గ్రహించాడు. కుటుంబ బాధ్యతలు, ఉద్యోగ ఒత్తిడి వల్ల ఆరోగ్యం పాడయిపోయింది. ఇది జీవితంలో పెను మార్పులకు ప్రధాన కారణమైంది. ప్రారంభంలో ఇన్వెస్ట్‌మెంట్స్ అన్నీ స్వయంగా నిర్వహించేవారు. అయితే తక్కువ రాబడులు రావడంతో సెబీ రిజిస్టర్ అయిన ఫీజు ఆధారిత ఫైనాన్షియల్ ప్లానర్ సహాయం తీసుకున్నాడు. ప్రస్తుతం అతని ఆదాయం సంవత్సరానికి రూ.2.5 కోట్లు. ఇక అతని రియాల్టీ ఆస్తులు విలువ రూ.4.5 కోట్లు. లిక్విడ్ ఆసెట్లు రూ.10 కోట్లు వరకూ ఉన్నాయి. అప్పులేమి లేవు. ఇది మెరుగైన జీవితానికి కొలమానాలే. అయితే, ఆదాయం ఒక్కటే ఏకైక లక్ష్యం కాదని, సంపదకి మూలం ఆర్థిక ప్రణాళిక.. డబ్బుతో పాటు ఆరోగ్యాన్ని కాపాడుకోకుంటే ఎంత సంపాదించినా వ్యర్థమని ఆ టెకీ Redditలో రాసిన తన కథలో స్పష్టం చేశాడు. ముందు చూపు, సరైన వ్యూహం, దాని అమలు వంటి పలు అంశాలు కీలకమని అంటున్నాడు. ఆర్థికంగా తీవ్రంగా నష్టపోయిన తాను తిరిగి కోలుకున్నానని, కానీ, చాలా మందికి అలాంటి అవకాశం లేక పోవచ్చని వ్యాఖ్యానించాడు. ప్లానింగ్ అనేది అత్యవసరమని అంటున్న అతని మాటలు అక్షర సత్యాలు. నేటి యువతకు మార్గదర్శకం చేసే విలువైన పాఠాలు.

## బెదిరింపులపై జెలెన్ యుద్ధం

శారీరక లేక మానసిక రుగ్మతలు, వైకల్యాలతో బాధపడుతున్న వారిని హేళన చేయడం, వివిధ రకాలుగా బెదిరించడం తరచు చూస్తునే ఉంటాం. ఈ సామాజిక రుగ్మతకు వ్యతిరేకంగా యుద్ధ ప్రకటించిన జైలెన్ ఆర్నాల్డ్ నిజమైన యూత్ ఐకాన్‌గా నిలుస్తాడు. అతను స్వయంగా జన్యుపరమైన లోపాలు (టూరెట్స్ సిండ్రోమ్) సమస్యను ఎదుర్కొంటున్నాడు. ఈ కారణంగానే ఎనిమిదేళ్ల వయసులో తోటి వారి నుంచి హేళనకు, బెదిరింపులకు గురయ్యాడు. అంతేగాక అతనికి నలుగురిలోకి వెళ్లడానికి, వారితో మాట్లాడడానికి భయం. 'అస్పెర్గర్స్' రుగ్మత కారణంగా మరింతగా అవమానాలను ఎదుర్కొన్నాడు. ఈ సమస్యలకు ఒసిడి (అబ్సెస్సివ్ కంపల్సివ్ డిసార్డర్) కూడా జత కలిసింది. చిన్న వయసులోనే ఈ మూడు తీవ్రమైన రుగ్మతల వల్ల అతనికి అవమానాలు, బెదిరింపులు తప్పలేదు. ఇలాంటి పరిస్థితుల్లో చాలా మంది ఇళ్లకే పరిమితమవుతారు. కానీ, తనకే కాదు... తనలాంటి వారికి ఎదురవుతున్న బెదిరింపులపై యుద్ధానికి దిగాడు. బెదిరింపుల ఫలితంగా తనలో ఆందోళన, వైకల్యాల లక్షణాలు మరింత పెరిగుతున్నాయని గమనించి, ఈ విధమైన సమస్య మరెవరికీ ఎదురుకాకూడదన్న లక్ష్యంతో, పదేళ్ల వయసులోనే 'జైలెన్ ఛాలెంజ్ ఫౌండేషన్' నెలకొల్పాడు. బెదిరింపులకు గురవుతున్న ఎంతో మందిలో ఆత్మవిశ్వాసం నింపాడు. లక్షలాది మందికి అవగాహన కల్పిస్తున్నాడు. తాను ఎదుర్కొంటున్న సమస్యలను, తన అనుభవాలను వివరిస్తూ, వాటి నుంచి ఏ విధంగా బయటపడుతున్నానన్నది వివరిస్తున్నాడు. వర్క్‌షాప్‌లు నిర్వహించి ఇప్పటికే కనీసం మూడు లక్షల మంది వరకూ బెదిరింపుల సమస్య ఎదుర్కొంటున్న వారిలో ధైర్యం నింపాడు. తన ఫౌండేషన్ ద్వారా ప్రతి విద్యార్థికీ బెదిరింపుల వ్యతిరేక హ్యాండ్‌బుక్‌ను పంచడంతోపాటు, బెదిరింపులు, హేళనను ఎలా ఎదుర్కోవాలో వివరించే శిక్షణ ఇప్పిస్తున్నాడు. సోషల్ మీడియా ద్వారా మానసిక సమస్యలతో బాధపడుతున్న వారి సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాడు. సమస్యలు ఎదురైనప్పటికీ కుంగిపోకుండా, తాను బయటపడడమేగాక, తన లాంటి లక్షలాది మందికి అండగా నిలుస్తున్న జైలెన్ ఆత్మవిశ్వాసం అభినందనీయం.





**యూత్ ఐకాన్స్**

ఎంతో మంది యువతీయువకులు దేశ కీర్తిప్రతిష్ఠలను ఇనుమడింపచేశారు. చిన్న వయసులోనే అత్యున్నత శిఖరాలను అధిరోహించారు. యువతకు మార్గదర్శకులుగా నిలిచారు. అలాంటి అద్వితీయ ప్రతిభావంతుల గురించి క్లుప్తంగా తెలుసుకుందాం..

---

## భవిష్యత్తు ప్రజా ఉద్యమాలకు మహాసభలు దోహదం

### సిపిఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు




**ప్రజాపక్షం/ ఖమ్మం:** ప్రజా సమస్యల పరిష్కారమే ఎజెండాగా కార్యాచరణ రూపొందించుకుని అమలు చేయాలని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు కోరారు. స్థానిక సమస్యలను తెలుసుకోవడంతో పాటు వాటి పరిష్కారానికి పోరాటాలు తప్పవని అం దుకుఅనుగుణంగాకార్యక్రమాలు తీసుకోవాలని ఆయన సూచించారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సమావేశం సోమవారం తోట రామాంజనేయులు అధ్యక్షతన స్థానిక గిరిప్రసాద్‌భవన్‌లోజరిగింది.ముఖ్యఅతిథిగాబాగం హేమంతరావు మాట్లాడుతూ పాలకులు ప్రజలను విస్మరించి పాలన సాగిస్తున్నారన్నారు. ప్రజా సమస్యలే ఎజెండా ప్రభుత్వ కార్యాచరణ రూపొందించడం లేదని ఆయన అన్నారు. కేంద్రంలోని బిజెపి కార్పొరేట్ల మేలు కోరుతూ మాత్రమే పాలన సాగిస్తుందని, రైతులు, కార్మికులు, దిగువ మధ్యతరగతి పేదలకు సంబంధించి ఏ సానుకూల నిర్ణయం కేంద్ర ప్రభుత్వం నుంచి రాలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాల పాట పాడుతున్నా వాస్తవ లబ్ధిదారులను సంతృప్తి పర్చలేకపోతుందని హేమంతరావు తెలిపారు. కాంగ్రెస్ ఎన్నికల ప్రణాళికలో పేర్కొన్నట్లుగా ఆరు హామీలను అమలు చేసేందుకు సిద్ధం కావాలని ఆయనకోరారు. భారత కమ్యూనిస్టు పార్టీ ప్రజా ఉద్యమ నేపథ్యంలోనే 100 ఏళ్లు పూర్తి చేసుకుంటుందని ఈ సందర్భంగా ఖమ్మంలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నామన్నారు. మహాసభల సంవత్సరం సందర్భంగా గ్రామస్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు మహాసభలు జరుగుతున్నాయని ఈ క్రమంలో ఈనెల 19, 20 తేదీల్లో మధిరలో ఖమ్మంజిల్లా 23వ మహాసభలు జరగనున్నాయన్నారు. జిల్లాలో ఉన్న వనరుల వినియోగం, ప్రజా సమస్యలు, పార్టీ కార్యాచరణ తదితర అంశాలపై చర్చించి తీర్మానాలు చేయాలని అందుకు అనుగుణంగా పోరాటాలు నిర్వహించాలని హేమంతరావు తెలిపారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ మాట్లాడుతూ 600 మంది ప్రతినిధులు జిల్లా మహాసభకు హాజరుకానున్నారని ఆయన తెలిపారు. మహాసభకు ముఖ్య అతిథులుగా రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు హాజరవుతారని తెలిపారు. సిపిఐ సీనియర్ నాయకులు పువ్వాడ నాగేశ్వరరావు, ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం, జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మహ్మద్ మౌలానా తదితరులు పాల్గొంటారని సురేష్ తెలిపారు. కార్యవర్గ సమావేశంలో మహ్మద్ మౌలానా, జమ్ముల జితేందర్‌రెడ్డి, యర్రాబాబు, ఎస్‌కె జానిమియా, ఏపూరి లతాదేవి పాల్గొన్నారు.

## కల్తీ కల్లు దుకాణాలు సీజ్ చేయాలి

**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి :** నగరంలోని కల్తీ కల్లు అమ్ముతున్న దుకాణాలను సీజ్ చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ అన్నారు. సోమవారం జిల్లా ప్రోహిబిషనరీ ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో సూపరింటెండెంట్ అందుబాటులో లేకపోవటంతో ఇన్‌వార్డులో వినతిపత్రం సమర్పించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ మాట్లాడుతూ జిల్లాలో కల్తీ కల్లు ఏరులై పారుతున్న పట్టించుకోవడం లేదన్నారు. కూకట్‌పల్లి, నస్రుల్లాబాద్ సంఘటనలు జరిగినప్పుడు మాత్రమే హడావుడి చేస్తున్నారన్నారు. నగరంలోని మూడవ కల్లు డిపో పరిధిలోని కల్లు దుకాణాల్లో రవాణా చేసే కల్లులో ఎక్కడ నుండి చెట్ల కల్లు తీసుకవచ్చి తయారుచేస్తున్నారో తెలుపాలని ఇప్పటికైనా కల్తీ కల్లు తయారుచేస్తున్న దుకాణాలను అనుమతులు లేని దుకాణాలను సీజ్ చేయాలని ఎక్సైజ్ అధికారులను డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి ఓమయ్య, జిల్లా నాయకులు రంజిత్, రాధాకుమార్ పాల్గొన్నారు.

## మానవాళి మనుగడకు కమ్యూనిజమే ఏకైక మార్గం

### సిపిఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి



**ప్రజాపక్షం/జోగులాంబ గద్వాల ప్రతినిధిః** మానవాళి మనుగడకు కమ్యూనిజమే ఏకైక మార్గమని, అందుకు కమ్యూనిజానికి మించిన సిద్ధాంతం లేదని, ప్రజలకోసం నిరంతరం పోరాటాలు చేస్తున్న పార్టీ సిపిఐ మాత్రమేనని, ప్రజల మేలు కోసం ఈ జిల్లాలో పార్టీ తరుపున పోరాడాలని సిపిఐ జాతీయ మాజీ ప్రధానకార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం ఉండవెల్లి మండలం కాంచుపాడులో సిపిఐ ముఖ్య కార్యకర్తల సమావేశంలో సురవరం సుధాకర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా దిశా నిర్దేశం చేశారు. కమ్యూనిస్టులు లేకపోతే సమాజంలో జరిగే అన్యాయాలను ప్రశ్నించి పోరాడే వాళ్లుండరని తెలిపారు. సిపిఐలో పనిచేసేవారికి ఓపిక సహనం త్యాగం నిబద్ధత విలువలు కలిగి ఉండాలని స్పష్టం చేశారు. నేడు దేశంలో బ్రిటిషోళ్లకు సాగిల పడి దండం పెట్టి క్షమాభిక్ష కావాలని భారతీయ ఉద్యమకారులకు ద్రోహం చేసిన పాలకులు మనకు నేడు దేశభక్తి గురించి చెప్పడమంటే దెయ్యాలు వేదాలను వల్లించిన చందమేనన్నారు. ఈ దేశంలో 80శాతం హిందువులకు బిజెపీ పాలకులు ఏమి చేశారో చెప్పాలని ప్రశ్నించారు. ఏమి చేయకుండా హిందువుల ఓట్లు అడగటానికి బిజెపికి హక్కులేదు అన్నారు. కేవలం ఓట్లకోసం హిందువులను ఇతర మతల పైన రెచ్చగొట్టడం ఇదొక అవకాశవాదమని దు య్యబట్టారు. కార్మికుల హక్కులు హరి స్తూ సామాన్య ప్రజలపై విపరీత ధరలు పెంచి పన్నులు దండుకోవడం తప్ప బిజెపీ దేశానికి చేసిందేమీ లేదని, ప్రజలు కూడా గమనిస్తున్నారని వివరించారు. సిపిఐ దేశం లో పుట్టి 100సంవత్సరాలు అయిన సందర్భంగా పార్టీ చేసిన పో రాడిన చరిత్రను త్యాగాలను ప్రజలకు వివరించిఉత్సవాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. అనం తరం నూతనంగానిన్న మహాసభలలో ఎన్నికైన సిపిఐ మండల నాయకులతో పాటు జిల్లా నాయకులను సత్కరించారు. అలాగే సురవరం సుధాకర్‌రెడ్డిని జిల్లా ముఖ్య నాయకులందరూ కలిసి ఆయనకు సత్కారం చేశారు.

### ఉండవెల్లి మండల సిపిఐ కమిటీ ఎన్నిక

మండల కార్యదర్శి ఏ నాగార్జున్ సహాయకార్యదర్శులుగా బి రవి, వి రామకృష్ణాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరితో పాటు 15 మంది కౌన్సిల్ సభ్యులను ఎన్నుకున్నారు. అలగే అన్ని ప్రజా సంఘాలకు మండల కన్వీనర్లను ఎన్నిక చేయడం జరిగిందని మండల కార్యదర్శి ఏ నాగార్జున్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జాతీయ నాయకురాలు విజయలక్ష్మి, సురవరం కపిల్, జిల్లా కార్యదర్శి బి ఆంజనేయులు, తాలుకా ఇన్చార్జీ పెద్దబాబు, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి రంగన్న, వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు ఆశన్నా, ఇటిక్యాల, ఎర్రవల్లి మండలాల కార్యదర్శులు శివ, అశన్నా, మనోపాడు కార్యదర్శి వెంకట్రాముడు ఎఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి బి ప్రవీణ్ కుమార్, గద్వాల అలంపూర్, మల్దకల్, ఉండవల్లి మండలాల నాయకులు పాల్గొన్నారు.

## సీతారామ ప్రాజెక్టులో భద్రాద్రి జిల్లాకు అన్యాయం

### సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్‌పాషా





**ప్రజాపక్షం/ఇల్లందు :** సీతారామ ప్రాజెక్టులో భద్రాది కొత్తగూడెం జిల్లాకు అన్యాయం జరిగిందని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సిపిఐ కార్యదర్శి ఎస్. కె. సాబీర్ పాషా అన్నారు. సోమవారం 21 ఏరియాలోని కొవ్వూరి రాయలింగు సభా ప్రాంగణంలో జరిగిన 19వ సిపిఐ మండల మహాసభలో ఎస్. కె. సాబీర్ పాషా మాట్లాడారు. సీతారామ ప్రాజెక్టురీడిజైన్ ద్వారా ఇల్లందు, డోర్నకల్ మహబూబాబాద్, పినపాక నియోజకవర్గాలకు అన్యాయం జరిగిందన్నారు. ఆధునిక భారత నిర్మాణంలో సిపిఐ పాత్ర ఎంతో ఉందన్నారు. డిసెంబర్ 26న సిపిఐ 100 సంవత్సరాలు పూర్తి చేసుకుంటుందన్నారు. 21 ఏరియాకి సిపిఐ కి కంచుకోట లాంటిదని, ఎంతోమంది సిపిఐ నాయకులు 21 ఏరియా తయారుచేసిందన్నారు. అఖిలపక్ష నాయకులు జులై 9న జరిగిన దేశవ్యాప్త సమ్మెలో 25 కోట్లకు పైగా సంఘటిత, అసంఘటిత కార్మికులు రోడ్ల పైకి రావడంతో బిజెపి ప్రభుత్వం భయాందోళనకు గురైందన్నారు. సమ్మెలో పాల్గొన్న ప్రతి ఒక్క కార్మికునికి ధన్యవాదాలు తెలిపారు. బిజెపి ప్రభుత్వంలో ప్రజలు వాడే నిత్యవసర సరుకుల ధరలు, గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు బాగా పెరిగాయి అన్నారు. దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలను అదాని, అంబానీలకు కట్టబెట్టి ప్రైవేటుపరం చేయడానికి బిజెపి ప్రభుత్వం చూస్తుందన్నారు. దేశంలో 37% ఓట్లతో గెలిచిన బిజెపి ప్రభుత్వం, కార్మిక సంఘాలకు 51%మద్దతు ఉంటేనే కొనసాగుతాయని చెప్పడం విడ్డూరంగాఉందన్నారు.ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులు, ఆదివాసి ప్రజలు రెండు వేల మందికిపైగాబిజెపి దహనకాండకు మృతి చెందారన్నారు. 2026 మార్చి లోపు మావోయిస్టులను అంతం చేయడం కాదు, 2026 లోపు దేశంలో విద్య, వైద్యం, రైతుల గిట్టుబాటు ధర అందించాలన్నారు. మణుగూరు ఏరియాలో ఓసి నిర్వాసితులకు ప్యాకేజీ ఇచ్చిన విధంగానే పూసపల్లి ఓసిలో నిర్వాసిత ప్రాంతాలైన 21 ఏరియా, పూసపెల్లి,తిలక్‌నగర్,విజయలక్ష్మి నగర్, 24 ఏరియా వాసులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ వర్తింపచేయాలని, 2019 సింగరేణి చట్టం అమలు చేయాలని కోరారు. లేదంటే అఖిలపక్షం ఆధ్వర్యంలో సింగరేణి నిర్వాసిత ప్రాంత ప్రజలకు న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తామన్నారు. ఇల్లందును రెవెన్యూ డివిజన్ గా, బోడు, కొమరారం మండలాలను ఏర్పాటు చేయాలన్నారు. సిపిఐ అధికార పార్టీతో కలిసి ఉన్న ప్రజలు ఎదుర్కొనే ప్రజా సమస్యలపై నిత్యం పోరాటం చేస్తామన్నారు. సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు మిర్యాల రంగయ్య,సిపిఐరాష్ట్రసమితిసభ్యులుకే సారయ్య, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు దేవరకొండ శంకర్, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి నజీర్ అహ్మద్, సిపిఐ పట్టణ కార్యదర్శి బాస శ్రీనివాస్, సిపిఐ జిల్లా సమితి సభ్యులు బంధం నాగయ్య, ఇల్లందు పట్టణ మహిళ కార్యదర్శి కమటం చంద్రకళ, ఇల్లందు మండల మహిళా కార్యదర్శి తడికల శ్రీలక్ష్మి, ఉడుత ఐలయ్య, వడ్ల శీను, సుందర్, మంచాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

### సిపిఐ మండల కార్యదర్శిగా బొప్పిశెట్టి సత్యనారాయణ

సిపిఐ ఇల్లందు మండల కార్యదర్శిగా బొప్పిశెట్టి సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం 21 ఏరియాలోని కొవ్వూరి రాయలింగు సభలో సిపిఐ 19వ మండల మహాసభను నిర్వహించారు. ఈ మహాసభలో సిపిఐ మండల కార్యదర్శిగా బొప్పిశెట్టి సత్యనారాయణను ఎన్నుకున్నట్లు సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె సాబీర్ పాష తెలిపారు. సహాయ కార్యదర్శులుగా బసిపాక రవి, ఆకుల చంద్రరావును ఎన్నుకున్నారు. మండలకార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో నిత్యం పోరాటం చేస్తామని, సమస్యలతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు సిపిఐ అండగా ఉంటుందన్నారు.

## ఏరియా ఆసుపత్రుల్లో అన్ని రకాల మందులు ఉంచాలి

### ఎఐటియుసి గౌరవ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధిః**సింగరేణిలో గత నాలుగు నెలలుగా పెండింగ్ లో ఉన్న మెడికల్ బోర్డు ను వెంటనే ఏర్పాటు చేయాలని కోరుతూ కొత్తగూడెంలో చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కిరణ్ రాజ్ కుమార్ తో మాట్లాడ్డం జరిగిందని గుర్తింపు సంఘం ఏఐటియుసి గౌరవ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య పేర్కొన్నారు. సింగరేణి లో వివిధ రకాల వ్యాధులతో చాలా మంది కార్మికులు అనేక అవస్థలు పడుతున్నారని, తీవ్ర అనారోగ్యంతో వారు విధులు నిర్వహించడం లేదని, వివిధ కారణాల వల్ల గత నాలుగు నెలలుగా నిలిచిపోయిన మెడికల్ బోర్డు ను వెంటనే ఏర్పాటు చేయాలని, అదేవిధంగా వివిధ కారణాల వల్ల హయ్యర్ రెఫరల్ మెడికల్ కు పంపిన కార్మికుల కు కూడా మెడికల్ బోర్డు కు పిలవాలని కోరడం జరిగిందని ఆయన అన్నారు. అదే విధంగా అన్ని రకాల మెడిసిన్స్ హాస్పిటల్ లో ఉంచి పేషేంట్లకు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని, అన్ని రకాల వ్యాధులకు సంబంధించిన డాక్టర్ లను భర్తీ చేయాలని సి.ఎం.ఓ ను కోరడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా సి.ఎం.ఓ స్పందించి ఈ నెల లో మెడికల్ బోర్డు ను ఏర్పాటు చేస్తామని, మిగతా సమస్యల ను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని ఆయన పేర్కొన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఏఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్, నాయకులు సలేంద్ర సత్యనారాయణ, బి.సుదర్శన్,రంగు శ్రీను తదితరులు పాల్గొన్నారు.



# స్థానికం

REGIONAL NEWS

నల్లగొండ, సూర్యాపేట యాదాద్రి, గద్వాల

## తహసీల్దార్ కార్యాలయం తనిఖీ



**ప్రజాపక్షం/గుండాల :** గుండాల మండల తహసీల్దార్ కార్యాలయాన్ని సోమవారం జిల్లా కలెక్టర్ హనుమంతరావు ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో మాట్లాడుతూ ఇసుక సిమెంటు సీకు నాణ్యమైన రేట్లకు లభిస్తున్నాయా అని వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇందిరమ్మ లబ్ధిదారులకు ఇసుక పర్మిషన్ వెంటనే ఇవ్వాలని అన్నారు. ఇందిరమ్మ ఇల్లు కట్టుకునే లబ్ధిదారులు ఆర్థిక పరిస్థితులలో వెనుకబడినట్లయితే మహిళ సంఘాల ద్వారా లోన్ తీసుకుని కట్టుకోవాలని సూచించారు. భూభారతి రికార్డులను పరిశీలించి భూ సమస్యలను త్వరగా పరిష్కరించాలని అన్నారు. ప్రభుత్వం చేపట్టిన కాల్వ భూములలో డబల్ కట్ అయిన భూములను కూడా పరిశీలించి వెంటనే పరిష్కరించాలని అన్నారు. సిమెంటు, సీకు వ్యాపారులతో మాట్లాడి రేట్ల తగ్గింపు చేసి ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ఇవ్వాలని అన్నారు.





## సాగర్ ఎడమకాలువకు నీటిని విడుదల చేయాలి

### రైతుసంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ధర్నా

**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** సాగర్ ఎడమకాలువ ఆయకట్టు రైతాంగానికి నీటిని విడుదల చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దూళిపాళ ధనుంజయనాయుడు విజ్ఞప్తి చేశారు. సోమవారం నేరేడుచర్ల తహసిల్దార్ కార్యాలయం ముందు నీటిని విడుదలను డిమాండ్ చేస్తూ రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సాగర్‌నీటి మట్టం 550 అడుగులకు పైగా ఉన్నదని, గత దశాబ్దకాలంలో ఎన్నడులేని విధంగా జూలై నెలలో 550 అడుగులకు నీరు చేరడం పట్ల ఆయన హార్షం వ్యక్తం చేశారు. ఆయకట్టు పరిధిలో రైతాంగం వరినారు మళ్లు సిద్ధం చేసుకున్నారని, గత వారం రోజులుగా తీవ్ర ఎండలతో నారుమళ్లు ఎండిపోతున్నాయని, వాటి రక్షణ కోసం తక్షణమే నీటిని విడుదల చేయాలని కోరారు. చివరి భూములు కూడా నీరు అందాలంటే కనీసం 5000 క్యూసెక్కుల నీటిని విడుదల చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కత్తి శ్రీనివాసరెడ్డి యల్లబొయిన సింహాద్రి, రావుల సత్యం, చిలకరాజు శ్రీను, కొమ్రరాజు వెంకట్, నల్లమేకల వెంకన్న, పంగా నర్సింహారావు, మాలోతు మంగ, జక్కుల అంజయ్య, మాతంగి రామకృష్ణ పాల్గొన్నారు.

## ప్రాజెక్టు పనులు అడ్డగింత



**ప్రజాపక్షం/మర్రిగూడ:** మండల పరిధిలోని శివన్నగూడ బ్యాలెన్స్ సింగ్ పనులు ముంపు గ్రామమైన చర్లగూడెం గ్రామస్తులు సోమవారం తమకు పూర్తి నష్టపరిహారం,ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇళ్ల స్థలాలు ఇచ్చేవరకు పనులను అడ్డుకుంటామని తేల్చి చెపారు.తమ భూములు,ఇండ్లు కోల్పోయిన తీవ్రంగా నష్టపోయామని నష్టపరిహారంతోపాటు ర్అండ్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఇప్పటికే తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయిన పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు.ప్యాకేజీలు నష్టపరిహారం కేవలం కాగితాలకే పరిమితం అయ్యాయని డబ్బులు రూపంలో చెల్లించిన దాఖలాలు లేవని పేర్కొన్నారు.ముంపు బాధితులు వల్లపు రామకోటి, కేశవులు, పగిళ్ల సైదులు, సత్యం, ఎల్లయ్య, సుగుణమ్మ, జంగమ్మ, భాస్కర్, పాల్గొన్నారు.

## నకిలీ పట్టాదారులను రికార్డుల నుంచి తొలగించాలి



**ప్రజాపక్షం/గరిడేపల్లి:** రాష్ట్ర ప్రభుత్వం రైతుల మేలు కోసం తీసుకవచ్చిన భూభారతి చట్టాన్ని వెంటనే అమలు చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యు లు పోకల వెంకటేశ్వర్లు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం సిపిఐ మండల సమితి ఆధ్వర్యంలో గరిడేపల్లి తహసిల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేసి అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం డిప్యూటి తహసిల్దార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధరణి కారణంగా రైతులు చాల నష్టపోయారని పట్టేదారులు పట్టాదారులు కాకుండా పోయారని, భూమిపైన ఉన్న కూడా పట్టా లేకుండా ఉండాల్సిన పరిస్థితి ఉన్నదని, భూభారతి చట్టం ద్వారా మొత్తం భూములను సర్వే చేసి ఎవరైతే పట్టా లేకుండా ఉన్నారో వారికి పట్టాలను ఇచ్చి, నకిలీ పట్టాదారులను రికార్డుల నుంచి తొలగించి అసలైన పట్టేదారులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి కడియాల అప్పయ్య, నాయకులు త్రిపురం సుధాకర్‌రెడ్డి, ఎడ్ల అంజిరెడ్డి, పోకల ఆంజనేయులు, ప్రధాని సైదులు, కుందూరు వెంకటరెడ్డి, ఈశ్వరచారి, దర్శన్ ఆచారి పాల్గొన్నారు.

## పేదలకు వెంటనే ఇండ్ల స్థలాలు మంజూరు చేయాలి

**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** కొలనుపాక గ్రామములోని పేదలకు ఇండ్ల స్థలాలు మంజూరీ చేసి, వెంటనే పట్టా ఇవ్వాలని సిపిఐ యాదాద్రి భువనగిరి జిల్లా కార్యవర్గ సభ్యులు ఆలేరు నిర్మాణ బాధ్యులు చెక్క వెంకటేష్ అన్నారు. ఆలేరు మండలం, కొలనుపాక గ్రామములోని సర్వేనెంబర్ 8, ప్రభుత్వ ఖాళీ స్థలములో అర్హులైన నిరుపేదలకు ఇంటి స్థలాలను గుర్తించి భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) కొలనుపాక గ్రామశాఖ, ఆలేరు మండల సమితి ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూపోరాటం చేసి ఎర్ర జెండాలను పాతినాము కానీ అట్టి జెండాలను రెవెన్యూ అధికారులు తొలగించినట్లు చెప్పారు. గత ప్రభుత్వ హాయాంలో పేదలకు ఇండ్ల పట్టాలు ఇస్తామని కాలయాపన చేసిందని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా హామీ ఇచ్చి ఇంతవరకు ఇండ్ల స్థలాలు పేదలకు ఇవ్వలేదన్నారు. ఇప్పటికైనా తమరు ప్రభుత్వ పక్షాన అట్టి స్థలాన్ని అర్హులైన పేదలకు పంపిణీ చేసి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి జిల్లా ఉపాధ్యక్షులు పోతు ప్రవీణ్, చౌడబోయిన పరుషరాములు, రైతు సం ఘం మండల అధ్యక్షులు తెడ్డు అంజనేయులు, మండల నాయకులు దార ఓదయ్య, ఆలేరు సిపిఐ మండల కార్యదర్శి చౌడబోయిన కనకయ్య, కొలనుపాక గ్రామశాఖ కార్యదర్శి పొన్నబోయిన రవి పాల్గొన్నారు.



# సిపిఐ నల్లగొండ జిల్లా 23వ మహాసభకు ముస్తాబైన దేవరకొండ

ఉద్యమాల కేంద్రమైన దేవరకొండలో జూలై 15న సిపిఐ నల్లగొండ జిల్లా 23వ మహాసభ జరుగుతున్నది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 64 మండలాలు12 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా జిల్లాను విభజించి అదనంగా రెండు జిల్లాలు( సూర్యాపేట, యాదాద్రి భువనగిరి)ఏర్పాటుజరిగినవి. ప్రస్తుతం 34 మండలాలతో ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలతో రాష్ట్రంలోని అతి పెద్ద జిల్లాగా నల్లగొండ ఉన్నది.

నేడు జిల్లా 5 వ మహాసభకు దేవరకొండ ఆతిథ్యమిస్తుంది.

**దేవరకొండ చారిత్రిక నేపథ్యం :** 13వ శతాబ్దంలో రేచర్ల వెలమరాజులు దేవరకొండను రాజధానిగా చేసుకుని దాదాపు 300 సంవత్సరాలు పాలించినట్టు.. వారే దేవరకొండ పట్టణానికి దగ్గరలో మూడు కొండలతో చుట్టబడిన ఒక కొండపై శత్రువులకు దుర్భేద్యమైన కోటను ఉప్పు వాగు స్వర్ణముఖి వాగుల నడుమ 520 ఎకరాల విస్తీర్ణములో 500 మీటర్ల పై ఎత్తులో నిర్మించారని చారిత్రిక ఆధారాల బట్టి తెలుస్తున్నది. ఈ గుట్టలను (దేవుని గుట్టలు) కలుపుతూ దేవరకొండ ఖిల్లాను(కోటా) నిర్మించారు. కాలక్రమేణా దేవరకొండగా పిలువబడుతుంది.

1948 సెప్టెంబర్ 17న నిజాం ప్రభువు ఇండియన్ యూనియన్ లో విలీనం కావడంతో యూనియన్ సైన్యాలు, పోలీసులు.. కమ్యూనిస్టుల పైన సాయుధ కమ్యూనిస్టు దళాల పైన నిర్బంధాలు అరెస్టులు, కనిపిస్తే కాల్చివేతలు తీవ్రం కావడంతో హుజూర్‌నగర్, సూర్యాపేట ప్రాంత దళాలు కృష్ణపట్టి ద్వారా అడవి దేవులపల్లి, పెద్ద మునగాల ప్రాంతాలకు షెల్టర్స్ కోసం రహస్యంగా వచ్చాయి. నల్లగొండ ప్రాంతంలో ఉన్న దళాలు మునుగోడు, చింతపల్లి ప్రాంతాల గ్రామాలకు ఘడియగౌరారం, పడమటిపల్లి, కందుకూరు గ్రామాలకు రావడం వారికి ఈ ప్రాంతంలో షెల్టర్స్ ఇవ్వడం, ఆహారాన్ని అందించడంతో ఈ ప్రాంత యువకులు కమ్యూనిస్టుల పట్ల ఆకర్షింపబడ్డారు. వారు రహస్యంగా ఏర్పాటు చేసిన రాజకీయ శిక్షణ శిబిరాల్లో కూడా పాల్గొన్నారు. 1948–50 సం.రాలలో ఈ ప్రాంతములో అనేక గ్రామాలలో దళాలు పర్యటించటం జరిగింది. ఆ విధంగా ఆకర్షింపబడిన వారిలో పల్లా పర్వత రెడ్డి, ఉజ్జిని నారాయణరావు, బొడ్డుపల్లి రామశర్మ, పగిడి మర్రి మల్లప్ప, మాధవరం రాంరావు తదితరులు ఉన్నారు. 1951లో దేవరకొండలో 5 గురితో కమ్యూనిస్టు శాఖ ఏర్పాటయింది. 1952 లో జరిగిన ఎన్నికల్లో అనేకమంది యువకులు పిడిఎఫ్ నుండి పోటీ చేసిన కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థి అనంతరామారావును గెలిపించుకున్నారు. అదేవిధంగా పెద్ద మునుగల్ నుండి కె. వెంకట్రామారావును గెలిపించుకున్నారు(వారు రాజీనామా చేశారు). చిన్న కొండూరు నుండి కంచనపల్లి చిన వెంకట్రామారావును గెలిపించుకున్నారు. దానితో ఈ ప్రాంతంలో కమ్యూనిస్టు పార్టీ ఉద్యమానికి శ్రీకారం చుట్టారు.







1953లో సిపిఐ దేవరకొండ తాలూకా కమిటీ 25 మంది సభ్యులతో ఏర్పాటయింది. 1953లో పానగల్లులో జరిగిన నల్లగొండ జిల్లా నిర్మాణ మహాసభకు ఈ ప్రాంతం నుండి ఐదుగురు సభ్యులు పాల్గొన్నారు. 1959 లో జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో 18 మంది సర్పంచులు చింతపల్లి సమితికి అదేవిధంగా దేవరకొండ సమితికి ఎన్నిక కాబడ్డారు. 1962 లో జరిగిన శాసనసభ ఎన్నికలకు దేవరకొండ నుండి ఎలిమినేటి పెద్దయ్య, పెదవుర నుండి పల్లా పర్వత రెడ్డి శాసనసభ్యులుగా ఎన్నికైనారు. 1962–72 మధ్యకాలంలో దేవరకొండ చింతపల్లి సమితి ప్రాంతంలో సిపిఐ రైతు సంఘం పేరుతో విస్తృతంగా పోరాట కార్యక్రమాలు చేపట్టడం మూలంగా దేవరకొండ తాలూకాలో 100కు పైగా గ్రామాల్లో సిపిఐ శాఖలు ఏర్పడినవి. 1971లో దేవరకొండ సమితికి పల్లా పర్వతరెడ్డి, దేవరకొండ భూతనఖా బ్యాంకు వైస్ చైర్మన్ గా ఉజ్జిని నారాయణరావు ఎన్నికయ్యారు. 1964 సిపిఐ లో చీలిక నేపథ్యంలో నల్లగొండ జిల్లాలో కమ్యూనిస్టు ఉద్యమం నిట్ట నిలువునా చీలిపోయింది. కానీ దేవరకొండ ప్రాంతంలో మొత్తం నాయకత్వం సిపిఐ తోనే కొనసాగింది. 1972 లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో దేవరకొండ నుండి బొడ్డుపల్లి రామశర్మ గెలుపొందారు. 1978 నుండి దేవరకొండ ఎస్టీ నియోజకవర్గముగా కొనసాగుతుంది. మండల వ్యవస్థ ఏర్పాటుతో 1986 జరిగిన ఎన్నికల్లో నల్లగొండ జిల్లాలో సిపిఐ గెలిచిన నలుగురు మండల అధ్యక్షులలో..3 మండలాలు(దేవరకొండ, డిండి, చందంపేట) నుండి పల్లా వెంకట్ రెడ్డి, ఎలిమినేటి పెద్దయ్య, పల్లా లక్ష్మారెడ్డి దేవరకొండ తాలూకా నుండి గెలుపొందారు. ఆ తదుపరి కాలంలో జరిగిన 11 శాసనసభ ఎన్నికల్లో ఏడుసార్లు సిపిఐ అభ్యర్థులు గెలుపొందారు. ప్రస్తుతము ఈ ప్రాంత పార్టీ సభ్యత్వం 3 వేల వరకు ఉన్నది.

సిపిఐ నిర్వహించిన ఉద్యమాలు: దేవరకొండ తాలూకా తలాపుగా ప్రవహిస్తున్న కృష్ణా జలాలు అందించాలని ఈ తాలూకాలో పెద్ద ఎత్తున 1975 నుండి అనేక ఉద్యమాలు చేపట్టడం జరిగింది. ఈ ఉద్యమాల ఫలితంగానే 1978 లో తెలంగాణ ఉద్యమ నాయకుడు మర్రి చెన్నారెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే వెలుకబడ్డ నల్లగొండ జిల్లాలో దేవరకొండ, మునుగోడు నియోజకవర్గాలకు కృష్ణా జలాలు అందించే విధంగా పథకాన్ని చేపట్టాలని నిపుణుల కమిటీ వేయటం.. కమిటీ ఎస్ఎల్బీసీ సొరంగ పథకం చేపట్టాలని, అదేవిధంగా మహబూబ్‌నగర్ ప్రాంతానికి భీమా, నెట్టెంపాడు, కల్వకుర్తి ఎత్తిపోతల ద్వారా కృష్ణ నీటిని అందించాలని నివేదిక ఇచ్చింది. ఈ నేపథ్యంలో క్షామ పీడిత ప్రాంతంగా గుర్తించబడిన దేవరకొండ, చింతపల్లి సమితి ప్రాంత గ్రామాలకు కృష్ణా జలాలు అందించాలని సిపిఐ దేవరకొండ తాలూకా సమితి ఆధ్వర్యంలో 1100 ఎడ్ల బండ్లతో 1980 లో దేవరకొండ పట్టణంలో భారీ ప్రదర్శన చేయడం జరిగింది. దీంతో ఆనాటి ముఖ్యమంత్రి టి అంజయ్య ఎస్ఎల్‌బిసి సొరంగ పథకానికి శంకుస్థాపన చేశారు. 1983లో అధికారంలోకి వచ్చిన ఎన్టీ రామారావు తిరిగి శంకుస్థాపన చేస్తూ నాలుగు సంవత్సరాల్లో పూర్తి చేస్తామని దేవరకొండ బహిరంగ సభలో ప్రకటించారు.

1969–70 భూపోరాటంలో దేవరకొండ తాలూకాలో దాదాపు రెండువేల పైగా ఎకరాలను వివిధ గ్రాలలో పేదలకు పంచడం జరిగింది. 2003 లో ఎస్ ఎల్ బి సి పూర్తి చేసి, నక్కల గండి నుండి లిఫ్ట్ ద్వారా డిండి ప్రాజెక్టును నింపి నీరందించాలని డిండి ప్రాజెక్టు నుండి నల్లగొండకు సిపిఐ రాష్ట్ర నాయకులు సురవరం సుధాకర్ రెడ్డి నాయకత్వాన 500 మంది కార్యకర్తలతో 160 కిలోమీటర్ల పాదయాత్ర చేపట్టటం జరిగింది. 2009లో పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలని హైదరాబాద్ అసెంబ్లీ వరకు పాదయాత్ర చేపట్టటం జరిగింది.

ఈ ప్రాంతానికి కృష్ణాజలాలు లభించాలని, ఎస్ ఎల్ బి సి త్వరగా పూర్తిచేయాలని, డిండి ఎత్తిపోతల పథకానికి పూర్తి నిధులు విడుదల చేసి దేవరకొండ, మునుగోడు నియోజకవర్గాల్లోని గ్రామాలకు ..3.2 లక్షల ఎకరాలకు సాగునీరు, 520 గ్రామాలకు త్రాగునీరు అందించాలని సిపిఐ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నది.

# ముదిగొండ అరుణశోభితం

నేడు ముదిగొండ మండడి నరసింహారెడ్డి ప్రాంగణం (సాయిరాం ఫంక్షన్ హాల్)లో

సిపిఐ జిల్లా 23వ మహాసభ

హాజరు కానున్న జాతీయ, రాష్ట్ర, జిల్లా నాయకత్వం,ప్రతినిధులు



**ప్రజాపక్షం/దేవరకొండ:** సిపిఐ నల్లగొండ జిల్లా 23వ, మహాసభ నేడు మంగళవారం దేవరకొండలో జరుగుతున్నాయని. దేవరకొండ పట్టణంలో ప్రధాన రహదారుల వెంబడి ఎర్ర జెండాలు, తోరణాలు, ఫ్లక్సీలతో ఏరుపు మయంగా మారింది.చాలా సంవత్సరాల తర్వాత దేవరకొండలో జిల్లా మహాసభ జరుగుతున్న సందర్భంగా దేవరకొండ లో ఘనంగా నిర్వహించేందుకు పెద్ద ఎత్తున ఏర్పాటు చేస్తున్నారు.ఏర్పాట్లను సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి పర్యవేక్షిస్తున్నారు.ఈ సందర్భంగా నర్సింహా రెడ్డి ఆయన మాట్లాడుతూ సిపిఐ జిల్లా 23వ మహాసభ మండడి నరసింహారెడ్డి ప్రాంగణం (సాయిరాం నా ఫంక్షన్ హాల్)లో జిల్లావ్యాప్తంగా ఎంపిక చేయబడిన ప్రతినిధులు పాల్గొంటున్నారని,జిల్లాలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి భవిష్యత్తు పోరాట కార్యక్రమాలు ఈ మహాసభలలో రూపొందిస్తామని అన్నారు.ఈ మహాసభలకు ముఖ్యఅతిథిగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు,సిపిఐ జాతీయ కౌన్సిల్ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకటరెడ్డి, తెలంగాణ ప్రెస్ అకాడమీ చైర్మన్ కే.శ్రీనివాస్ రెడ్డి, సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ముఖ్య అతిథులుగా పాల్గొంటున్నారని తెలిపారు. ఎన్నో పోరాటాల చరిత్ర గల దేవరకొండ కిల్లాలో కమ్యూనిస్టు పార్టీ ప్రజల పక్షాన నిలబడి ప్రజా సమస్యల పరిష్కారం కోసం వీరోచిత పోరాటాలు చేసిన చరిత్ర ఉందని అన్నారు. నల్లగొండ జిల్లా ప్రజల దీర్ఘకాలిక సమస్య అయిన సాగు తాగు నీటి సమస్య పరిష్కారం కోసం ఎస్ఎల్బీసీ సొరంగం ,డిండి లిఫ్ట్ ఎత్తిపోతలు త్వరగా పూర్తి చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. పలుమార్లు ఎమ్మెల్యే గెలిచిన దేవరకొండ నియోజకవర్గం లో మరోసారి ఎర్రజెండా ఎగరవేయడం కోసం కోసం ఈ మహాసభలు దోహదపడతాయని అన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి,మండల కార్యదర్శి దేప సుదర్శన్ రెడ్డి, సహాయ కార్యదర్శి నూనె రామస్వామి,కేశవరెడ్డి,పల్లా రంగారెడ్డి, పట్టణ కార్యదర్శి వలమల ఆంజనేయులు, కే. యాదయ్య,కే.బారేములు, ముడీ రాజు, ఏ.మల్లయ్య. శివకుమార్ వినోద్ మహేష్, వెంకట్ రెడ్డి, బక్కయ్య తదితరులు పాల్గొన్నారు.



## ఫుడ్ పాయిజన్ ఘటనపై విచారణ

### ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులుడిమాండ్

**ప్రజాపక్షం/దేవరకొండ:** దేవరకొండ మండలంలోని ముదిగొండ ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులు ఫుడ్ పాయిజన్ కు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు వలమల ఆంజనేయులు పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అధికారుల పర్యవేక్షణ లేకపోవడం సంబంధిత వార్డెన్ పట్టించుకోకపోవడం విధులకు సక్రమంగా హాజరు కాకపోవడం వలనే ఈ సంఘటన జరిగిందని ఆయన అన్నారు వార్డెన్ విధులకు హాజరు కాకపోవడంతో గతంలో కూడా ఇలాంటి సమస్యలు వచ్చాయని మళ్లీ ఇలాంటి ఘటన లేకుండా అమృతం కావడం అధికారుల పర్యవేక్షణ లోపం స్పష్టంగా కనబడుతుందని ఆయన అన్నారు. సోమవారం దేవరకొండ నియోజకవర్గంలో ముదిగొండ లో ఉన్న గిరిజన ఆశ్రమ బాలిక పాఠశాల లో సుమారు 15 మంది గిరిజన బాలికల విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ ఘటన పైన విచారణ జరిపించాలని తక్షణమే జిల్లా కలెక్టర్ స్పందించి పేద మధ్యతరగతి విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్య ఖర్చులు మొత్తం ప్రభుత్వ భరించాలని డిమాండ్ చేశారు. వార్డెన్ నిర్లక్ష్యం వల్లనే ఫుడ్ పాయిజన్ జరిగిందని, సంబంధిత వార్డెన్ ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని లేనిపక్షంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపడతామన్నారు.

## ఖాళీ అయిన ఆలేరు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పదవి!

### హైకోర్టు ఉత్తర్వులు అమలు చేయాలని ఆదేశం!





**ప్రజాపక్షం/ఆలేరు :** ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పచ్చిమట్ల మదర్ గౌడ్ పదవి లేనట్టేనని మార్కెటింగ్ శాఖ అధికారులు తేల్చేశారు. ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎన్నికల సమయంలో వైస్ చైర్మన్ అభ్యర్థి పచ్చిమట్ల మధర్ గౌడ్ సమర్పించిన ధృపత్రాలలో మార్కెటింగ్ శాఖ నిబంధనలకు విరుద్ధంగా ధృవపత్రాలు సమర్పించారని అందుకు ఆయన ఎన్నిక చెల్లదని తుర్కపల్లి మండలం బీఆర్ఎస్ నాయకులు గంధమల్ల గ్రామ మాజీ సర్పంచ్ సాగర్ల పరమేష్ 2024లో తెలంగాణ హైకోర్టులో వాజ్యం దాఖలు చేశారు. ఇరువురి వాదనలు విన్న సింగిల్ బెంచ్ ధర్మాసనం డబ్ల్యూ పి నెంబర్ 35311/2025 ద్వారా ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తొలగిస్తున్నట్లు తేదీ 2/5/2025 న ఉత్తర్వులు వెలువరించింది. సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ వైస్ చైర్మన్ పచ్చిమట్ల మాదర్ గౌడ్ హైకోర్టు డివిజన్ బెంచ్ ను ఆశ్రయించాడు. అన్నింటినీ పరిశీలించిన డివిజన్ బెంచ్ సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పును నిలిపివేస్తూ మరోసారి పరిశీలించి విచారించాలని తిరిగి కింది కోర్టును ఆదేశించింది. వైస్ చైర్మన్ ఎన్నికల సమయంలో సమర్పించిన ధ్రువపత్రాలన్నిటిని పరిశీలించిన హైకోర్టు సింగిల్ బెంచ్ ధర్మాసనం మరోసారి ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎన్నిక చెల్లదని తీర్పును వెలువరించింది. ఇట్టి ఆదేశాలను వెంటనే అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి, అగ్రికల్చర్ అండ్ మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ కు ఉత్తర్వులు జారీ చేసింది. హైకోర్టు ఉత్తర్వులను వెంటనే అమలు చేయాలని కోరుతూ డైరెక్టర్ ఆఫ్ మార్కెటింగ్ శాఖ హైదరాబాద్ గారి కార్యాలయం నుంచి తేదీ 5/7/2015న యాదాద్రి భువనగిరి జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారికి, ఆలేరు మార్కెట్ శాఖ కార్యదర్శి కి ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్తర్వులు జారీ చేసిన విషయమై ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి పద్మజను ప్రజాపక్షం వివరణ కొరగా ఉత్తర్వులు అందింది నిజమేనని తెలిపారు.

## తుంగతుర్తి కాంగ్రెస్‌లో భగ్గుమన్న విభేదాలు

### మాజీ మంత్రి దామోదర్ రెడ్డి వర్గీయుల ఫ్లెక్సీలు చించివేత

### ఎమ్మెల్యే మందుల సామేల్ వర్గీయుల పనేనని ఆరోపణ

**ప్రజాపక్షం/సూర్యాపేట(తిరుమలగిరి):** తుంగతుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ నేతల మధ్య మరోసారి వర్గవిభేదాలు భగ్గుమన్నాయి. నియోజకవర్గంలో కాంగ్రెస్ నాయకులు గత కొంత కాలంగా రెండు వర్గాలుగా విడిపోయి పార్టీ కార్యక్రమాలను వేర్వేరుగా నిర్వహిస్తున్నారు. సిఎం రేవంత్ రెడ్డి పర్యటనలో భాగంగా మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి వర్గీయులు తిరుమలగిరి మున్సిపల్ కేంద్రంలో పెద్ద ఎత్తున స్వాగత ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. సోమవారం తెల్లవారుజామున వాటిని గుర్తు తెలియని కొందరు వ్యక్తులు చించివేశారు. కాగా ఈ పని చేసింది ఎమ్మెల్యే మందుల సామేల్ వర్గీయులే చేసి ఉంటారని దామోదర్ రెడ్డి వర్గీయులు ఆరోపిస్తున్నారు. ఎన్నికల ముందు బిఆర్ఎస్ నుండి కాంగ్రెస్‌లో చేరి ఎమ్మెల్యేగా గెలుపొందిన సామేల్ మొదటి నుండి పార్టీకి అండగా నిలిచిన వారిని కాదని తనతో పాటు బిఆర్ఎస్ నుండి కాంగ్రెస్‌లో వలస వచ్చిన వారికి అధిక ప్రాధాన్యత ఇస్తుండడంతో వారు జీర్ణించుకోలేకపోతున్నారు. ఈ విషయం పార్టీ అదిష్టానం దృష్టికి తీసుకెళ్లిన పాత, కొత్త నాయకుల మధ్య నెలకొన్న పంచాయతీని మాత్రం పరిష్కరించకపోవడంతో రోదు రోజుకు వర్గవిభేదాలు పెరిగిపోతున్నాయి. మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి అనుచరులే తనను కావాలని ఇబ్బంది పెడుతున్నారంటూ ఎమ్మెల్యే తాను దళితున్ని కావడంతోనే ఇలా చేస్తున్నారని ఎదురుదాడికి దిగిన పరిస్థితి. గతంలో బహబాహిగా తలపడ్డ ఇరువర్గాల వారు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదులు చేసుకున్న సందర్భాలు లేకపోలేదు. నేడు ఫ్లెక్సీల చించివేతతో మరోసారి నాయకుల వర్గవిభేదాలు బయటపడ్డాయి. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనుండడంతో ఇది పార్టీకి నష్టం చేకూర్చేలా ఉందని కార్యకర్తలు ఆందోళన చెందుతున్నారు.



## బాలెంలలో 'చెత్తపై స్పెషల్ వేస్ట్ ఆడిట్'

### మున్సిపల్ కమిషనర్ సిహెచ్ హన్మంతరెడ్డి

**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** బాలెంలలో చెత్తపై స్పెషల్ వేస్ట్ ఆడిట్‌లో భాగంగా పరిసరాల పరిశుభ్రతపై కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ సిహెచ్ హన్మంతరెడ్డి కోరారు. సోమవారం మున్సిపల్ 100 రోజుల ప్రణాళికలో బాగంగా సూర్యాపేట సమీపంలోని బాలెంల గ్రామంలోని సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ సెంటర్‌లో మున్సిపల్ కమిషనర్ స్పెషల్ వేస్ట్ ఆడిట్ చేపట్టారు. వాతావరణ పరిరక్షన, ప్రజారోగ్య పరిరక్షణ దృష్ట్యా మున్సిపాలిటి చెత్త నిర్వహణలో విధానాల్లో పారదర్శకత పెంచే కృషిలో ఈ ఆడిట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చెత్తలో మిగులు ఉన్న పదార్థాలు, వాటి వర్గీకరణ, రీసైక్లింగ్ అవకాశాలపై ప్రత్యేకంగా ఆరా తీశారు. ఇందులో తడిచెత్తను కంపోస్టింగ్‌కు, పోడి చెత్తను పునఃచర్యల కోసం వేరుచేసే పద్ధతులపై కార్యచరణ రూపొందిస్తు న్నామన్నారు. పర్యావరణ పరిరక్షణకు మిషన్ క్లీన్ సిటిస్ లక్ష్య సాధనకు ప్రతి ఉద్యోగి బాధ్యతగా పనిచేయాలని సూచించారు. ఇలాంటి ఆడిట్లు నియమిత కాల వ్యవధిలో నిర్వహిస్తూ మరింత సమర్థవంతమైన స్మార్ట్ వేస్ట్ మేనేజ్‌మెంట్ వైపు పురపాలక సంస్థ దృష్టిసారించిందని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.



# స్థానికం

REGIONAL NEWS

మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, నాగర్‌కర్నూల్

## ఓపెన్ స్కూల్ అడ్మిషన్లకు ఈనెల 30 ఆఖరి గడువు



**ప్రజాపక్షం/మద్దూర్:** ఓపెన్ స్కూల్ అడ్మిషన్లకు ఈనెల 30వ తేదీ చివరిది గడువు అని ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ టీ?దాసు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓపెన్ స్కూల్ ఆధ్వర్యంలో నిర్వహించే పదోతరగతి ఇంటర్మీడియట్ అడ్మిషన్లకు 30వరకు పొడిగించాలని ప్రభుత్వం నిర్ణయించిందని ఆయన పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆసక్తి గల అభ్యర్థులు మద్దూరు ఓపెన్ స్కూల్ నందు సంప్రదించాలని దాసు సూచించారు. పదో తరగతిలో ప్రవేశానికి 15 సంవత్సరాలు వయసు నిండిన వారు అర్హులు కాగా 10వ తరగతి అయినా ఆరు ఇంటర్మీడియట్ చరవచ్చు అని వివరించారు. చదువు దూరమైన వారికి ఇది ఒక గొప్ప అవకాశం అని, గ్రామాల్లో పదో తరగతి పూర్తి అయిన వారు చదవడం రాయడం వచ్చిన వారు అనివార్య కారణాల వల్ల చదువు మధ్యలో ఆపేసిన వారు, ఆర్థిక ఇబ్బందులతో చదవాలని ఆశ ఉన్న ప్రతి ఒక్కరు ఈ అవకావాన్ని ఉపయోగించుకోవాలని ఈ సందర్భంగా తెలిపారు.

## తక్షణ న్యాయమే లక్ష్యంగా 'గ్రీవెన్స్ డే'

ఎస్పి డి.జానకి

**ప్రజాపక్షం/మహబూబ్ నగర్ ప్రతినిధి :** జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించబడుతున్న గ్రీవెన్స్ డే కార్యక్రమం ప్రజలకు న్యాయం అందించే విశ్వసనీయ వేదికగా నిలుస్తోంది. సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుండి వచ్చిన పౌరుల నుండి 15 ఫిర్యాదులను స్వీకరించబడ్డాయని జిల్లా ఎస్పీ డి.జానకి తెలిపారు. ప్రతి ఫిర్యాదును సవివరంగా పరిశీలించి, సంబంధిత పోలీస్ అధికారులతో ప్రత్యక్షంగా ఫోన్ ద్వారా సంప్రదించి, బాధితులకు వేగవంతమైన, న్యాయబద్ధ పరిష్కారాలను సూచిస్తూ తగిన ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, "పౌరుల సమస్యలు ప్రాధాన్యతతో విని, మర్యాదపూర్వకంగా స్పందించడం పోలీస్ శాఖ కర్తవ్యం. ప్రతి ఫిర్యాదు ఆన్‌లైన్‌లో నమోదు చేయబడి, పరిష్కార స్థితిని క్రమం తప్పకుండా సమీక్షిస్తున్నాం. అవసరమైతే రంగంలోకి వచ్చి పరిశీలించేందుకు సైతం మా సిబ్బంది సిద్ధంగా ఉన్నారు. బాధితులకు సత్వర న్యాయం అందించడమే మా లక్ష్యం". గ్రీవెన్స్ డే వేదిక ప్రజలు నేరుగా తమ బాధలను పోలీసు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావడానికి ఉపయోగపడుతుందని, వాటిని శీఘ్రంగా పరిష్కరించేందుకు జిల్లా పోలీసు యంత్రాంగం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు.

## ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి



**ప్రజాపక్షం/నారాయణపేట్ :** ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదు దారుల పెండింగ్లో ఉంచకుండా వెంటనే పరిష్కరించాలని డీఎస్పీ నల్లపు లింగయ్య తెలిపారు. సోమవారం రోజు డీఎస్పీ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించడం జరిగిందని అందులో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 06 మంది ఫిర్యాదులను డీఎస్పీ నల్లపు లింగయ్య పరిశీలించి సంబంధిత పోలీస్ అధికారులతో ప్రత్యక్షంగా ఫోన్లో మాట్లాడి వెంటనే ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని తగిన సలహాలు సూచనలు ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ... పోలీస్ స్టేషన్ల ఫిర్యాదు అందిన వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని తదుపరి కేసు విచారించి పరిష్కరించాలని తెలిపారు. భూ తగాదాలకు సంబంధించిన ఫిర్యాదులను సంబంధిత రెవెన్యూ అధికారులతో కలిసి సమన్వయంతో పరిష్కరించాలని సూచించారు. పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేస్తే తప్పకుండా చేసిన, ఎఫ్ఐఆర్ కాపీ ఇవ్వాలని పోలీసు అధికారులకు తెలిపారు. ప్రజలు అత్యవసర సమయంలో డయల్ 100కి కాల్ చేసి పోలీసులకు సమచారం ఇవ్వాలని డీఎస్పీ సూచించారు.

## ఆలయ భూములను రక్షించాలని వినతి



**ప్రజాపక్షం/మక్తల్ :** మక్తల్ పట్టణంలోని పడమటి ఆంజనేయస్వామి ఆలయ భూమితో పాటు మున్సిపల్ స్థలాన్ని కొందరు కబ్జాదారులు కబ్జా చేసి అక్రమంగా ప్లాట్లను విక్రయించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని, ఆలయ భూములను అన్యాక్రాంతం కాకుండా తగిన చర్యలు తీసుకోని భూకబ్జాలను ఆపాలని వీహెచ్‌పీ, ఆర్ఎస్ఎస్, హిందూ వాహిని ఆధ్వర్యంలో సోమవారం మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణకు వినతి పత్రం అందజేశారు. మక్తల్ పట్టణంలోని సర్వే నెంబరు 34,35,44లలో కోట్ల విలువైన స్థలాన్ని కాజేసేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారని ఎంపీకి విన్నవించారు. ఈ భూమిని కాజేసేందుకు గతంలో ఎన్నో సార్లు ప్రయత్నించి విఫలమయ్యారని, కానీ తాజాగా అధికార బలంతో కబ్జా చేసేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ, జి. బలరాం రెడ్డి, మల్లికార్జున్, భీమ్ రెడ్డి, భీమేష్, నాగరాజు పాల్గొన్నారు.

## బిఇడి విద్యార్థి సౌమ్యకు న్యాయం జరిగే వరకు పోరాడుతాం



**ప్రజాపక్షం/వనపర్తి :** ఎన్ఎస్‌యూఐ జాతీయ అధ్యక్షులు వరుణ్ చౌదరి, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షులు వెంకటస్వామి ఆదేశాల మేరకు వనపర్తి జిల్లా కేంద్రం అంబేద్కర్ చౌక్‌లో ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో బాలికలు, విద్యార్థులతో సౌమ్యకి జరిగిన అన్యాయం పట్ల నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎన్ఎస్‌యూఐ నాయకులు శ్రీకాంత్ మాట్లాడుతూ ఒడిశా రాష్ట్రంలోని బాలాసోర్‌లో ఫకీర్ మోహన్ విశ్వవిద్యాలయంలో రెండో సంవత్సరం బీఈడీ చదువుకునే సౌమ్య అనే ఒక విద్యార్థినిని పాఠాలు చెప్పే సమీర్ సాహూ అనే ఉపాధ్యాయుడు తనని లైంగిక వేధింపులకు గురి చేస్తున్నాడని ప్రధానోపాధ్యాయుడికి చెప్పినా వాళ్లు ఏ మాత్రం లెక్క చేయకుండా నిర్లక్ష్యంతో ఉండటం వల్ల తాను పెట్రోల్ పోసుకొని నిప్పు అంటించుకొని చనిపోవడం జరిగింది. తోటి విద్యార్థిని కాపాడటానికి వెళ్లి ఆమె సగం గాయాలతో బతికి బైట పడింది. ఆ ఇద్దరిని భువనేశ్వర్‌లోని ఎయిమ్స్ ఆసుపత్రికి తరలించారు. దీని తదనంతరం అక్కడ వైద్యులు సౌమ్య శరీరం 90 శాతం కాలిపోయిందని తేల్చి చెప్పడం జరిగింది. ఈ సంఘటన జరగడానికి ముఖ్య కారణం ఫకీర్ మోహన్ విశ్వవిద్యాలయం యాజమాన్యం, అక్కడి పోలీస్‌ల నిర్లక్ష్యమే కారణం. నరేంద్రమోదీ భేటీ బచావో బేటి పడావో అనే కార్యక్రమం చేపట్టారు. దేశంలో బీజేపీ పాలిత రాష్ట్రాలలో ఏ ఒక్క విద్యార్థిని ఈ కార్యక్రమం ద్వారా న్యాయం జరగలేదని అన్నారు. ఎబివిపివిలు పని చేసే విద్యార్థికే భద్రత లేకపోతే సామాన్య విద్యార్థులకు ఏం భద్రత ఉంటుందని ఈ సభాముఖంగా ప్రశ్నించడం జరిగింది. సౌమ్యకి న్యాయం జరిగే వరకు ఎన్ఎస్‌యూఐ పోరాడుతానే ఉంటుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ జిల్లా నాయకులు బి.శ్రీకాంత్, గంధం కుమార సంగ్రహ, శేషాంక్ సాగర్, మహేందర్ సింగ్ కార్తీక్, అనిల్ కుమార్, ఎంజి నబీల్, జానకి రాముడు యాదవ్, కేశవకుమార్, లోకేష్, మాడవత్ సిద్దార్థ, సూర్యవంశం శివ, కిరణ్, నరేష్ యాదవ్, పసుల శివ, బాలిక విద్యార్థులు పాల్గొన్నారు.

# ఫిర్యాదులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలి




ప్రజావాణికి 142 ఫిర్యాదులు

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి:** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ వచ్చిన దరఖాస్తులను పెండింగు లేకుండా ఫిర్యాదులను ఎప్పటికప్పుడు సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశం మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 142 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదు దారులు తమ సమస్యలను జిల్లా కలెక్టర్‌తో పాటు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్‌లకు అర్జీలు సమర్పించారు. ఫిర్యాదులను పెండింగులో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రజావాణి అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో వివిధ అంశాలపై సూచనల వేశారు. గ్రామ పరిపాలన అధికారుల నియామకానికి ఆసక్తి ఉన్న వివిధ శాఖలలో పని చేస్తున్న మాజీ విఆర్‌ఓలు, విఓలు వారు ఈనెల 16లోగా దరఖాస్తు చేసుకోవాలని తెలియచేయాలని జిల్లా అధికారులకు కలెక్టర్ సూచించారు. అధికారులకు కలెక్టర్ సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం వేగవంతంగా చేపట్టి వందకు వంద శాతం లక్ష్యాలను సాధించే దిశగా పూర్తిచేయాలని సంబంధిత అధికారులకు జిల్లా కలెక్టర్ ఆదేశించారు. శాఖల వారీగా పెండింగ్లో ఉన్న కోర్టు కేసులకు సంబంధించిన వివరాలను సమర్పించాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ ఆదేశించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రజావాణిలో 77 ఫిర్యాదులు

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** జిల్లాలోని వివిధప్రాంతాలనుండి వచ్చిన ఫిర్యాదుదారుల సమస్యల ఆర్జీలను జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ పి.అమరేందర్ స్వీకరించారు. నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 77 ఫిర్యాదులు అందాయన్నారు. సంబంధిత శాఖల జిల్లా అధికారులు స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించి తదుపరి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధశాఖలలో ప్రజా సమస్యలను సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధితశాఖల జిల్లా అధికారులు తక్షణమే స్పందిస్తూ వాటిని వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఆర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ సూపరింటెండెంట్లు రవికుమార్, శోభ, వెంకట్, నారాయణ, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

# సిఎం పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాగర్‌కర్నూల్ జిల్లాలోని కొల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు, ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్న నేపథ్యంలో అందుకు అవసరమైన పూర్తిస్థాయిలో పకడ్బందీగా ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ తెలిపారు. ఈమేరకు సోమవారం కొల్లాపూర్ నియోజకవర్గంలో ముఖ్యమంత్రి పర్యటించనున్న ప్రాంతాలలో కలెక్టర్ జిల్లా స్థాయి అధికారులతో కలిసి ఏర్పాట్లను పర్యవేక్షించారు. పెంట్లవెల్లి మండలం జటప్రోల్‌లో నిర్వహిస్తున్న బహిరంగసభకు సంబంధించి అవసరమైన ఏర్పాట్లతోపాటు హెలిప్యాడ్, సభావేదిక, విఐపిలు, ప్రజలకు సంబంధించి ఏర్పాట్లను స్వయంగా పరిశీలించి అవసరమైన సలహాలు ,సూచనలు చేశారు. కలెక్టర్‌వెంట కొల్లాపూర్ ఆర్‌డిఓ భన్సిలాల్, ఎంపిడిఓ దేవేందర్, తహసీల్దార్ విజయ్‌సింహ, అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది ఉన్నారు.

**నేడు దిశకమిటీ సమీక్ష సమావేశం**

నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో నేడు (మంగళవారం) ఉదయం 10గంటలకు దిశ కమిటీ సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి నాగర్‌కర్నూల్ ఎంపి డాక్టర్ మల్లు రవి అధ్యక్షత వహించనున్నారు. కేంద్రప్రభుత్వం మార్గదర్శకాలను అనుసరిస్తూ , జిల్లాలో



అమలవుతున్న ప్రధాన సంక్షేమ, అభివృద్ధి పథకాలపై సమీక్ష చేయడం, ఈ సమావేశంలో కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల వివిధ పథకాలు, వాటి అమలుస్థితి, లబ్దిదారుల జాబితాలు, నిధుల వినియోగం, అమలులో ఎదురవుతున్న సమస్యలపై చర్చ జరగనుంది. విద్య, వైద్యం, బ్యాంకింగ్, ఉపాధిహామీ పథకం, ప్రధానమంత్రి అవాస్ యోజన, ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన, జాతీయ రహదారులు, ప్రజా పంపిణీ వ్యవస్థ, వివిధ శాఖలకు సంబంధించిన కేంద్ర, రాష్ట్రప్రభుత్వ పథకాలపై సమీక్ష జరుగుతుంది. ఈ సమావేశానికి సంబంధిత అన్నిశాఖల జిల్లాస్థాయి అధికారులందరూ శాఖలవారిగా పూర్తిస్థాయి ప్రగతి సమగ్ర సమాచారంతో హాజరు కావాలన్నారు.

## అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు



**ప్రజాపక్షం/అచ్చంపేట :** అర్హులైనవారందరికి ఇందిరమ్మ ఇండ్లు అందించాలనే ధృఢసంకల్పంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని ఐఎన్‌టిసి తాలుకా అధ్యక్షులు మహబూబ్ ఆలీ అన్నారు. సోమవారం పట్టణంలోని 12వవార్డులో ఇందిరమ్మ ఇండ్లకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమమేధ్యేయంగా ప్రజా ప్రభుత్వం పాలన అందిస్తుందని ఆయన కొనియాడారు. కార్యక్రమంలో పురపాలక చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు, మున్సిపల్ కమీషనర్ మురళి, మాజీ ఎంపిపి రామనాథం, కోఆప్షన్ మెంబర్ రాములు, టౌన్‌కాంగ్రెస్ అధ్యక్షులు రఘురాం, కాంగ్రెస్‌సీనియర్ నాయకులు మక్బూల్, లాలుయాదవ్, రాజేష్ పాల్గొన్నారు.

# ఓపెన్ స్కూల్ సొసైటీ గోడ పత్రిక విడుదల చేసిన కలెక్టర్



**ప్రజాపక్షం/నారాయణపేట్ :** తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ గోడ పత్రికను కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఛాంబర్లో విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడి మధ్యలో మానేసిన వారికి, పదవ తరగతి ఫెయిల్ అయ్యి 14 సంవత్సరాలు నిండిన వారికి పదవ తరగతి చదువుకునే సువర్ణ అవకాశం, 15 సంవత్సరాల నుండి పదవ తరగతి పూర్తి అయిన వారందరూ ఇంటర్మీడియల్ కోర్సు చదువుకునే అవకాశం లేదా ఇంటర్మీడియట్ మానేసిన వారికి, ఫెయిల్ అయిన వారికి ఇంటర్మీడియట్ చదువుకునే అవకాశం ఉంటుందని మహిళలకు పలు వృత్తి విద్య వ్యాపార రంగాల్లో ఉన్న వారికి ఉద్యోగులకు ప్రజా ప్రతినిధులకు వివిధ సంఘ సభ్యులకు, సామాజికంగా ఆర్థికంగా వెనుకబడిన వర్గాల వారికి ఇది ఒక చక్కటి అవకాశం అని అన్నారు. మహిళలకు ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ దివ్యాంగులకు ట్రాన్స్‌జెండర్‌లకు, మాజీ సైనిక ఉద్యోగాల పిల్లలకు ఫీజు రాయితీ కలదని ఇందుకు గరిష్ట వయసు పరిమితి లేదని అన్నారు. అదేవిధంగా ఉల్లాస్ సవ భారత సాక్షారత కార్యక్రమంలో భాగంగా జిల్లాలో అవగాహన కల్పించడం జరుగుతుందని కనీసం సామర్థ్యాలతో కూడిన లెక్కలు చేయడం విధానాలతో అక్షరాస్యత కార్యక్రమం అమలు చేయబడతాయని తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి డా.గోవింద రాజు మాట్లాడుతూ తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ కేంద్రాలలో అడ్మిషన్ జరుగుతున్నాయని అందరూ సద్వినియోగం చేసుకోవాలని అడ్మిషన్ కోసం జిల్లాలోని ఆయా సెంటర్లలలో సంప్రదించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా టాస్ కోఆర్డినేటర్ శ్రీనివాస్, ఎఎంఒ విద్యాసాగర్, మండల విద్యాశాఖ అధికారి బాలాజీ, డిఎస్‌ఓ భాను ప్రకాష్ పాల్గొన్నారు.

## జడ్చర్లలో యువతి అదృశ్యం



**ప్రజాపక్షం/జడ్చర్ల :** జడ్చర్ల పట్టణంలోని బురెడ్డిపల్లిరోడ్‌లో గల ఫామ్‌హౌస్‌లో పని చేస్తున్న గోపాలపూర్ గ్రామానికి చెందిన పాషా తన కుమార్తె కనిపించడం లేదని జడ్చర్ల పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సోమవారం నాడు ఇచ్చిన ఈ ఫిర్యాదు గురించి సిఐ కమలాకర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆదివారం నాడు రాత్రి విధులు ముగించుకొని ఇంటికి వచ్చి పడుకొన్నాడని మధ్యరాత్రి లేచి చూడగా తన కుమార్తె బెడ్ మీద లేదని గ్రహించి చట్టుపక్కల, బంధువులకు అడిగినా సమాచారం లేదని పేర్కొన్నారు. తమ కూతురు వద్ద ఉండే మొబైల్‌ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి ఉందని, ఎక్కడికి వెళ్ళింది అనే విషయం తెలుసుకొని తమ కుమార్తెను అప్పగించాలని కోరారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. ఇదిలా ఉండగా ఇటీవల వారం రోజుల్లో 3 యువతులు కనిపించకుండా పోయారని పట్టణంలో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు.

# నియోజకవర్గ అభివృద్ధికి పెద్దపీట

**ప్రజాపక్షం/వెల్దండ :** కల్వకుర్తి నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచన మేరకు అన్నిరంగాలలో వేగవంతమైన ప్రజా సంక్షేమ కార్యక్రమాలను స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అభీష్టం మేరకు రూపొందించి అభ్యున్నతి పథంలో నడిపించేందుకు తనవంతు కృషి చేసి సంక్షేమాన్ని సుస్థిరం చేస్తానని ఎంపి డాక్టర్ మల్లురవి అన్నారు. ఆదివారం మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు మోతిలాల్‌నాయక్, కిసాన్‌సెల్ తాలుకా అధ్యక్షులు పర్వత్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర మాజీ తక్కళ్లపల్లి శేఖర్, సేవాదల్‌జిల్లా ఉపాధ్యక్షులు పుల్లయ్య తదితరులు ఎంపి మల్లురవితో అభివృద్ధి, సంక్షేమ పథకాల పనితీరుపై భేటి అయ్యారు. ఈసందర్భంగా ఎంపి మల్లురవి మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి తాను ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో సంయుక్తంగా ప్రణాళికలు రూపొందించి వేగవంతమైన అభివృద్ధికోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అండతో గత ప్రభుత్వంలో ఆటకెక్కిన ప్రజా సమస్యలను గాడిలోకి తీసుకువచ్చి అధ్యధిక బడ్జెట్



కేటాయింపులు చేసి సంక్షేమానికి పెద్దపీటవేస్తూ సమగ్ర కార్యాచరణతో అభివృద్ధి చేస్తామన్నారు. స్థానిక ఎన్నికలలో కాంగ్రెస్‌పార్టీ గెలుపే ధ్యేయంగా ప్రతి కార్యకర్త కలిసికట్టుగా పనిచేసి అన్నిస్థానాలలో కార్యకర్తల, నాయకుల గెలుపుకోసం కృషిచేయాలన్నారు.

## పంటలకు మద్దతు ధర, గ్యారంటీ చట్టం చట్టబద్ధత చేయాలి




**ప్రజాపక్షం/కృష్ణ/మాగనూర్ :** నారాయణపేట జిల్లా కృష్ణ మాగనూర్ సంయుక్త మండలాల అఖిల భారత ఐక్య రైతు సంఘం జనరల్ బాడీ సమావేశం మాగనూరు మండల కేంద్రంలో అఖిల భారత ఐక్య రైతు సంఘం లక్ష్మి నరసింహస్వామి కళ్యాణ మండపంలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యవక్తగా ఏఐయుకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.రాము మాట్లాడుతూ దేశంలో నరేంద్ర మోడీ వ్యవహరిస్తున్న రైతు ప్రజా వ్యతిరేక విధానాలకు రైతులకు తెచ్చిన నూతన జాతీయ మార్కెట్ విధానాన్ని రద్దు చేయాలని, రైతుల పండించిన పంటలకు మద్దతు ధర గ్యారెంటీ చట్టాన్ని, స్వామినాథ్ సిఫారసును అమలు చేయలని, రైతులు పండించిన వరి పంటకు క్వింటాలుకు 500 బోనస్ ఇవ్వాలని, రైతులకు యూరియా కొరత లేకుండా చూడాలన్నారు. ఈ సమావేశానికి డి.ఆనంద్ అధ్యక్షత వహించారు. ఈ జనరల్ బాడీ సమావేవానికి అఖిలభారత ఐక్య రైతు సంఘం అధ్యక్షులు భగవంతు, కార్యదర్శి యాదగిరి, టియుసిఐ జిల్లా అధ్యక్షులు కిరణ్, పిడిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షులు భాస్కర్, రైతు సంఘం సంయుక్త మండల కార్యదర్శి రాజు, పివైఎల్ నాయకులు శంకరప్ప, పి.ఎల్లప్ప, వెంకటప్ప పాల్గొన్నారు.

# అక్రమ పట్టాలు రద్దు చేయాలని సిపిఐ ధర్నా




**ప్రజాపక్షం/వీపనగండ్ల :** వీపనగండ్ల మండలం బొల్లారంలో సర్వే నం. 618లో ముగ్గురు రైతుల అక్రమ పట్టాలను రద్దు చేయాలని సిపిఐ మండల శాఖ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అక్రమ పట్టాలను రద్దు చేయాలని, గ్రామ కంఠం భూమిగా ప్రకటించాలని, ఆ స్థలంలో ఇల్లు నిర్మించుకున్న వారికి పట్టాలు ఇవ్వాలని నినాదాలు చేశారు. బొల్లారం గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఇచ్చిన భూ ఫిర్యాదులను పరిష్కరించాలని తహసీల్దార్ వరలక్ష్మి కి వినతి పత్రం అందజేశారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు వంక గోపాల్ , మండల కార్యదర్శి ఎం. కురుమయ్య మాట్లాడుతూ బొల్లారం సర్వే నంబర్ 618లో 15 ఎకరాల 15 గుంటల భూమి ఉందన్నారు. 30 ఏళ్ల క్రితం ఆ భూమి పట్టాదారులు గ్రామస్తులకు ఇళ్ల స్థలాల కోసం భూమిని ఇచ్చారని, అప్పటి నుంచి ఇల్లు నిర్మించుకొని నివాసం ఉంటున్నారన్నారు. రెవెన్యూ రికార్డుల్లో ఆ భూమిని గ్రామ కంఠం భూమిగా నమోదు చేసి నివాసం ఉంటున్న వారి ఇండ్లకు పర్మిషన్ ఇవ్వాలని ఎమ్మార్వో, కలెక్టర్, ఎక్సైజ్ శాఖ మంత్రి కృష్ణారావుకు దరఖాస్తులు సమర్పించడం జరిగిందన్నారు. సమస్యలను పరిష్కరిస్తామని తహసీల్దార్ వరలక్ష్మి హామీనిచ్చారన్నారు. సమస్యలను పరిష్కరించకుంటే కలెక్టర్ ఆఫీస్ వద్ద ధర్నా చేస్తామని హెచ్చరించారు. బొల్లారం గ్రామ శాఖ కార్యదర్శి చలమారెడ్డి, నాయకులు వేమన్న, కృష్ణయ్య, తడకల వెంకటస్వామి, శివయ్య, దగడపల్లి కురుమయ్య, దేవరపాగా కురుమయ్య, చిన్న రాముడు తదితరులు పాల్గొన్నారు.

## నాగర్‌కర్నూల్ జిల్లా వ్యవసాయ అధికారిగా యశ్వంత్‌రావు



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** నాగర్‌కర్నూల్ జిల్లా వ్యవసాయ అధికారిగా యశ్వంత్‌రావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన నిర్మల్‌జిల్లా పిడిఎటిఎంఎ డైరెక్టర్‌గా విధులు నిర్వర్తించి బదిలీపై నాగర్‌కర్నూల్ జిల్లాకు వచ్చారు. ఇప్పటివరకు జిల్లా వ్యవసాయ అధికారి ఇంచార్జీగా విధులు నిర్వర్తించిన అచ్చంపేట డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు యం.చంద్రశేఖర్ తిరిగి అచ్చంపేట ఎడిఏగా బాధ్యతలు నిర్వర్తించనున్నారు.

## ఉన్నత చదువులతో సమాజంలో గుర్తింపు

**ప్రజాపక్షం/బిజినేపల్లి :** ప్రస్తుత సమాజంలో బాగా చదువుకొని ఉన్నతస్థాయికి చేరుకొని అందరిచే ప్రశంసలు అందుకోవాలని జిల్లా జూనియర్ రెడ్ క్రాస్ కోఆర్డినేటర్ గంగారాం, హిందీ పండిత్ కందుకూరి అశోక్‌కుమార్‌లు అన్నారు. సోమవారం మండల పరిధిలోని గంగారం ఉన్నత పాఠశాల పరిధిలోని తండాల ప్రాథమిక పాఠశాలతోపాటు హరిజనవాడ పాఠశాలల పేద విద్యార్థులకు ఇండియన్ రెడ్ సొసైటీ మహబూబ్‌నగర్ వారి సౌజన్యంతో ఉచితంగా 400మంది విద్యార్థులకు నోటుపుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజారాం ప్రకాష్, రత్నశేఖర్, మహ్మద్, రాజప్ప, కొములయ్య, శ్రీకాంత్, పిఎస్ ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీహరిగౌడ్, హరిజనవాడ ప్రధానోపాధ్యాయులు అనిత పాల్గొన్నారు.



# రీల్

సావిత్రికి కూడా సాధ్యం కాని రికార్డ్ సరోజా దేవి సొంతం...



## అందాల తార బి.సరోజాదేవి ఇక లేరు



తెలుగు చిత్రసీమను వరుసగా విషాద ఛాయలు అలుముకుంటున్నాయి. విలక్షణ నటుడు కోట శ్రీనివాస రావు మరణించి ఇరవై నాలుగు గంటలు గడవక ముందే అలనాటి సినీ నటి బి.సరోజాదేవి కన్నుమూశారు. 87 ఏళ్ల వయస్సులో వయోభారంతో బాధపడుతూ బెంగళూరులోని తన నివాసంలో తుదిశ్వాస విడిచారు. 1938 జనవరి 7, బెంగళూరులో జన్మించిన సరోజా దేవి తొలి సారి కన్నడ భాషలో మహాకవి కాళిదాస అనే చిత్రం చేసింది. ఈ చిత్రానికి జాతీయ అవార్డ్ కూడా అందుకుంది. సుమారు మూడు దశాబ్దాల పాటు తెలుగు, కన్నడ, తమిళ భాషల్లో 200కుపైగా చిత్రాల్లో నటించిన సరోజా దేవి నటించారు. భారత ప్రభుత్వం 1969లో పద్మశ్రీ, 1992లో పద్మభూషణ్, 2008లో లైఫ్ టైమ్ అచీవ్ మెంట్ పురస్కారాలతో సత్కరించింది. బెంగళూరులోనే పుట్టి అక్కడే స్థిరపడిన సరోజాదేవి 13 ఏళ్ల వయస్సులోనే రంగుల ప్రపంచంలో తెరంగ్రేటం చేశారు. 1955లో 'మహాకవి కాళిదాస' చిత్రంతో కన్నడ చిత్ర సీమకు పరిచయమైన సరోజాదేవి తొలి చిత్రానికే జాతీయ అవార్డు అందుకున్నారు. తెలుగులో 'పెళ్లిసందడి' చిత్రంతో తొలి అవకాశాన్ని అందుకున్నప్పటికీ ఆ చిత్రం కంటే ముందే 'పాండు రంగ మహాత్యం', 'భూకైలాస్' విడుదల కావడం సరోజాదేవికి మంచి గుర్తింపు తీసుకొచ్చాయి. ఎన్టీఆర్, ఏఎన్నార్, ఎంజీఆర్, బాలీవుడ్‌లో దిలీప్ కుమార్‌లతో అనేక చిత్రాల్లో సరోజాదేవి. నటించారు. తెలుగులో సీతారామ కళ్యాణం, జగదేకవీరుని కథ, శ్రీకృష్ణార్జున యుద్ధం, దాగుడు మూతలు, ఆత్మబలం, శకుంతల, దానవీర శూర కర్ణ, అల్లుడు దిద్దిన కాపురం వంటి చిత్రాల్లో నటించి తెలుగు ప్రేక్షకులకు అభిమానాన్ని చూరగొన్నారు. 29 ఏళ్లపాటు వరుసగా 161 చిత్రాల్లో లీడ్ రోల్‌లో నటించిన ఏకైక నటిగా సరోజాదేవి చరిత్ర సృష్టించారు. తమిళంలో సరోజాదేవి నటించిన 'ఇరంబుతిరై' చిత్రాన్ని హిందీలో 'పైగా' పేరుతో రీమేక్ చేశారు. అప్పుడే సరోజాదేవికి దిలీప్ కుమార్‌తో పరిచయం ఏర్పడింది. తర్వాత అనేక హిందీ చిత్రాల్లో కూడా నటించే అవకాశం ఆమెకు దొరికింది. ఎల్వీ ప్రసాద్ తీసిన 'ససురాల్' చిత్రం సరోజాదేవికి ఉత్తరాదిన మరింత పేరు తీసుకొచ్చింది. అక్కడి ప్రేక్షకులు సరోజాదేవిని మద్రాకా సుందర్ తారా అని అభివర్ణించేవారు. కథానాయకిగా మంచి స్థాయిలో ఉండగానే బెంగళూరుకు చెందిన ఇంజనీర్ శ్రీహర్షను వివాహం చేసుకున్నారు. వారికి ఇద్దరు కుమార్తెలు భువనేశ్వరి, పరమేశ్వరి, కుమారుడు గౌతం రామచంద్ర ఉన్నారు. 1986లో భర్త మరణం తర్వాత అంతకు ముందు అంగీకరించిన చిత్రాలను పూర్తి చేసిన సరోజాదేవి ఆ తర్వాత సినిమాల సంఖ్యను తగ్గించారు. బెంగళూరులోని తమ వ్యాపార వ్యవహారాలు, సేవ కార్యక్రమాలు చేస్తూ సేద తీరేవారు. తల్లి పేరుతో వైద్య శిబిరాలు నిర్వహించి పేదలకు ఉచిత వైద్యాన్ని అందించేవారు. కన్నడ ఫిల్మ్ డెవలప్ మెంట్ కార్పొరేషన్‌కు ఛైర్మన్‌గా కూడా సరోజాదేవి సేవలందించారు.





## అగ్రహారంలో అంబేద్కర్ టైటిల్ సాంగ్ ఆవిష్కరణ




భారత రాజ్యాంగ రూపశిల్పి బాబా సాహెబ్ అంబేద్కర్ సిద్ధాంతాల స్ఫూర్తితో రూపొందిన చిత్రం 'అగ్రహారంలో అంబేద్కర్'. పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ ఈ చిత్రం టైటిల్ సాంగ్ రిలీజ్ చేశారు. ఇప్పటికే పలు ప్రతిష్టాత్మక అంతర్జాతీయ చలనచిత్రోత్సవాలలో పురస్కారాలు అందుకున్న ఈ చిత్రాన్ని రామోజీ లక్ష్మ నోజీ ఫిలమ్స్ పతాకంపై మంతా కృష్ణచైతన్య స్వీయ దర్శకత్వంలో నిర్మించారు. హీరో కూడా ఆయనే కావడం విశేషం. 'అంబేద్కర్ భావజాలాన్ని విశ్వవ్యాప్తం చేయడమే లక్ష్యంగా తెరకెక్కిన ఈ చిత్రం టైటిల్ సాంగ్ రిలీజ్ చేసిన మందా కృష్ణకి ధన్యవాదాలు అని దర్శకుడు క్రిష్ణ చైతన్య చెప్పారు. చిత్రాన్ని సినిటేరియా మీడియా వర్క్స్ ద్వారా ప్రపంచవ్యాప్తంగా విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. కుల మత ప్రాంత వర్గ వైషమ్యాలకు అతీతంగా సమ సమాజ స్థాపన కోసం కృషి చేసిన అంబేద్కర్ కు గొప్ప నివాళిగా ఈ సినిమాను రూపొందించామని తెలిపారు.

## కే-ర్యాంప్ దీపావళికి




సక్సెస్ ఫుల్ హీరో కిరణ్ అబ్బవరం నటిస్తున్న కొత్త సినిమా 'కే–ర్యాంప్'. ఈ సినిమాను మూవీస్, రుద్రాంశ్ సెల్యులాయిడ్ బ్యానర్‌ల మీద సక్సెస్ ఫుల్ ప్రొడ్యూసర్ రాజేష్ దండ, శివ బొమ్మకు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. యుక్తి తరేజా హీరోయిన్‌గా నటిస్తోంది. జైన్స్ నాని దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాను దీపావళి పండుగ సందర్భంగా అక్టోబర్ 18న విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ సినిమా నుంచి 'రిచెస్ట్ చిల్లర్ గయ్' గ్లింప్స్ రిలీజ్ చేశారు.

## మహావతార్ నరసింహ విడుదల




హోంబలే ఫిలమ్స్ సమర్పణలో క్లీమ్ ప్రొడక్షన్స్ నిర్మించిన విజువల్ వండర్ 'మహావతార్ నరసింహ' సినిమాను గీత ఫిలిం డిస్ట్రిబ్యూషన్ సంస్థ విడుదల చేయనుంది. ఈనెల 25వ తేదీన తెలంగాణా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో గీత్ ఆర్ట్స్ డిస్ట్రిబ్యూషన్ ద్వారా థియేటర్ల లోకి విడుదల అవుతుంద్ని గీత ఆర్ట్స్ అధినేత అల్లు అరవింద్ తెలిపారు. యానిమేటెడ్ ఫ్రాంచైజీ విష్ణువు దశ అవతారాల పురాణ గాథను జీవం పోస్తుంది. ఇది అత్యాధునిక యానిమేషన్, భారతీయ పురాణాల బేస్డ్ కంటెంట్‌లో ఇంతకు ముందు ఎన్నడూ ప్రయత్నించని సినిమాటిక్ స్కేల్‌తో అలరించబోతోంది. మహావతార్ నర్సింహకు అశ్విన్ కుమార్ దర్శకత్వం వహించారు. మహావతార్ నరసింహ చిత్రం త్రిడీలో ఐదు భారతీయ భాషలలో 2025 జూలై 25న విడుదలవుతోంది

## 'హరి హర వీరమల్లు'కు యు/ఎ సర్టిఫికెట్

### 20న వైజాగ్‌లో ప్రీ రిలీజ్ వేడుక





పవన్ కళ్యాణ్ హీరోగా నటించిన 'హరి హర వీరమల్లు: పార్ట్ 1 సెన్సార్ కార్యక్రమాలు పూర్తయ్యాయి. ఈ సినిమాకు యు/ఎ సర్టిఫికెట్ లభించింది. 20న విశాఖపట్నంలో హరిహరవీరమల్లు ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహిస్తున్నారు. 17వ శతాబ్దపు మొఘల్ సామ్రాజ్యం నేపథ్యంలో తెరకెక్కిన చిత్రానికి జ్యోతి కృష్ణ, క్రిష్ జాగర్లమూడి దర్శకులు. చారిత్రక యోధుడు వీరమల్లు పాత్రలో పవన్ కళ్యాణ్ కనువిందు చేయనున్నారు. నిరంకుశత్వానికి వ్యతిరేకంగా.. న్యాయం, ధర్మం కోసం పోరాడిన వీరుడి ప్రయాణాన్ని ఈ చిత్రంలో చూడబోతున్నాం. బాబీ డియోల్ ప్రతినాయకుడిగా కనిపించనున్న ఈ చిత్రంలో నిధి అగర్వాల్, నర్గీస్ ఫఖ్రీ, నోరా ఫతేహి వంటి తారాగణం నటించింది. ఆస్కార్ విజేత ఎం.ఎం. కీరవాణి సంగీతం సమకూర్చారు. 'హరి హర వీరమల్లు'పై అంచనాలను మరింత పెంచుతూ.. వైజాగ్‌లో ఘనంగా ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించడానికి నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. ఈ వేడుకకు భారీ సంఖ్యలో అభిమానులు తరలివస్తారని భావిస్తున్నారు. 24న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. తెలుగు, హిందీ, తమిళం, కన్నడ మరియు మలయాళ భాషలలో విడుదలవుతున్న 'హరి హర వీరమల్లు' సినిమా అమెరికాలోలో ఇప్పటికే ఈ చిత్రం అడ్వాన్స్ సేల్స్‌కి అద్భుతమైన స్పందన లభిస్తోంది.

## పోలీస్ వారి హెచ్చరిక టికెట్ లాంచ్




తూలికా తనిష్క్ క్రియేషన్స్ బ్యానర్ పై అభ్యుదయ దర్శకుడు బాబ్జీ దర్శకత్వంలో బెల్లి జనార్ధన్ నిర్మాతగా ఈ నెల 18న ప్రేక్షకుల ముందుకు రానున్న చిత్రం 'పోలీస్ వారి హెచ్చరిక'. ఈ చిత్రానికి కిషన్ సాగర్, నళినీ కాంత్ సినిమాటోగ్రాఫర్స్‌గా పని చేయగా గజ్వేల్ వేణు ఈ చిత్రానికి సంగీతాన్ని అందించారు. శివ శర్వాణి ఈ చిత్రానికి ఎడిటింగ్ వర్క్ చేశారు. సోమవారం ఈ చిత్ర తొలి టికెట్ లాంచ్ చేసిన సందర్భంగా మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నటుడు సన్నీ అఖిల్ మాట్లాడుతూ... 'నాకు చిన్నప్పటి నుండి సినిమాలపైన ఉన్న ఆసక్తితో ఈ సినిమాలో మంచి పాత్రను పోషించాను. చిన్న వయసులోనే సినిమాను దగ్గర నుండి చూస్తూ ప్రతి విషయంలో దగ్గర ఉంది చూసుకోవడం వల్ల ఎంతో జ్ఞానం లభించింది. దానిని నేను అదృష్టంగా భావిస్తున్నాను అని అన్నారు.

## 18న 'సంత్ తుకారాం' విడుదల




లాహిరి లాహిరి లాహిరిలో సినిమాతో తెలుగు తెరకు హీరోగా పరిచయమైన ఆదిత్య ఓం ఇప్పుడు దర్శకుడిగా కూడా మారిపోయారు. ఆదిత్య ఓం స్వీయ దర్శకత్వంలో 'సంత్ తుకారాం' జీవిత కథ ఆధారంగా సినిమా రూపొందించారు. ఈ దేశంలో సంత్ తుకారాం ఒక ఆధ్యాత్మిక విప్లవాన్ని సృష్టించారు. ముఖ్యంగా మహారాష్ట్రలో ఆయనను చాలా ప్రముఖంగా పూజిస్తారు. ఆయన సిద్ధాంతాలను ప్రజలు ఆచరిస్తారు. ఇదే కథను తీసుకుని ఆదిత్య ఓం సినిమాగా తెరకెక్కించారు. సంత్ తుకారాం పాత్రను ఆదిత్య ఓం పోషించారు. షూటింగ్‌తో పాటు అన్ని పనులు పూర్తి చేసుకున్న ఈ సినిమాను ఈనెల 18న థియేటర్లలో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ చిత్రానికి గౌతమ్ నిర్మాతగా వ్యవహరించారు.

## 'జూనియర్' ప్రీ రిలీజ్



ప్రముఖ వ్యాపారవేత్త గాలి జనార్ధన్ రెడ్డి కుమారుడు కిరీటి రెడ్డి 'జూనియర్' సినిమాతో హీరోగా పరిచయం అవుతున్నారు. రాధా కృష్ణ ఈ జూనియర్ సరసన హీరోయిన్‌గా శ్రీలీల హీరోయిన్ నటిస్తోంది. వారాహి చలన చిత్రం బ్యానర్‌పై రజని కొర్రపాటి నిర్మిస్తున్నారు. ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ బెంగళూరులో ఘనంగా జరిగింది. కన్నడ సూపర్ స్టార్ శివరాజ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రీరిలీజ్ ఈవెంట్‌లో సూపర్ స్టార్ శివరాజ్ కుమార్ మాట్లాడుతూ జూనియర్ టీజర్, ట్రైలర్,పాటలు చూశాను. కిరీటి చాలా అద్భుతంగా డాన్స్ చేశాడు. తన పెర్ఫార్మన్స్ చాలా బాగుంది. కిరిటి రూపంలో మరో ప్రామిసింగ్ స్టార్ ఇండస్ట్రీకి వస్తున్నాడు. తను డాన్స్‌లో సూపర్ సీనియర్ అనిపిస్తున్నారు. అలాగే శ్రీలీల కూడా మంచి డ్యాన్సర్. వారి కెమిస్ట్రీ చాలా బాగుంది. జెనీలియా గుడ్ హ్యూమన్ బీయింగ్. తను ఈ సినిమాలో చాలా చక్కని పాత్ర పోషించారు. రవిచంద్రన్ అన్నతో నాకు ఎప్పటినుంచో స్నేహం ఉంది. ఆయన ఈ సినిమాలో అద్భుతమైన క్యారెక్టర్ చేస్తున్నారు. జూలై 18న రిలీజ్ అవుతున్న సినిమా చాలా పెద్ద విజయం సాధించాలని కోరుకుంటున్నాను అన్నారు.




## కమ్యూనిస్టు లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)



మావోయిస్టులను అమిత్ షా 2026 మార్చి వరకు అంతం చేస్తామని చెప్పడం దుర్మార్గం అన్నారు. మావోయిస్టులు అంటే ఎవరో కాదని వారు మనవాళ్లేనని ఆపరేషన్ కగార్ పేరు తో చంపడం అటవీక న్యాయమని ప్రశ్నించారు. అసలు దొంగలు మోడీ నుండి ముఖ్యమంత్రి వరకు ఉన్నారని దోపిడీ చేసిన వారిని చంపుతున్నారని చట్టాలు ఉన్నాయి కదా అని సూటిగా ప్రశ్నించారు. ఒక కమ్యూనిస్టు చనిపోతే 100 మంది కమ్యూనిస్టులు పుడతారని కమ్యూనిస్టు లకు మరణం లేదని దోపిడి ఉన్నంతవరకు మానవ సమాజం ఉన్నంత వరకు కమ్యూనిజం ఉంటుందని అన్నారు. ఎప్పటికైనా సమన్యాయం రావాలని, కాలం కలిసి వస్తే ఎప్పటికైనా సమ సమాజం వస్తుందని, ప్రశ్నించే వారికి కష్టాలు రావచ్చు కానీ అంతిమంగా గెలిచేది కమ్యూనిస్టులేనని దీమా వ్యక్తం చేశారు. జిల్లాలో ఉన్న అనేక సమస్యలు పరిష్కారం కావాలంటే పోరాటాల ద్వారానే సాధ్యమవుతుందని అన్నారు. జిల్లాలో అనేక సింగరేణి కార్మికుల సమస్యలు ఉన్నాయని వాటిని పరిష్కరించే దిశగా ప్రయత్నం చేస్తామని అన్నారు. జిల్లా కేంద్రంలో గుడిసెలు వేసుకొని జీవిస్తున్న గుడిసె వాసులకు పట్టాలి ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. రాబోయే స్థానిక సంస్థలు, మున్సిపల్ ఎన్నికల్లో అధిక స్థానాలు గెలుచుకునే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. అనంతరం రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లాలో సిపిఐ పార్టీ అనేక సమస్యలపై పోరాటాలు నిర్వహించిన చరిత్ర ఉందని, జిల్లా సమగ్ర అభివృద్ధి కోసం నిధులు కేటాయించాలన్నారు. భూపాలపల్లి జిల్లాలో ఇంజనీరింగ్ పాలిటెక్నిక్ కళాశాల, బొగ్గు ఆధారిత పరిశ్రమలు రావాలన్నారు. కాళేశ్వరం నీళ్ల గత ప్రభుత్వాలు తరలించుకు వెళ్లారని వాటిపై ఉద్యమించామన్నారు. భూపాలపల్లి జిల్లా సమగ్ర అభివృద్ధికి మహాసభలో అనేక తీర్మానాలు చేయడం జరిగిందని, రాబోయే రోజుల్లో జిల్లా అభివృద్ధికి ఉద్యమాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ మహాసభల్లో సిపిఐ జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్, జిల్లా సహాయ కార్యదర్శిలు గురిజేపల్లి సుధాకర్ రెడ్డి, పైళ్ళ శాంతి కుమార్, జిల్లా కౌన్సిల్ సభ్యులు క్యాథ రాజ్ సతీష్, కొరిమి సుగుణ, మాతంగి రామ్ చందర్, మామిడాల సమ్మిరెడ్డి, సిపిఐ పట్టణ కార్యదర్శి సోతుకు ప్రవీణ్ కుమార్, నేరెళ్ల జోసెఫ్, కుడుదుల వెంకటేష్, పెంట రవి సుమారు 1000 మంది పాల్గొన్నారు.

### సిపిఐ జిల్లా కార్యదర్శిగా కొరిమి రాజ్ కుమార్



ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి: భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ నూతన జిల్లా కమిటీని జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండలో జరిగిన మహాసభలు నిర్వహించారు. ఈ సభలకు సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కల్లపల్లి శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా హాజరైన మహాసభల్లో నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా కార్యదర్శిగా కొరిమి రాజ్‌కుమార్, జిల్లా సహాయ కార్యదర్శిలుగా గురుజపెల్లి సుధాకర్ రెడ్డి, పైళ్ల శాంతి కుమారులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 29 మంది కౌన్సిల్ మెంబర్స్, 11మంది జిల్లా కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. తిరిగి కొరిమి రాజ్ కుమార్ 5వ సారి జిల్లా కార్యదర్శిగా ఎన్నిక కావడం జరిగింది.

## ఘర్షణలు వద్దు

(మొదటి పేజీ తరువాయి)

వాణిజ్యచర్యలను తొలగించాల్సిన అవసరం ఉందని జైశంకర్ పదే పదే ఉద్ఘాటించారు. నిర్మాణాత్మకమైన, స్థిరమైన సంబంధాలు రెండు దేశాలకే కాకుండా యావత్ ప్రపంచానికీ ప్రయోజనం కలిగిస్తాయన్నారు. పరస్పర గౌరవం, పరస్పర ప్రయోజనాలు, సునితత్వాల ప్రాతిపదికపై సంబంధాలను ఈ విధంగా మనం ముందుకు తీసుకువెళ్ళగలుగుతామన్నారు. మంగళవారం తియాన్‌జిన్‌లో ప్రారంభం కానున్న ఎస్‌సిఓ (షాంఘై సహకార సంస్థ) సభ్యదేశాల విదేశాంగ మంత్రుల మండలి సమావేశంలో పాల్గొనేందుకు ఒకరోజు ముందుగానే జైశంకర్ బీజింగ్‌కు చేరుకున్నారు. రెండుదేశాల పర్యటనలో భాగంగా సింగపూర్ పర్యటన పూర్తిచేసుకుని బీజింగ్ వెళ్ళి చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీతో సమావేశమయ్యారు. రెండు దేశాలూ దూరదృష్టితో ఆలోచించి అందుకు అనుకూలంగా ద్వైపాక్షిక సంబంధాలను మెరుగుపరచుకోవాల్సిన అవసరం ఉందని జైశంకర్ ఆయనకు చెప్పారు. '2024 అక్టోబరులో మన నాయకులు కజన్‌లో సమావేశమైన తర్వాత రెండు దేశాలమధ్యా సంబంధాలు క్రమ క్రమంగా సానుకూల మార్గంలో ముందుకు వెళుతున్నాయి. ఈ సానుకూల మార్గాన్ని బాధ్యతాయుతంగా మనం మరింత ముందుకు తీసుకెళ్ళాల్సిన అవసరం ఉంది' అని చెప్పారు. గత ఏడాది అక్టోబరు 23వ తేదీన భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ, చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ ఇద్దరూ కజన్‌లో జరిపిన సమావేశాన్ని ఈ సందర్భంగా జైశంకర్ గుర్తుచేశారు. గాల్వాన్ లోయలో రెండు దేశాల సైనికుల మధ్య హింసాత్మకమైన ఘర్షణలు జరిగిన తర్వాత ఆ పరిస్థితిని చక్కదిద్దేందుకు, సాధారణ ద్వైపాక్షిక సంబంధాలను నెలకొల్పేందుకు అన్ని స్థాయిలలోనూ సంప్రదింపుల యంత్రాంగాలను పునరుద్ధరించాల్సిన అవసరాన్ని ఆనాడు నాయకులు ఇద్దరూ అంగీకరించారని గుర్తుచేశారు. 'గడచిన తొమ్మిది నెలలుగా రెండు దేశాలు ద్వైపాక్షిక సంబంధాలను సాధారణీకరించుకోవడంలో మంచి ప్రగతి సాధించాయి, సరిహద్దుల వెంబడి జరిగిన ఘర్షణ పరిష్కరించుకున్న ఫలితంగా ఈ పురోగతి సాధించగలిగాం, శాంతి–సుస్థిరతలను కొనసాగించేందుకు మనకున్న సామర్థ్యఫలితంగా ఈ పురోగతి సాధించాం'' అని చెప్పారు. ఇక సరిహద్దులలో వివిధ పాయింట్ల వద్ద సైన్యాలను వెనక్కు మళ్ళించడంతోపాటు సంబంధిత సమస్యలు కూడా అనివార్యంగా పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. ఇరుగుపొరుగున ఉన్న అతిపెద్ద ఆర్థికవ్యవస్థలున్న దేశాలుగా భారత్–చైనా సంబంధాల్లో అనేక కోణాలు ఉన్నాయన్నారు. ''రెండు దేశాల్లో పర్యటనల ద్వారా పరస్పర ప్రజా సంబంధాల పునరుద్ధరణ వల్ల ఖచ్చితంగా చైనా–భారత్‌లకు ప్రయోజనం చేకూరుతుంది. నిర్బంధాలతో కూడిన వాణిజ్య చర్యలను, ఆటంకాలను తొలగించేందుకు అనివార్యంగా ఇలాంటి చర్యలు తీసుకోవాలి, ఈ విషయాలకు సంబంధించిన వివరాలను తదుపరి చర్చల్లో మనం చర్చించగలమని ఆశిస్తున్నాను'' అని వాంగ్ యీకి జైశంకర్ చెప్పారు.

### దాపరికం లేకుండా మాట్లాడుకోవడమే ముఖ్యం

భారత విదేశాంగమంత్రి జైశంకర్ చైనా పర్యటనలో సోమవారం నాడు ఆ దేశ ఉపాధ్యక్షుడు హాన్ ఝెంగ్‌ను సమావేశమయ్యారు. రెండు దేశాలమధ్యా సంబంధాల సాధారణీకరణ పరస్పర ప్రయోజనాలకు దారితీసే ఫలితాలను ఇవ్వగలవన్న సందేశాన్ని తెలియజేశారు. ప్రస్తుతం సంక్లిష్టంగా ఉన్న ప్రపంచ పరిస్థితుల నేపథ్యంలో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలైన భారత్–చైనాలు ఎలాంటి దాపరికాలూ లేకుండా మాట్లాడుకోవాలని, అదే చాలా ముఖ్యమైన విషయమని, ఈ పర్యటనలో తాను అదే కోరుకుంటున్నాననీ జైశంకర్ అన్నారు. భారత్–చైనా దేశాలమధ్య దౌత్య సంబంధాలు ఏర్పడి ఈ ఏడాదితో 75 సంవత్సరాలు పూర్తవుతాయన్న విషయాన్ని కూడా ఆయన ప్రధానంగా ప్రస్తావించారు. అదేవిధంగా ఐదు సంవత్సరాల తర్వాత తిరిగి కైలాస మానస సరోవర్ యాత్ర పునఃప్రారంభం కావడంపట్ల హర్షం ప్రకటించారు. ఈ యాత్ర పునఃప్రారంభం కావడంతో భారత్‌లో విస్తారంగా ప్రశంసలు కురిశాయన్నారు. సింగపూర్ నుండి బీజింగ్ చేరుకున్న వెంటనే ఆయన చైనా ఉపాధ్యక్షుడితో సమావేశమయ్యారు. 2020లో చైనాతో ఘర్షణ తర్వాత ఆ దేశంలో జైశంకర్ పర్యటించడం ఇదే మొదటి సారి. కొద్ది నెలల కాలంలోనే రెండు దేశాలు పరిస్థితులను చక్కదిద్దుకునేందుకు అనేక చర్యలు తీసుకున్నాయని, ప్రగతి సాధించాయని చెప్పారు. సోషల్ మీడియాలో ఆయన పోస్టింగ్ పెడుతూ ఎస్ సి ఓ అధ్యక్ష బాధ్యతలు చేపట్టేందుకు చైనాకు భారత్ మద్దతు ఇస్తుందని ఆ దేశ ఉపాధ్యక్షుడు హాన్‌కు తెలియజేసినట్లు పేర్కొన్నారు. ఎస్ సి ఓ అధ్యక్ష బాధ్యతల్లో ఉన్న చైనా ఆ హోదాలోనే ఈ సమావేశానికి ఆతిథ్యం ఇస్తోంది.

## విలువ తెలుసుకోవాలి (మొదటి పేజీ తరువాయి)

అని జస్టిస్ నాగరత్న వ్యాఖ్యానించారు. 'సోషల్ మీడియాపై ఈ విభజన ధోరణిని అరికట్టాలి' అని జడ్జి అన్నారు. అంటే దాని అర్థం సెన్సార్‌షిప్ కాదని ధర్మాసనం స్పష్టం చేసింది. 'పౌరుల మధ్య సోదరభావం ఉండాలి' అని బెంచ్ చెప్పింది.వాక్ స్వేచ్ఛ, పౌరుల వ్యక్తీకరణపై మార్గదర్శకాలను రూపొందించడాన్ని పరిశీలించింది. రాజ్యాంగంలోని 19(2) ఆర్టికల్ కింద వాక్ స్వాతంత్ర్యం, భావ ప్రకటనా స్వేచ్ఛపై ఉన్న సహేతుకమైన పరిమితులను ధర్మాసనం నొక్కిచెప్పింది. వాటిని సరిగ్గానే ఉంచారని చెప్పింది. ఈ లోపు తదుపరి విచారణ వరకూ వజహత్ ఖాన్ అరెస్ట్ చేయకుండా మధ్యంతర రక్షణను పొడిగిస్తూ, పౌరుల వాక్ స్వాతంత్ర్యం, భావ ప్రకటన వ్యక్తీకరణకు సంబంధించిన స్వీయనియంత్రణ అనే పెద్ద సమస్యను పరిష్కరించండంలో సహాయపడాలని న్యాయవాదికి సూచించింది. వజహత్‌ఖాన్‌ను జూన్ 9న కోల్‌కతా పోలీసులు అరెస్ట్ చేశారు. తాను చేసిన పాత ట్వీట్‌లకు సంబంధించి అసోం సహా పశ్చిమబెంగాల్, మహారాష్ట్ర, హర్యానా తదితర రాష్ట్రాలలో తనపై ఎఫ్ఐఆర్‌లు, ఫిర్యాదులు నమోదు కావడాన్ని వ్యతిరేకిస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. పనోలీపై తాను దాఖలు చేసిన ఫిర్యాదుకు ప్రతీకారంగా అనేక రాష్ట్రాలలో తనపై ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయని, ఆ తర్వాత పనోలీని బెయిల్‌పై విడుదల చేశారని ఆయన వాదించారు.'నేను వాటి అన్నింటినీ తొలంగించి క్షమాపణలు కోరుతున్నాను'అని అతని న్యాయవాది చెప్పారు. పిటిషనర్ ప్రకారం..మొదటి ఎఫ్ఐఆర్ జూన్ 2నాటిదని పిటిషనర్ వజహత్‌ఖాన్ తరుపు న్యాయవాది వాదించారు.

## ఆగస్టులో అసెంబ్లీ

(మొదటి పేజీ తరువాయి)

ఆదేశించారు. తెలంగాణ శాసన మండలి భవనం పునర్నిర్మాణ పనులను రోడ్లు,భవనాల శాఖ అధికారులు, అగాఖాన్ సంస్థ ప్రతినిధులతో కలిసి గుత్తా సుఖేందర్ రెడ్డి సోమవారం పరిశీలించారు. అనంతరం గుత్తా సుఖేందర్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో రోడ్లు, భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, సిఎం కార్యదర్శి కె ఎస్ శ్రీనివాస రాజు, తెలంగాణ లేజిస్లేచర్ సెక్రెటరీ డాక్టర్ నరసింహ చార్యులు, ఇఎన్‌సి రాజేశ్వర్ రావు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ ఆగస్టు నెలలో శాసన సభ, శాసన మండలి సమావేశాలు నిర్వహించే అవకాశం ఉందని, అసెంబ్లీ పక్కనే ఉన్న ఈ భవనంలో శాసనమండలి సమావేశాలు నిర్వహించాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉందని వివరించారు. ఇప్పటి వరకు పూర్తయిన పనుల గురించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరా తీశారని అన్నారు. ఆగస్టు నెలలో శాసన మండలి సమావేశాలు పాత భవనంలోనే నిర్వహించాలని, ఇందులో ఎటువంటి జాప్యం చేయకుండా, పనులను వేగవంతం చేయాలని గుత్తా సుఖేందర్ రెడ్డి అధికారులకు సూచించారు.

## మహిళా డాక్టర్ ఆత్మహత్య

(మొదటి పేజీ తరువాయి)

ఇంట్లో భార్యకు తెలియడంతో తరుచూ గొడవలు జరుగుతున్నాయి. అమ్మాయి ప్రేమలో మునిగిపోయిన యువ డాక్టర్ పెళ్లి కూడా చేసుకోవాలని నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం..ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం బార్య డాక్టర్ ప్రత్యూష తో గొడవ జరిగినట్లు దీంతో హాసన్ పర్తిలో వారు నివాసం ఉంటున్న ఇంట్లోనే ప్రత్యూష ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఆమె కుటుంబ సభ్యులు చెబుతున్నారు. దీనిపై ఆమె కుటుంబ సభ్యులు హసన్ పర్తి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వరంగల్ కు చెందిన మృతురాలి తల్లి తంజావూరు పద్మావతి మాట్లాడుతూ అల్లాడి సృజన్ కార్డియాలజిస్ట్ గా మెడికవర్ హాస్పిటల్‌లో పని చేస్తున్నాడని,ఏడెనిమిది నెలల క్రితం రీల్స్ చేసే అమ్మాయి పరిచయం అయిన తరువాత తన కూతురును నిత్యం కొడుతున్నాడని తెలిపింది. ఆయన తండ్రి అల్లాడి మధుసూదన్, తల్లి అల్లాడి పుణ్యవతికి చెప్పినా వారు పట్టించుకోలేదని, వారితో పాటు రీల్స్ చేసే అమ్మాయి బానోతు శృతి లపై కేసు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. కాగా మృతురాలు డాక్టర్ ప్రత్యూష డెంటిస్ట్ గా ఎన్ఎస్ఆర్ హాస్పిటల్లో పనిచేస్తూ ఉండగా 2017 సంవత్సరంలో అల్లాడి సుజన్ కార్డియాలజిస్ట్ తో వివాహం అయిందని, పెళ్లి సమయంలో 30 తులాల బంగారం, ఒక కారు, 30 లక్షల రూపాయల నగదు కానుకలుగా ఇచ్చి పెళ్లి చేయగా వారికి ఇద్దరు పాపలు ఒక పాప పేరు జానుషా సృజన్, 07 సంవత్సరాలు, చిన్న పాప పేరు జెస్వికాస్ సృజన్, 07 నెలలు, ఇద్దరు పాపలు జన్మించారని, గత 8,9 నెలల నుండి డాక్టర్ సృజన్ సోషల్ మీడియా ద్వారా పరిచయమైన బానోత్ శృతి తో చనువుగా ఉంటూ ఇల్లీగల్ అఫైర్ పెట్టుకొని తన కూతురును శారీరకంగా మానసికంగా వేధించినాడని, ఇల్లీగల్ అఫైర్ గురించి డాక్టర్ ప్రత్యూష అడిగినప్పుడల్లా కొట్టడం హింసించడం చేయడం జరిగిందని ఫిర్యాదులో ఆమె పేర్కొన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com